www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 20-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 65 | హైదరాబాద్ సిటీ

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 7.50 తదుపరి చతుర్దశి; నక్షత్రం: అనూరాధ సా. 6.10 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా.11.48-1.24; దుర్ముహూర్తం: ఉ.10.06-10.58, మ.3.19-4.11; అమృతఘడియలు: ఉ.7.25-9.04; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.47

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

యూజీసీ-నెట్ పరీక్ష రద్దు

పరీక్ష సమగ్రతపై ఐ4సీ హెచ్చరికలు.. రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం

తదుపరి పరీక్ష తేదీ త్వరలో ప్రకటన.. బీజేపీపై ప్రియాంక గాంధీ ఫైర్

న్యూఢిల్లీ, జూన్ 19: నీట్ పరీక్ష ర్యాంకింగ్‌లు, గ్రేస్ మార్కుల వ్యవహారంతో అబాసుపాలై.. సుప్రీంకోర్టు ఆగ్రహానికి గురవుతున్న జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్‌టీఏ) తాజాగా మరో అపవాదును మూటగట్టుకుంది. ఆ సంస్థ దేశవ్యాప్తంగా నిర్వహించిన యూజీసీ-నెట్ పరీక్షను రద్దు చేస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ బుధవారం రాత్రి ప్రకటించింది. దేశంలోని విశ్వ విద్యాలయాలు, కళాశాలల్లో జూనియర్ రిసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్), పీహెచ్‌డీ

మిగతా 2వ పేజీలో...

సింగరేణిలో రాష్ట్రం వాటా 51%. కేంద్రం వాటా 49% మాత్రమే. అలాంటప్పుడు సింగరేణిని కేంద్రం ఎలా ప్రైవేటుపరం చేస్తుంది? సింగరేణి ప్రైవేటీకరణ అనేది పచ్చి అబద్ధం. కేసీఆర్ ఆడిన డ్రామా. గత పదేళ్లలో దేశంలో ఒక్క బొగ్గు గనినైనా ప్రైవేటీకరించామా? అలాంటప్పుడు సింగరేణిని ప్రైవేటుపరం చేస్తామనడం పెద్ద జోక్'.



సింగరేణిని ప్రైవేటీకరించం

కేసీఆర్ అసత్య ప్రచారం చేశారు

- ఆయన పదేళ్ల పాలనలో గనుల వేలాన్ని వ్యతిరేకించడంతో రాష్ట్రానికి వేల కోట్ల నష్టం
- రేవంత్ సర్కారు వేలాన్ని స్వాగతించింది
- బయ్యారంలో నాణ్యమైన ఉక్కు లేదు
- ఫోన్ ట్యాపింగ్‌పై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలి.. హరీశ్ ఫోన్‌నూ ట్యాప్ చేశారు
- పార్టీ సారథ్యం ఈటలకు అప్పగిస్తే స్వాగతిస్తా
- జగన్ నిర్లక్ష్యంతోనే పోలవరం జాప్యం.. ఐదేళ్లలో పూర్తి చేస్తాం
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదు
- 'ఆంధ్రజ్యోతి'తో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణిని ప్రైవేటుపరం చేసే ప్రసక్తే లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణిని ప్రైవేటుపరం చేస్తుందని ఎన్నికల్లో ఓట్ల కోసం బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ అసత్య ప్రచారం చేశారని, అదంతా ఆయన ఆడిన డ్రామా అని మండిపడ్డారు. కార్మికుల సంక్షేమమే ఎన్డీయే ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యమని కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఢిల్లీలోని తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక విషయాలు వెల్లడించారు. దేశంలో బొగ్గు మాఫియాను రాబోయే ఐదేళ్లలో కూకటివేళ్లతో

మిగతా 12వ పేజీలో...

60 బొగ్గు బ్లాకుల వేలం రేపే

- జాబితాలో తెలంగాణలోని శ్రావణపల్లి కూడా..
- హైదరాబాద్‌లో నిర్వహణ.. ప్రారంభించనున్న కిషన్‌రెడ్డి

14

విపత్తుల వేళ.. పంటల బీమా!

ఈసారి అక్టోబరులో బీమా చేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం

- వానాకాలం సీజన్ ముగిసే సమయానికి ప్రీమియం చెల్లింపు
- తగ్గనున్న ఆర్థిక భారం.. మూడు కేటగిరీలుగా టెండర్లకు నిర్ణయం!
- దిగుబడి తగ్గినా రైతుకు పరిహారం.. ఉచితంగా పంటల బీమా
- రాష్ట్ర సర్కారుపైనే 75% ప్రీమియం భారం.. 25% కేంద్రం చెల్లింపు
- ఫసల్‌బీమా గడువు దాటితే కేంద్రం ప్రత్యేక అనుమతికి అవకాశం

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగుకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో పంటల బీమా పథకం అమలుపై రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. జూన్, జూలై నెలల్లో పంటలకు బీమా చేయటం కంటే... సాగు మొదలైన నాలుగు నెలల తర్వాత అక్టోబరులో ప్రకృతి విపత్తులు సంభవించే అవకాశం ఉన్న సమయంలో క్రాప్ ఇన్సూరెన్స్ చేయాలనే ఆలోచనతో ఉన్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. దీంతోపాటు ఈసారి విభిన్నంగా.. వాతావరణ పరిస్థితులు, సాంకేతిక అంశాలను పరిగణనలోకి తీసుకొని మూడు విధాలుగా టెండర్లు పిలవాలనే నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్లు సమాచారం. జూన్‌తో మొదలయ్యే వానాకాలం సీజన్ జూలై, ఆగస్టు, సెప్టెంబరు వరకు



10 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు!

- మల్టీజోన్-1లో 19 జిల్లాల వారికి అవకాశం
- ఎస్‌జీటీలు, పండిట్లు, పీఈటీలకు ప్రమోషన్
- నేటి నుంచి జోన్-2లో ఎస్‌ఏల బదిలీలు

13

కామాంధుడు



మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై ఎస్సై అత్యాచారం!

- భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీస్ క్వార్టర్స్‌లో ఎస్సై భవానీసేన్ గౌడ్ దారుణం
- తుపాకీతో బెదిరించి లైంగిక దాడి
- ఘటనపై సీఎం రేవంత్ సీరియస్
- సర్వీస్ నుంచి భవానీసేన్ తొలగింపు
- గతంలోనూ ఓ యువతికి ఎస్సై వేధింపులు

14

కంచే చేను మేస్తే..



కన్నవాడే కడతేర్చాడు!

13 ఏళ్ల కూతురిపై కన్నేసిన తండ్రి కోరిక తీర్చలేదనే ఉన్మాదం

జుట్టు పట్టుకొని కొట్టి.. తలపై మోది.. ఊపిరాడకుండా చేసి హత్య

మియాపూర్‌లో ఘోరం

11 రోజుల తర్వాత వీడిన మిస్టరీ

14



అక్టోబరులో ఆర్ఆర్ఆర్

- ఉత్తర భాగానికి రెండు నెలల్లో టెండర్లు
- దేశంలో అత్యుత్తమ హైకోర్టును నిర్మించబోతున్నాం
- ఢిల్లీలో 22 అంతస్తుల్లో తెలంగాణ భవన్
- విజయవాడ హైవేపై బ్లాక్‌స్పాట్ల తొలగింపు పనులు
- రూ.5,600కోట్లతో హైదరాబాద్-బెంగళూరు హైవే
- ఆర్అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

13

నైపుణ్యాభివృద్ధి కేంద్రాలలో ప్రాధాన్యం!

రాష్ట్రానికి ఇవ్వాలని కిషన్‌రెడ్డికి పొన్నం విజ్ఞప్తి

13

కొత్త విద్యుత్ పాలసీ!

త్వరలో తీసుకొస్తాం.. రాష్ట్రంలో మిగులు విద్యుత్తు ఉంది.. రెప్పపాటు కూడా కోతలు లేవు

- పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చినా సరఫరాకు ఇబ్బంది లేదు
- బ్యాంకర్లకు మానవీయ దృక్పథం లేకపోతే చాలా నష్టం
- బలహీనవర్గాలకు రుణాలిస్తేనే సమగ్రాభివృద్ధి సాధ్యం
- సబ్సిడీల్లో వాటా ఇస్తున్నా బ్యాంకర్లు సహకరించట్లే
- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ భేటీలో డిప్యూటీ సీఎం భట్టి
- ప్రభుత్వ ప్రాధాన్యాలు గుర్తించి పనిచేయాలి: తుమ్మల

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే కొత్త విద్యుత్తు విధానాన్ని తీసుకురాబోతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో మిగులు విద్యుత్తు ఉన్నదని, రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేవని.. పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చినా విద్యుత్ సరఫరాకు ఇబ్బంది ఉండబోదని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ, పారిశ్రామికరంగాల

మిగతా 13వ పేజీలో...

6,33,777 కోట్లు

2024-25 సంవత్సరానికి బ్యాంకర్ల రుణ ప్రణాళిక

వరి, జొన్న, పత్తి సహా 14 పంటలకు

మద్దతు ధర పెంపు

- కేంద్ర క్యాబినెట్ తొలి సమావేశంలో నిర్ణయం
- రూ. 72,600 కోట్లతో మహారాష్ట్రలోని వధావన్‌లో అతి పెద్ద గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి ఆమోద ముద్ర
- తీరప్రాంత పవనశక్తి ప్రాజెక్టుల అమలుకు వీజీఎఫ్ స్కీమ్
- రూ. 2,254 కోట్లతో ఫోరెన్సిక్ ఇన్‌ఫ్రా విస్తరణకు ఓకే



న్యూఢిల్లీ, జూన్ 19: కేంద్రంలో కొత్తగా కొలువైన ఎన్డీయే సర్కారు రైతులకు తీపికబురు చెప్పింది. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం సమావేశమైన కొత్త క్యాబినెట్.. వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి, గోధుమ, పత్తి సహా 14 పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంపు సహా పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆయా పంటల ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం జోడించి ఈ ధరలను నిర్ణయించినట్టు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని మోదీ ఎల్లప్పుడూ రైతులకు ప్రాధాన్యం ఇస్తారని.. అందుకే మూడోసారి ఎన్నికయ్యాక ఆయన తీసుకున్న తొలి నిర్ణయం కూడా రైతుల కోసమేనని పేర్కొన్నారు. కనీస మద్దతు

మిగతా 2వ పేజీలో...

న్యాయం



శాంతియుత నిరసన తప్పు కాదు: హైకోర్టు

- వాక్‌స్వాతంత్ర్యాన్ని నేరంగా పరిగణించలేమని స్పష్టీకరణ
- ముందస్తు అనుమతి తీసుకోలేదంటూ టీవీవీ సభ్యులపై నమోదైన కేసు కొట్టివేత

అహేతుకం

ఉగ్రవాది నిజ్జర్‌కు కెనడా నివాళి

- ఖలిస్థానీ ఉగ్రవాది హతమై ఏడాదైన సందర్భంగా ఆ దేశ పార్లమెంటు మౌనం
- తీవ్రంగా స్పందించిన భారత్
- కనిష్క విమాన మృతులకు సంతాపం
- 23న కెనడాలోని ఓ పార్కులో కార్యక్రమం

2

ఏపీలో ప్రక్షాళన షురూ

- 19 మంది ఐఏఎస్‌లకు స్థాన చలనం
- శ్రీలక్ష్మి, రజత్ భార్గవకు నో పోస్టింగ్
- మురళీధర్ రెడ్డి, ప్రవీణ్ ప్రకాశ్‌కూ అంతే
- జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆదేశం
- జలవనరుల స్పెషల్ సీఎస్‌గా సాయిప్రసాద్
- సీఆర్డీయే కమిషనర్‌గా కాటమనేని భాస్కర్

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ పరిపాలనలో ప్రక్షాళన ప్రారంభమైంది. తొలి విడతలో 19 మంది ఐఏఎస్‌లకు స్థాన చలనం కలిగింది. ఒకటి రెండు రోజుల్లో మరికొందరు ఐఏఎస్‌లను బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. జగన్ హయాంలో వివాదాస్పదులుగా ముద్రపడిన అధికారులకు ప్రాధాన్యం తగ్గించారు. తటస్థంగా వ్యవహరించిన వారికి పెద్దపీట వేశారు. బుధవారం సాయంత్రం ఐఏఎస్‌ల బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. వివాదాస్పద ఐఏఎస్‌గా ముద్రపడిన శ్రీలక్ష్మికి పోస్టింగ్ ఇవ్వకుండా... సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయించారు. ఆమెతోపాటు రెవెన్యూ (ఎక్సైజ్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవకు కూడా పోస్టింగ్ ఇవ్వలేదు. వైసీపీకి వీరాభిమానిగా పని చేసిన డి.మురళీధర్ రెడ్డిని కూడా జీఏడీలో రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖలో వింత ఉత్తర్వులు, వివాదాస్పద నిర్ణయాలు

మిగతా 3వ పేజీలో...

ఏపీ కొత్త డీజీపీగా ద్వారకా తిరుమలరావు



కేంద్ర మంత్రి బండి సంజయ్ సాష్టాంగ ప్రణామం

కరీంనగర్‌కు ప్రణమిల్లిన సంజయ్

- కేంద్రమంత్రిగా తొలిసారి సొంత నియోజకవర్గానికి చేరుకోగానే నేలతల్లికి సాష్టాంగ నమస్కారం!
- కార్యకర్తలు, ప్రజలకే మంత్రి పదవి అంకితం
- 2028లో రాష్ట్రంలో అధికారం బీజేపీదే: సంజయ్

భగత్‌నగర్/మల్యాల/బెజ్జంకి/శంషాబాద్/బర్కత్‌పుర, జూన్ 19: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం తొలిసారి తన నియోజకవర్గానికి చేరుకున్నారు. కరీంనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు కేంద్ర మంత్రి సంజయ్‌ను గజమాలతో సత్కరించారు. కరీంనగర్ కమాన్ చౌరస్తాలో సంజయ్.. పుడమి తల్లికి ప్రణమిల్లారు. తెలంగాణ, కరీంనగర్ ప్రజలకు సాష్టాంగ

మిగతా 12వ పేజీలో...

జీరో ఎందుకయ్యాం?

- లోక్‌సభ ఓటమిపై జూలైలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమీక్ష
- త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల సంసిద్ధతపై చర్చ
- పార్టీ సంస్థాగత మార్పులపై దృష్టి పెట్టే అవకాశం



హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తాజా రాజకీయ పరిస్థితులు.. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకుగాను బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు జూలైలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం, తక్కువ సీట్లు దక్కడంతో అధికారాన్ని కోల్పోవడం.. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపీ స్థానాన్ని కూడా గెలవకపోవడం వంటివి.. బీఆర్ఎస్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటింగ్ శాతం కూడా పూర్తిగా పడిపోవడం ఆ పార్టీ నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో గులాబీ బాస్ పార్టీ శ్రేణులతో విస్తృతస్థాయి సమావేశం చేపట్టాలని భావించడం పట్ల సొంతపార్టీ నేతల్లో చర్చ కొనసాగుతోంది. ఎంపీ స్థాయి నేతల నుంచి గ్రామస్థాయి క్రియాశీల నాయకుల వరకు ఈ సమావేశంలో పాల్గొనేలా కారు పార్టీ కసరత్తు చేస్తోంది. ప్రధానంగా లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో వెనుకబాటుకు గల కారణాలను, క్షేత్రస్థాయిలో ప్రస్తుతం పార్టీ పరిస్థితి.. మరింత బలపడేందుకు ఏం

మిగతా 12వ పేజీలో...

భగభగ



బుధవారం ఢిల్లీలోని లోక్‌నాయక్ ఆస్పత్రిలోకి వడదెబ్బ బాధితుడిని తీసుకెళ్తున్న కుటుంబీకులు

ఢిల్లీకి వడదెబ్బ

- గడిచిన వారంలో 20 మంది మృత్యువాత
- నోయిడాలో ఒక్కరోజే 10 మంది మృతి!
- ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో బాధితులు
- నీటి కొరతతో సమస్య మరింత తీవ్రం
- 2 రోజుల్లో పరిష్కరించకపోతే నిరసన
- ప్రధానికి ఢిల్లీ నీటి మంత్రి అతిశీ లేఖ

2

20% వర్షపాతం లోటు

ఆశించిన స్థాయిలో లేని వర్షాలు: ఐఎండీ

నిజ్జర్‌కు కెనడా పార్లమెంటు నివాళి





న్యూఢిల్లీ, జూన్ 19: ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ మరణించి ఏడాది పూర్తయిన సందర్భంగా కెనడా పార్లమెంటు అతనికి నివాళి అర్పించింది. మంగళవారం పార్లమెంటులో సభ్యులు కొద్ది సేపు మౌనం పాటించారు. దీనిపై స్పందించిన భారత దేశం 1985లో ఎయిర్ ఇండియాకు చెందిన కనిష్క విమానాన్ని ఉగ్రవాదులు బాంబుతో పేల్చివేసిన ఘటనలో మరణించిన 329 మంది ప్రయాణికుల స్మారక కార్యక్రమాన్ని ప్రకటించింది. కెనడాలోని స్టాన్లీ పార్కు వద్ద ఉన్న సెపెర్లీ క్రీడామైదానంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు స్మారక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు వాన్‌కోవర్‌లోని భారత కాన్సులేట్ జనరల్ 'ఎక్స్'లో వెల్లడించారు. ప్రపంచానికే ముప్పుగా పరిణమించిన ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్ ముందుంటుందన్నారు. 2024 జూన్ 23న ఆ మృతుల 39వ వర్ధంతి అని తెలిపారు. 1984లో ఆపరేషన్ బ్లూస్టార్‌కు ప్రతీకారంగానే సిక్కు ఉగ్రవాదులు కనిష్క విమానాన్ని పేల్చివేసినట్లు ఆరోపణలు వచ్చాయి. కాగా, భారత్‌లో నిషేధిత ఉగ్రవాద సంస్థ ఖలిస్థానీ టైగర్ ఫోర్స్(కేటీఎఫ్)కు చీఫ్‌గా నిజ్జర్ వ్యవహరించాడు. భారతదేశం ప్రకటించిన 40 మంది ఉగ్రవాదుల జాబితాలో నిజ్జర్ పేరు కూడా ఉంది. సిక్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థలోనూ అతని భాగస్వామ్యం ఉంది. 2017లో భారతదేశంలోని లూథియానాలో బాంబు పేలుడు, పాటియాలాలో ఓ ఆలయం వద్ద బాంబు పేలుడులో అతని పాత్ర ఉన్నట్లు పంజాబ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. కెనడాలో గతేడాది జూన్ 18న నిజ్జర్‌ను కొందరు కాల్చి చంపారు. ఈ హత్యలో భారత ప్రభుత్వ పాత్ర ఉందని కెనడా ఆరోపించడంతో ఇరుదేశాల సంబంధాలు దెబ్బతిన్నాయి.

పార్కిన్సన్స్‌ను ఏడేళ్ల ముందే గుర్తించే పరీక్ష

లండన్, జూన్ 19: నాడీ వ్యవస్థను క్రమంగా క్షీణింపజేసి, కాళ్లు చేతులు వణకడం, మతిమరుపు వంటి సమస్యలు కలిగించే పార్కిన్సన్స్ వ్యాధిని ఇప్పటిదాకా లక్షణాలు ఆధారంగానే నిర్ధారిస్తున్నారు! అలా కాకుండా.. లక్షణాలు బయటపడడానికి ఏడేళ్ల ముందే ఆ మహమ్మారిని గుర్తించే సాధారణ రక్తపరీక్షను యూనివర్సిటీ కాలేజ్ లండన్ (యూసీఎల్) శాస్త్రవేత్తల నేతృత్వంలోని పరిశోధక బృందం అభివృద్ధి చేసింది. ప్రయోగాల్లో భాగంగా.. ర్యాపిడ్ ఐ మూమెంట్ బిహేవియర్ డిజార్డర్ (ఐఆర్‌బీడీ)తో బాధపడుతున్న 72 మంది రక్త నమూనాలను సేకరించి వాటిని మెషీన్ లెర్నింగ్ ఆధారంగా విశ్లేషించారు. ఐఆర్‌బీడీ సమస్యతో బాధపడేవారిలో 75 నుంచి 80% మంది మెదడులో ఆల్ఫా-సైన్యూక్లిన్ అనే ప్రొటీన్ అసాధారణంగా పేరుకుపోతున్నట్టు ఈ టూల్ గుర్తించింది. అలాగే.. ఆ 72 మందిలో 16 మంది పార్కిన్సన్స్ బారిన పడే ప్రమాదం ఉందని ఆ టూల్ సరిగ్గా అంచనా వేసినట్టు పదేళ్ల పరిశీలన అనంతరం తేలింది. "పార్కిన్సన్స్‌ను ముందే గుర్తిస్తే తొలి దశల్లోనే చికిత్స అందించి ఆ వ్యాధి పురోగతిని ఆపవచ్చు. లేదా నిరోధించవచ్చు" అని ఈ పరిశోధకులు చెప్పారు.

లోకం తీరు



విశ్వ జ్ఞాన కేంద్రంగా భారత్‌ను తిరిగి నిలబెడతా

» నలంద వర్సిటీ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో మోదీ

రాజ్‌గిర్ (బిహార్), జూన్ 19: విశ్వజ్ఞాన కేంద్రంగా భారత్‌ను తిరిగి నిలపడమే తన లక్ష్యమని ప్రధాని మోదీ ప్రకటించారు. బిహార్‌లోని నలంద యూనివర్సిటీ నూతన క్యాంపస్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. భారతీయ జ్ఞాన వారసత్వానికి నలంద చిహ్నమని, దేశాల మధ్య వారధిలా అది నిలబడి ఉందని తెలిపారు. "నలంద కేవలం పేరు కాదు. అదొక తారకమంత్రం. పుస్తకాలను తగలబెట్టవచ్చు, కానీ జ్ఞానాన్ని కాదు అనేందుకు నలంద అస్తిత్వమే తిరుగులేని నిదర్శనం" అని ఆయన అన్నారు. మరికొద్ది రోజుల్లో జరుపుకోబోతున్న ప్రపంచ యోగా దినం ప్రస్తావన తెస్తూ.. ప్రపంచానికి తన సంస్కృతిని భారత్ అందిస్తూనే ఉంటున్నది. భారత్‌ను విశ్వ జ్ఞాన కేంద్రంగా నిలపడంలో భాగంగా ఇప్పటికే తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు కోటి మందికి పైగా పిల్లలకు సాంకేతిక విషయాలను నేర్పిస్తున్నాయని, చంద్రయాన్, గగన్‌యాన్ మిషన్లు వారి జిజ్ఞాసను పెంచుతున్నాయని మోదీ వివరించారు. ఇదిలా ఉండగా, 12వ శతాబ్దంలో ముగ్గురు దండెత్తిన ఆఫ్ఘాన్లు నలంద వర్సిటీని ధ్వంసం చేశారు. విధ్వంస చరిత్రకు నిదర్శనంగా నలందలో మిగిలిన శిథిల భాగాలను మోదీ బుధవారం పరిశీలించారు. కొత్తగా నలందలో నెలకొల్పిన క్యాంపస్‌ను నెట్ జీరో పద్ధతిలో గ్రీన్ క్యాంపస్ రూపంలో దీనిని తీర్చిదిద్దారు. వంద ఎకరాల్లో విస్తరించిన క్యాంపస్‌లో సోలార్ ప్లాంట్లు, నీటి శుద్ధి కేంద్రాలు, జల పునర్వినియోగ ప్లాంట్లు, చెరువులు, ఇతర పర్యావరణ అనుకూల ఏర్పాట్లు ఉన్నాయి.

జూన్‌లో ఇప్పటివరకు 20% వర్షపాత లోటు

న్యూఢిల్లీ, జూన్ 19: నైరుతి రుతుపవనాలు కొంచెం ముందుగానే వచ్చినా ఆశించిన మేరకు వర్షపాతం మాత్రం నమోదు కాలేదు. ప్రస్తుత సీజన్‌లో జూన్ ఒకటి నుంచి ఇప్పటి వరకూ 20% వర్షపాతం లోటు నమోదైంది. అయితే, రాబోయే రెండు మూడు రోజుల్లో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, బిహార్, జార్ఖండ్, ఏపీ లోని పలు ప్రాంతాల్లో రుతుపవనాలు విస్తరణ మరింత ముమ్మరం ఉంటుందని భారత వాతావరణ విభాగం తెలిపింది. జూన్ 1 నుంచి 18 మధ్య కాలంలో 64.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ఇది సాధారణం కంటే 20 శాతం తక్కువని వెల్లడించింది. మే 30నాటికి కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు జూన్ 12 నాటికి కర్ణాటక, గోవా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు విస్తరించాయి.

పంజాబ్‌లో 10 వేల మంది పోలీసుల బదిలీ!

చండీగఢ్, జూన్ 19: పంజాబ్ సీఎం భగవంత్ మాన్ డ్రగ్ మహమ్మారిని నిర్మూలించడంలో భాగంగా అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. ఏకంగా 10 వేల మంది పోలీసులను బదిలీ చేయాలని ఆదేశించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఆఫీసరు వరకు మొత్తం 10 వేల మందికి స్థానచలనం కల్పించారు. ముఖ్యంగా మరిన్ని బదిలీలు ఉంటాయని ప్రకటించారు. డ్రగ్ విక్రయదారులతో పోలీసులకూ సంబంధాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ విషయమై అనేక ఫిర్యాదులు అందాయని చెప్పారు. కొన్ని చోట్ల ఎస్‌హెచ్‌వోలు 10 నుంచి 20 ఏళ్లుగా పనిచేస్తున్నారు. ఆలాంటి చోట్లలో పోలీసులపై ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. అందుకే 10 వేల మంది పోలీసులపై బదిలీ వేటు వేసినట్లు వెల్లడించారు.

తమిళనాడులో కల్తీసారాకు 13 మంది బలి

చెన్నై, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని కళ్లకుర్చి జిల్లా కరుణాపురంలో కల్తీ సారా తాగి 13 మంది మృతి చెందారు. మరో 60 మంది అస్వస్థతకు గురై వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు ప్రకటించారు. మంగళవారం రాత్రి సుమారు 75 మంది కల్తీసారా తాగారు. బుధవారం వేకువజామున వీరంతా వాంతులు, విరేచనాలు, కడుపులో మంటతో బాధపడుతుండటంతో కుటుంబీకులు వారిని ఆసుపత్రులకు తరలించారు. చికిత్స పొందుతూ 13 మంది మృతి చెందారు. మృతుల్లో మహిళ కూడా ఉన్నారు.

అమెజాన్ పార్సిల్‌లో నాగుపాము



బెంగళూరు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థ అమెజాన్‌లో వీడియో గేమ్‌కు సంబంధించిన ఎక్స్‌బాక్స్ కంట్రోలర్ బుక్ చేసుకున్న బెంగళూరు దంపతులకు వింత అనుభవం ఎదురైంది. ఆ సంస్థ నుంచి వచ్చిన పార్సిల్‌లో పాము ప్రత్యక్షమైంది. బెంగళూరు సర్జాపురలో నివసించే సాఫ్ట్‌వేర్ దంపతులు వారం కిందట అమెజాన్‌లో ఎక్స్‌బాక్స్ కంట్రోలర్‌ను ఆర్డర్ చేశారు. పార్సిల్ మంగళవారం రావడంతో తెరిచే ప్రయత్నం చేయగా.. నాగుపాము పార్సిల్‌లో ప్రత్యక్షమైంది. పార్సిల్ బాక్స్‌కు చుట్టిన ప్లాస్టిక్ టేప్‌కు పాము అతుక్కుపోయి ఉండడంతో బయటకు రాలేకపోయింది. వెంటనే ఆ పార్సిల్‌ను ఓ బకెట్‌లో ఉంచి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీనిపై అమెజాన్ కంపెనీ విచారం వ్యక్తం చేసింది. బాధితులు ఎక్స్‌బాక్స్ చెల్లించిన మొత్తాన్ని వాపసు చేసింది. విషపూరితమైన పాము ఎలా వచ్చిందనే దానిపై విచారణ జరుపుతామని పేర్కొంది.

స్వదేశీ ఆహారం కొనండన్న సునాక్‌పై ట్రోల్స్

లండన్, జూన్ 19: "మనం విదేశీ ఆహారం మీద ఆధారపడకూడదు. బ్రిటిష్‌వి కొనండి" అని బ్రిటన్ ప్రధాని సునాక్ పిలుపునివ్వడం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు యూజర్లు ఆయనకు మద్దతు తెలపగా మరికొందరు ఆది ఎన్నికల స్టంట్ తప్ప కాదంటూ విమర్శిస్తున్నారు. బ్రిటిష్ ఫేర్ దన్ని సునాక్ పోస్టు.. భారత స్వాతంత్ర్యోద్యమంలో మహాత్మా గాంధీ 'స్వదేశీ' విధానాన్ని గుర్తుచేస్తోందని మరికొందరు పేర్కొన్నారు. కాగా, జూలై 4న అక్కడ సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి.

ఏఐ ఊహో సుందరి



చిత్రంలో ఉన్న ఈ అమ్మాయి.. అమ్మాయి కాదు.. ఏఐ పుట్టించిన అందం. రాహుల్ చౌదరి అనే వ్యక్తి ఈ డిజిటల్ భామను సృష్టించారు. జారా శతావరి అని పేరు కూడా పెట్టారు. ఈ జారా ఇప్పుడు అందాల పోటీల్లో పాల్గొని టాప్ 10లో నిలిచింది. జారా లాంటి ప్రపంచవ్యాప్తంగా ఉన్న డిజిటల్ సుందరుల కోసం 'ఫ్యాన్ ఫ్వూ' అనే సంస్థ ఈ అందాల పోటీలను నిర్వహిస్తోంది. ఇందులో విజేతగా నిలిచిన డిజిటల్ సుందరికి 'మిస్ ఏఐ' అని టైటిల్ ఇవ్వనున్నారు. జారా ఈ రేసులో ఉంది.

ఢిల్లీకి వడదెబ్బ

గడిచిన వారం రోజుల్లో 20 మంది మృత్యువాత



ఢిల్లీలో ఓ ట్యాంకర్ వద్ద నీటికోసం ఎగబడుతున్న ప్రజలు

» నోయిడాలో ఒక్కరోజే 10 మంది మృతి!

» ఆస్పత్రుల్లో పదుల సంఖ్యలో బాధితులు

» వడదెబ్బ బాధితులకు వేగంగా చికిత్స అందించాలంటూ కేంద్రం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మండే ఎండలు, భీకరమైన వడగాలులు, తీవ్రమైన నీటి కొరత ఢిల్లీ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఎండలు, వడగాలులతో ఢిల్లీలో గడిచిన వారం రోజుల్లో 20 మంది చనిపోయారు. ఢిల్లీ పక్కనే ఉన్న నోయిడాలో ఒక్కరోజులోనే 10మంది మృత్యువాత పడ్డారు. వడదెబ్బతో ఢిల్లీలోని రామ్‌మనోహర్ లోహియా ఆస్పత్రిలో మే 27 నుంచి 45 మంది చేరారు. ఇక్కడ రెండు రోజుల్లోనే 9 మంది చనిపోయారు. సఫ్దర్ జంగ్ ఆస్పత్రిలో బుధవారం ఒక్కరోజే ఐదుగురు చనిపోయారు. ఈ హాస్పిటల్‌లో మొత్తంగా తొమ్మిది మంది చనిపోయారు. ఎల్ఎన్‌జే ఆస్పత్రిలో ఏడు రోజుల్లో ఇద్దరు మృతిచెందారు. ఆస్పత్రుల్లో చేరకుండా చనిపోతున్న వృద్ధుల సంఖ్య ఇంతకంటే ఎక్కువగా ఉంటుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ రాజధాని ప్రాంతంలో వడదెబ్బతో పదుల సంఖ్యలో బాధితులు చికిత్స పొందుతున్నారు.

మరణాల రేటు ఎక్కువగా..

ఢిల్లీలో వడగాలుల నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఆస్పత్రులకు మార్గదర్శకాలను జారీ చేసింది. వడదెబ్బతో వచ్చే రోగులకు త్వరగా చికిత్స అందించాలని సూచించింది. ఆస్పత్రుల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య మంత్రి నడ్డా కూడా బుధవారం సమీక్ష నిర్వహించారు. వడదెబ్బ బాధితుల కోసం ఆస్పత్రుల్లో ప్రత్యేకంగా విభాగాలు ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బతో ఆస్పత్రిలో చేరుతున్నవారిలో మరణాల రేటు అధికంగా ఉందని రామ్ మనోహర్ లోహియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ అజయ్ శుక్లా చెప్పారు. వారిని వీలైనంత త్వరగా ఆస్పత్రికి తరలిస్తేనే ప్రాణాలు కాపాడగలుగుతామన్నారు. వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు బయటకు రావొద్దని ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ సూచించింది. నెల రోజులుగా ఢిల్లీని వడగాలులు భయపెడుతున్నాయి. ఇక్కడ రోజువారీ కనిష్ఠ ఉష్ణోగ్రతలే 35 డిగ్రీల దాకా నమోదు అవుతున్నాయి. ఇది సాధారణం కంటే చాలా ఎక్కువ. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రోజూ 45డిగ్రీలు దాటి నమోదు అవుతున్నాయి. రాత్రిపూట కూడా వేడిగాలులు వస్తుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

హజ్ యాత్రలో 550 మంది మృత్యువాత!

ఎడారి దేశం సౌదీ అరేబియాల్లో మండే ఎండలు ఈ ఏడాది హజ్ యాత్రికుల్లో వందలాది మందిని బలిగొన్నాయి. యాత్రకు వచ్చిన వారిలో ఎండల కారణంగా 550 మంది చనిపోయారని దౌత్య అధికార వర్గాలు వెల్లడించాయి. వారి దేహాలు కాడిన ఓ ఆసుపత్రి ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతోంది. అయితే, దీనిపై సౌదీ అరేబియా ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. మరోవైపు, యాత్రికులలో 645 మంది మరణించారని అందులో 68 మంది భారతీయులు ఉన్నారని సౌదీ అరేబియాకు చెందిన దౌత్యవేత్త ఒకరు వెల్లడించారు. కాగా, ఈ ఏడాది ఐదు రోజుల హజ్ యాత్ర బుధవారంతో ముగిసింది.

నీటి కొరతను 2 రోజుల్లో పరిష్కరించండి

లేకపోతే నిరవధిక నిరాహార దీక్ష

ప్రధానికి ఢిల్లీ మంత్రి అతిశీ లేఖ



ఢిల్లీలో నీటి సంక్షోభాన్ని కేంద్రప్రభుత్వం రెండు రోజుల్లో పరిష్కరించాలని, లేకపోతే తాను శుక్రవారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేస్తానని ఢిల్లీ తాగునీటి సరఫరా మంత్రి అతిశీ ప్రధాని మోదీకి లేఖ రాశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ విషయాన్ని వెల్లడించారు. ఢిల్లీకి రావాల్సిన నీటి వాటాను హరియాణా ప్రభుత్వం సక్రమంగా విడుదల చేయడం లేదని ఆమె ఆరోపించారు. "ఢిల్లీకి రోజుకు 613 మిలియన్ గ్యాలన్ల నీటిని విడుదల చేయాల్సి ఉండగా మంగళవారం హరియాణా ప్రభుత్వం కేవలం 513 గ్యాలన్ల నీటిని మాత్రమే సరఫరా చేసింది. ఒక్కో మిలియన్ గ్యాలన్ల నీటిని 28,500 మంది వాడుకుంటారు. అంటే హరియాణా ప్రభుత్వం 28 లక్షల మందికి సరిపోయేంత నీటిని ఆపేసిందన్నమాట" అని వివరించారు.

టెస్టుల తర్వాతే యాంటీ బయాటిక్‌లు!

వైద్య సంస్థలకు ఎన్ఎంసీ మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, జూన్ 19: పేషెంట్లు ఆరోగ్య పరీక్షలు (డయాగ్నస్టిక్ టెస్టులు) చేయించుకున్న తర్వాత ఆ రిపోర్టుల ఆధారంగా, అవసరమైతేనే యాంటీబయాటిక్ ఔషధాలను సిఫారసు చేయాలని వైద్యులకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) సూచించింది. ఆరోగ్య పరీక్షలు జరగక ముందు యాంటీబయాటిక్‌లను సిఫార్సు చేయరాదని స్పష్టం చేసింది. దేశంలో యాంటీబయాటిక్ ఔషధాల వినియోగం విచ్చలవిడిగా పెరిగిపోయి యాంటీ మైక్రోబియల్ నిరోధకత ముప్పు తీవ్రంగా పొంచి ఉందని పేర్కొంది. కాగా, ఈ ఏడాది జనవరిలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్.. యాంటీబయాటిక్ ఔషధాలను సిఫారసు చేసిన ప్రతిసారీ అందుకు కారణాలను ప్రిస్క్రిప్షన్‌పై స్పష్టంగా రాయాలని వైద్యులకు ఆదేశాలు జారీ చేసింది.

గాలి కాలుష్యంతో 81లక్షల మంది మృతి

న్యూఢిల్లీ, జూన్ 19: 2021లో ప్రపంచవ్యాప్తంగా వాయుకాలుష్యం కారణంగా 81 లక్షల మంది చనిపోయారని, ఇందులో భారత్‌లో 21 లక్షల మరణాలు నమోదయ్యాయని బుధవారం విడుదలైన నివేదిక పేర్కొంది. యూనిసెఫ్ భాగస్వామ్యంతో అమెరికాకు చెందిన హెల్త్ ఎఫెక్ట్ ఇన్‌స్టిట్యూట్ (హెచ్ఈఐ) ఈ నివేదికను ప్రచురించింది. 2021 సంవత్సరంలో భారత్‌లో ఐదేళ్లకన్నా తక్కువ వయస్సున్న 1,69,400 మంది చిన్నారులు వాయుకాలుష్యం వల్ల మరణించినట్టు నివేదిక పేర్కొంది. 2021లో ప్రపంచవ్యాప్తంగా సంభవించిన మొత్తం మరణాల్లో 12 శాతం వాయు కాలుష్యం వల్లనేనని వివరించింది.

యూజీసీ-నెట్ పరీక్ష రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ప్రవేశాలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ కొలువులకు అర్హతకు ఎన్‌టీఏ ఏటా జూన్, డిసెంబరు సెషన్లలో జాతీయ అర్హత పరీక్ష(యూజీసీ-నెట్)ను నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.! జూన్ సెషన్‌కు సంబంధించి దేశవ్యాప్తంగా మంగళవారం రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగాయి. 11 లక్షల మంది అభ్యర్థులు ఈ సెషన్‌కు దరఖాస్తు చేసుకోగా.. తొమ్మిది లక్షల మంది పరీక్ష రాశారు. అయితే.. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేసే సైబర్ క్రైమ్ హెచ్చరికల విశ్లేషణ యూనిట్- ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) యూజీసీ-నెట్ పరీక్ష సమగ్రతకు భంగం(లీకేజీ అనుమానాలు!) వాటిల్లినట్లు బుధవారం కేంద్ర ప్రభుత్వానికి సమాచారమిచ్చింది. దీంతో.. ఆ పరీక్షను రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. "యూజీసీ-నెట్‌లో అత్యున్నత స్థాయి పారదర్శకత, ప్రమాణాలను.. పరీక్ష పవిత్రతను కాపాడేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం" అని ఓ ప్రకటనలో పేర్కొంది. తదుపరి పరీక్ష తేదీని త్వరలో వెల్లడిస్తామని స్పష్టం చేసింది. నిజానికి యూజీసీ-నెట్‌ను ఇప్పటివరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ)గా నిర్వహించేవారు. ఎన్‌టీఏ మొదటిసారి పేపర్/పెన్/ఓఎంఆర్ షీట్ రూపంలో మంగళవారం పరీక్ష నిర్వహించింది. ఈ విధానంలో పరీక్షను నిర్వహించడం వల్ల ప్రశ్నపత్రం లీకై ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, "బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యం, అవినీతితో యువత జీవితాలతో చెలగాటమాడుతోంది" అని ప్రియాంక గాంధీ అన్నారు.

నీట్ అక్రమాలపై నిరసనల యుద్ధం

రేపు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆందోళనలు.. అన్ని రాష్ట్రాల పీసీసీ చీఫ్‌లకు ఇప్పటికే లేఖలు

» పార్లమెంటు సమావేశాల్లోనూ పోరు

న్యూఢిల్లీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీట్ అక్రమాలపై దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ సిద్ధమైంది. ఆ పరీక్ష నిర్వహణలో మోదీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ.. పేపర్ లీకేజీలతో అన్యాయానికి గురైన విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం (21న) అన్ని రాష్ట్రాల్లోని తమ పార్టీ ప్రధాన కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ మేరకు అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, పార్టీ శాసనసభాపక్ష నేతలకు లేఖ రాశారు. సీనియర్ నాయకులు, కార్యకర్తలు అందరూ ఈ ఆందోళనలలో పాల్గొనాలని ఆదేశించారు. బిహార్, గుజరాత్, హరియాణాలో చేసిన అరెస్టులతో.. నీట్ నిర్వహణలో వ్యవస్థీకృత అవినీతి జరిగిందని స్పష్టమవుతోందన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో మాల్ ప్రాక్టీస్ జరుగుతోందని ఈ అరెస్టులతో తేలిపోయిందన్నారు. సోమవారం నుంచి కొత్త లోక్‌సభ తొలి సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో నీట్ అక్రమాలపై ఉద్యమపోరు కాంగ్రెస్ సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. ఇక.. పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను బీజేపీ వ్యవస్థీకృతం చేస్తోందని ఆప్ పార్టీ ఎంపీ సందీప్ పాఠక్ ధ్వజమెత్తారు. నీట్ నిర్వహణలో అక్రమాలపై ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని.. కేంద్ర విద్యాశాఖ మంత్రిని సస్పెండ్ చేయాలని.. లేదా ఈ అవకతవకలకు బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఆప్ యువ విభాగం నేతలు.. నీట్ పరీక్ష రద్దు కోరుతూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ ఇంటి బయటన నిరసనకు దిగారు. ఇదిలా ఉండగా, నీట్‌లో అక్రమాలు, అరెస్టులపై కేంద్ర విద్యాశాఖ బిహార్ పోలీసుల నుంచి నివేదిక కోరింది.



నీట్‌పై గురుగ్రామ్‌లో ఆప్ నేతలు నిరసన

నకిలీ పత్రాలతో కోర్టుకు..

జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ తన నీట్ ఫలితాన్ని వెల్లడించలేదని, తన ఓఎంఆర్ షీట్ చినిగిపోయినట్టు తెలిపిందని పేర్కొంటూ ఆయుషి పటేల్ అనే విద్యార్థిని అలహాబాద్ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. తన ఆరోపణలకు సంబంధించి ఆమె నకిలీ పత్రాలను కోర్టుకు సమర్పించిందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆయుషి ఆరోపణలను అప్పట్లోనే ఎన్‌టీఏ తీవ్రంగా ఖండించింది. ఆమె ఓఎంఆర్ షీట్ చినిగిపోలేదని, ఆమెకు 335 మార్కులు వచ్చాయని ప్రకటించింది. కానీ ఈ మార్కులు తనవి కావని.. వేరొకరి నంబరుతో తనకు ఆ మార్కులు ఇచ్చారని వాదిస్తూ ఆయుషి ఓ వీడియోను విడుదల చేసింది. కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ ఆ వీడియోను షేర్ చేశారు.

మద్దతు ధర పెంపు

వరి, జొన్న, పత్తి సహా 14 పంటలకు

(మొదటి పేజీ తరువాయి)

ధర అనేది.. ఉత్పత్తి ఖర్చుకు ఒకటిన్నర రెట్లు ఉండాలంటూ 2018 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన విధాన నిర్ణయాన్ని ప్రకటించిందని ఆయన గుర్తుచేశారు. బుధవారం కేబినెట్ తీసుకున్న నిర్ణయం అందుకు అనుగుణంగానే ఉందని తెలిపారు. దేశవ్యాప్తంగా పలు జిల్లాలు, తాలూకాల్లో.. 'కమిషన్ ఫర్ అగ్రికల్చరల్ కాస్ట్ అండ్ ప్రైసెస్' నిర్వహించిన అధ్యయనం ఆధారంగా పంట ఉత్పత్తి ఖర్చును శాస్త్రీయంగా లెక్కించినట్టు మంత్రి వివరించారు. తాజాగా ప్రకటించిన మద్దతు ధరల్లో వరికి గతేడాదితో పోలిస్తే రూ.117 పెరిగింది. కనీస మద్దతు ధరలను పెంచుతూ కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో.. రైతులు నిరుటితో పోలిస్తే రూ.35 వేల కోట్ల మేర అదనంగా లబ్ధి పొందుతారని అంచనా. కాగా.. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలంటూ పంజాబ్ రైతులు డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఆ డిమాండ్లతోపాటు.. హరియాణా, మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల శాసనసభలకు ఈ ఏడాది ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కేంద్రం మద్దతు ధరలను పెంచడం గమనార్హం.

మరికొన్ని నిర్ణయాలు..

14 పంటలకు కనీస మద్దతు ధర పెంపుతో పాటు కేంద్ర క్యాబినెట్ తీసుకున్న మరికొన్ని కీలక నిర్ణయాలు..

పంట	మద్దతు ధర (క్వింటాలుకు)	
వరి	సాధారణ	రూ.2,300
	గ్రేడ్ ఏ	రూ.2320
జొన్న	హైబ్రిడ్	రూ.3,371
	మాల్దండి	రూ.3,421
పత్తి	మధ్యరకం	రూ.7,121
	పొడుగు పింజ	రూ.7,521
సజ్జలు		రూ.2,625
రాగులు		రూ.4,290
మొక్కజొన్న		రూ.2,225
కందులు		రూ.7,550
పెసర్లు		రూ.8,682
మినుములు		రూ.7,400
వేరుశనగ		రూ.6783
పొద్దుతిరుగుడు		రూ.7,280
సోయాబీన్ (ఎల్లో)		రూ.4,892
నువ్వులు		రూ.9,267

● మహారాష్ట్రలోని వదావన్‌లో రూ.76,200 కోట్లతో భారీ గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి ఆమోదం. నిర్మాణం పూర్తయితే.. ప్రపంచంలోని టాప్-10 పోర్టుల్లో ఒకటిగా ఇది నిలిచే అవకాశం ఉందని అంచనా.

● తీర ప్రాంత పవనశక్తి ప్రాజెక్టులకు సంబంధించి.. రూ.7,453 కోట్లతో వయబులిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) స్కీమ్ అమలుకు పచ్చజెండా. తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాల్లోని తీర ప్రాంతాల్లో 500 మెగావాట్ల చొప్పున నిర్మించే ఒక గిగావాట్ పవనశక్తి కేంద్రాల నిర్మాణానికి అయ్యే రూ.6,853 కోట్లు ఈ పథకం ద్వారానే ఖర్చుపెట్టనున్నారు.

● రూ.2,870 కోట్లతో.. వారాణసీ నగరంలోని లాల్ బహదూర్ శాస్త్రి అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధి ప్రతిపాదనకు అంగీకార ముద్ర. ఆ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవన నిర్మాణంతోపాటు, రన్‌వేను విస్తరణకు చేసిన ప్రతిపాదనలను క్యాబినెట్ ఆమోదించింది.

● రూ.2,254 కోట్ల ఖర్చుతో.. 2024-2029 నడుమ దేశవ్యాప్తంగా ఫోరెన్సిక్ మౌలిక సదుపాయాల విస్తరణకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ఈ నిధులతో.. ఫోరెన్సిక్ ల్యాబుల ఏర్పాటు, ఢిల్లీలో ఉన్న నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీకి దేశవ్యాప్తంగా కొత్త క్యాంపస్‌ల అభివృద్ధి వంటి పనులు చేపట్టనున్నారు.

మన ఈవీఎంలు వేరే లెవల్!

» వాటిని మరో పరికరంతో అనుసంధానించడం కుదరదు

» ఈవీఎంల రూపకల్పనలో సహకరించిన ఐఐటీ ప్రొఫెసర్ల వివరణ

న్యూఢిల్లీ, జూన్ 19: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)ల ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఇటీవల చేసిన వ్యాఖ్యలతో వాటి విశ్వసనీయతపై ఆందోళన మొదలైంది. ఈవీఎంల హ్యాకింగ్‌ సాధ్యమేనని, లేకపోతే వాటిని పూర్తిగా రద్దు చేయాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీతోపాటు విపక్ష నేతలు కేంద్ర ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేశారు. అయితే భారతీయ ఈవీఎంలు పూర్తి సురక్షితమైనవని, అవి ట్యాంపరింగ్ ప్రూఫ్ అని పలువురు భారతీయ ఇంజనీర్లు, డొమైన్ నిపుణులు పేర్కొంటున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించిన ఎం3 (మోడల్ 3) ఈవీఎంలో బహుళ భద్రతా ఫీచర్లు ఉన్నాయని వీటిని రూపొందించడంలో సహకరించిన ఐఐటీ ప్రొఫెసర్లు చెబుతున్నారు. ఈవీఎం ఒక సాధారణ కాలిక్యులేటర్ వంటిదని, దాన్ని హ్యాక్ చేయలేమని ఐఐటీ గాంధీనగర్ డైరెక్టర్, ఈవీఎం టెక్నికల్ ప్యానెల్‌లో సభ్యుడు రజత్ మూనా తెలిపారు. 2019లో ప్రవేశపెట్టిన ఎం3 మెషీన్లు ట్యాంపరింగ్ చేస్తే అందులోని ఆటో మేటెడ్ ఫంక్షన్లు, సాంకేతికత వెంటనే ఫ్యాక్టరీ రీసెట్ చేసేస్తాయన్నారు. వీటిని ఇంటర్నెట్‌తో, మరే ఇతర పరికరాలను అనుసంధానం చేయడం సాధ్యం కాదని చెప్పారు. ప్రపంచంలోని ఇతర ఈవీఎంలకంటే భారత ఈవీఎంలు భిన్నం. ఎం3 ఈవీఎంలకు ఇతర పరికరాలతో ఎలాంటి కనెక్షన్ ఉండదు. వీటిని కేవలం ఓటింగ్ కోసమే రూపొందించారు. వాటిలో వేరే ఇతర సాఫ్ట్‌వేర్‌గాని, ప్రోగ్రామ్‌లను గాని లోడ్ చేయలేం అని ఐఐటీ బాంబేలో గౌరవాచార్యుడు, మైక్రో ఎలక్ట్రానిక్ నిపుణుడు దినేశ్ శర్మ పేర్కొన్నారు.

అనేక తనిఖీలు.. భద్రత ఏర్పాట్లు



అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించడం, థర్డ్ పార్టీ సాఫ్ట్‌వేర్ సమీక్షలతోపాటు ఈవీఎంలను అనేక తనిఖీలు నిర్వహిస్తారని నిపుణులు చెబుతున్నారు. నాసిక్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నుంచి కలర్ నోట్లకు ఉపయోగించే సురక్షితమైన కాగితంతో వీటిని సీల్ చేస్తారు. అభ్యర్థులు, వారి ప్రతినిధుల నిరంతర పర్యవేక్షణలో, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ఈవీఎంలను భద్రపరుస్తారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం సార్వత్రిక ఎన్నికలప్పుడు ర్యాండమ్‌గా ఎంపిక చేసిన 20,625 వీవీప్యాట్ల స్లిప్‌లను కంట్రోల్ యూనిట్ల నుంచి సేకరించి, వాటిని ఈవీఎంలలో నమోదైన ఓట్లతో సరిపోల్చారు.



బాధ్యతలు స్వీకరించిన పవన్ కల్యాణ్

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బుధవారం విజయవాడలోని తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ పర్యావరణ శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పేద ప్రజల కోసం అందరి సహకారంతో త్రికరణ శుద్ధితో పనిచేసి పథకాల ఫలాలు అందిస్తామని చెప్పారు. - అమరావతి, ఆంధ్రజ్యోతి



పేదలున్నారు..

తాడేపల్లి ప్యాలెస్ నిర్మాణంలో ఉన్నప్పటి చిత్రమిది! బకింగ్ హామ్ కెనాల్, దాని కట్టపైన రోడ్డు, ఆ పక్కనే సామాన్యులు ఎప్పటి నుంచో నివసిస్తున్న ఇళ్లు, రోడ్డు... ఒకప్పుడు తాడేపల్లి ప్యాలెస్ ప్రాంతం ఇలా ఉండేది.



పేదల ఇళ్లను కూల్చేసి..

తాడేపల్లి ప్యాలెస్ నిర్మాణం పూర్తయి... జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత తీసిన చిత్రమిది! బకింగ్ హామ్ కెనాల్ కరకట్టపై రోడ్డు మాయమైంది. ఆ పక్కనే ఉన్న పేదల ఇళ్లను కూల్చేసి... వారందరినీ అక్కడి నుంచి తరిమేశారు. ఆ స్థానంలో మొక్కలు, పూదోటలు పెంచారు. చిన్నగా ఉన్న రహదారి కాస్తా... విశాలంగా మారింది.

పేదలను తరిమిన పెత్తందారు!

జనం రహదారికి అడ్డు గేట్లు.. తాడేపల్లి ప్యాలెస్ కోసం దారుణాలు

'నేను బాగుండాలి. నా ప్యాలెస్ భద్రంగా ఉండాలి. జనం ఏమైపోయినా, ఎన్ని కష్టాలు పడినా ఫర్వాలేదు!'... ఇదీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలసీ! తాడేపల్లిలో ఆయన కట్టుకున్న ప్యాలెస్ విలాసాలే దీనికి నిదర్శనం. ఈ ఐదేళ్లూ ప్యాలెస్ చుట్టుపక్కల అడుగు పెట్టేందుకు వీల్లేకుండా వందలమంది పోలీసులను మోహరించారు. గేట్లు పెట్టారు. దారులు మూశారు. ఇప్పుడు... 'తాడేపల్లి'కి స్వేచ్ఛ లభించింది. ప్రభుత్వ ధనంతో 'ముఖ్యమంత్రికి మాత్రమే' వేసుకున్న రహదారులు సామాన్యులకూ తెరుచుకున్నాయి. సొంత ఇంటికి వెళ్లేందుకూ స్థానికులు గుర్తింపు కార్డులు చూపించాల్సిన దుస్థితి తొలగిపోయింది. పక్కనే ఉన్న పొలానికి రైతులు చుట్టూ తిరిగితిరిగి వెళ్లాల్సిన కష్టం దూరమైంది. ముఖ్యమంత్రిగా జగన్ చేసిన అరాచకాలన్నీ ఇప్పుడు కెమెరా కళ్లకు చిక్కుతున్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' సచిత్ర కథనం.



ఎందుకింత అ....భద్రత

ఇది తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లే దారి! నిజానికి... ఇది ప్రజలందరికీ రహదారి. జగన్ సీఎం కాగానే ఆయన సొంత దారి అయిపోయింది. దాదాపుగా పార్లమెంటు భవన సముదాయంతో సమానమైన భద్రత దీనికి ఏర్పాటు చేశారు. బటన్ నొక్కితే మూసుకుపోయే గేట్లు... ఒకవేళ దుండగులు దానిని దాటి ముందుకు వస్తే ఆటోమేటిక్‌గా నేలలోనుంచి పైకి లేచి వచ్చే ఉక్కు స్తంభాలు, ఎటు చూసినా సీసీటీవీ కెమెరాలు, నిరంతరం గస్తీ కోసం వందల సంఖ్యలో పోలీసులు! ఇదీ... జగన్ తనకోసం ఏర్పాటు చేసుకున్న భద్రత!

జైలు కాదు ఇల్లు...



సుమారు 30 అడుగుల ఎత్తున ఇనుప కవచం మధ్య ఉన్న ఈ నిర్మాణం సెంట్రల్ జైలు కాదండోయ్! ఇదే తాడేపల్లి ప్యాలెస్ సముదాయం! మొదటిది... గతంలో పార్టీ కార్యాలయం. సీఎం అయ్యాక దానినే క్యాంప్ కార్యాలయంగా మార్చుకున్నారు. సచివాలయం ముఖం చూడకుండా ఇక్కడి నుంచే పాలన సాగించారు. ఆ పక్కన ఉన్నది జగన్ నివాసం. గోశాల, మరికొన్ని నిర్మాణాలూ ఫొటోలు చూడొచ్చు.

జగన్‌పై భయంతోనే నాకు ఓటు వేయలేదు

- ప్రజలు బలంగా మార్పును కోరుకున్నారు
- ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



అమరావతి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికలు జగన్‌కు వ్యతిరేకంగా జరిగాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భయపడే నాకు ఓటు వేయలేదు. అందుకే ఓటమిపాలయ్యా. రాష్ట్రంలో జరిగిన ఎన్నికలు చాలా విచిత్రం. ఊహించని ఫలితాలు వచ్చాయి. మార్పు కావాలని ప్రజలు బలంగా నిర్ణయించుకున్నారు. ఈసారి ప్రజలు తమ ఓటుకు న్యాయం జరగాలని కోరుకున్నారు. ఒక్క ఓటు కూడా వృథా కావొద్దని ప్రజలు కోరుకున్నారు. అందుకే ఈసారి కాంగ్రెస్‌కు తగినన్ని ఓట్లు రాలేదు' అని షర్మిల అన్నారు. రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఆమె... రాహుల్‌ను ఫైటర్‌గా అభివర్ణించారు. ఎన్నికల్లో విజయం సాధించిన చంద్రబాబుకు షర్మిల శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త డీజీపీగా ద్వారకా తిరుమలరావు

- హరీశ్‌కుమార్ గుప్తా ఆకస్మిక బదిలీ



అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను రాష్ట్రప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది. కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి ద్వారకాతిరుమలరావును నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వాస్తవానికి చంద్రబాబు సీఎం కాగానే.. ద్వారకా తిరుమలరావునే డీజీపీగా నియమిస్తారని అంతా భావించారు. అయితే ఎన్నికల సమయంలో నాటి డీజీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డిని ఎన్నికల కమిషన్(ఈసీ) తొలగించి హరీశ్‌కుమార్ గుప్తాను నియమించింది. ఆయన్నే కొనసాగించాలని కొత్త ప్రభుత్వం కూడా భావించింది. కానీ సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం సందర్భంగా జరిగిన గందరగోళం ఆయనకు ప్రతికూలంగా మారింది. ఆ రోజున ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. గన్నవరం విమానాశ్రయంలో ప్రధాని మోదీకి స్వాగతం పలికి.. తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబుతో పదవీప్రమాణం చేయించాల్సిన గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రధాని మోదీ కూడా అసహనం వ్యక్తం చేశారు. అప్పుడే గుప్తాపై బదిలీ వేటు పడుతుందని అనుకున్నారు. ఇప్పుడు ఆయన స్థానంలో సమర్థుడు, నిజాయితీపరుడిగా పేరున్న 1989 బ్యాచ్‌కు చెందిన ద్వారకాతిరుమలరావును నియమించింది. అయితే ఆయనకు నేరుగా డీజీపీ పోస్టు ఇవ్వకుండా డీజీపీ(కో-ఆర్డినేషన్) పోస్టులో నియమించింది. ఆ స్థానంలో ఉండి ఆయన డీజీపీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ఉత్తర్వుల్లో పేర్కొంది. గుప్తాకు కూడా కీలకమైన హోం శాఖ ముఖ్య కార్యదర్శి బాధ్యత అప్పగించింది.

ఏపీలో ప్రక్షాళన షురూ

(మొదటి పేజీ తరువాయి)





వీరికి కీలక బాధ్యతలు
సాయిప్రసాద్ / కాటమనేని భాస్కర్



నో పోస్టింగ్: శ్రీలక్ష్మి, రజత్ భార్గవ, మురళీధర్ రెడ్డి

తీసుకున్నట్లుగా ముద్రపడిన ప్రవీణ్ ప్రకాశ్‌కు కూడా ప్రస్తుతానికి పోస్టింగ్ ఇవ్వలేదు. జీఏడీలో రిపోర్ట్ చేయాలని ఆయనను ఆదేశించారు. ప్రస్తుతం ఆయన కీలకమైన ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ, సెర్ప్ సీఈవో వంటి కీలకమైన స్థానాల్లో విధులు నిర్వహిస్తున్నారు. సీఎస్ తర్వాత అత్యంత కీలకమైన సీసీఎల్ఏ సాయిప్రసాద్ స్థాయి తగ్గించినప్పటికీ... ప్రాధాన్యమున్న పోస్టే దక్కింది. ఆయనను జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. అనిల్ కుమార్ సింఘాల్‌కు కీలకమైన మునిసిపల్ శాఖను కేటాయించారు. గతంలో సీఆర్‌డీఏలో పని చేసి ఆ విభాగంపై అవగాహన ఉన్న కాటమనేని భాస్కర్‌ను ఇప్పుడు సీఆర్‌డీఏ కమిషనర్‌గా నియమించారు. గత ఎన్నికల సమయంలో ప్రధాన ఎన్నికల అధికారి హోదాలో వ్యవహరించి, ఆపై జగన్‌కు సన్నిహితుడిగా మారిన గోపాలకృష్ణ ద్వివేదీకి కూడా మంచి శాఖే దక్కింది. ఆయనను కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించారు. గతంలో చంద్రబాబు పేషీలో సంయుక్త కార్యదర్శిగా పని చేసిన పీఎస్ ప్రద్యుమ్న మళ్లీ చాన్స్ కొట్టేశారు. ఈసారి ఏకంగా సీఎం సెక్రటరీగా నియమితులయ్యారు. జగన్ హయాంలో గాడి తప్పిన ఆర్థిక శాఖను సంస్కరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. వివాదరహితులైన జానకి, వాడరేవు వినయ్ చంద్‌లను ఆర్థిక శాఖలో కొన్ని విభాగాలకు కార్యదర్శులుగా నియమించారు. మరో సీనియర్ అధికారిని ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించనున్నట్లు తెలుస్తోంది. తొలివిడతలో 19మంది సీనియర్ ఐఏఎస్‌లకు స్థానచలనం కలుగగా... రేపోమాపో విడతల వారీగా మరికొందరి బదిలీపై ఉత్తర్వులు జారీ అవుతాయని, కీలకమైన శాఖలు, కలెక్టర్లకు స్థానచలనం జరుగుతుందని తెలుస్తోంది.

నీరబ్ సర్వీస్ పొడిగింపు!

6 నెలలు పొడిగించాలని కేంద్రానికి లేఖ

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ పదవీకాలాన్ని 6 నెలలు పొడిగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం ఉదయం కేంద్ర ప్రభుత్వానికి ఆయన లేఖ రాశారు. నీరబ్ కుమార్ ప్రసాద్ కొద్ది రోజుల కిందటే ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ నెలాఖరులో ఆయన రిటైర్ కాబోతున్నారు. కానీ, ప్రభుత్వం ఆయన సేవలు కొనసాగించాలని నిర్ణయించింది. అందులో భాగంగా కేంద్రానికి లేఖ రాసింది. గత ప్రభుత్వంలోనే ఆయన సీఎస్ కావాల్సి ఉంది. కానీ, జగన్ ఆయనను పక్కన పెట్టి జూనియర్ అయిన జవహర్ రెడ్డికి పట్టం కట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే సీనియార్టీకి ప్రయార్టీ ఇచ్చారు. సీనియారిటీలో ముందున్న నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను సీఎస్‌గా ఎంపిక చేశారు. ప్రస్తుతం ఆయనకు 10 రోజుల సర్వీస్ మాత్రమే ఉండడంతో మరికొంత కాలం పాటు అవకాశం ఇవ్వాలన్న ఉద్దేశంతో సర్వీస్ పొడిగింపు కోరుతూ కేంద్రానికి లేఖ రాశారు. కేంద్రం ఒకే విడతలో ఆరు నెలలు పొడిగింపు ఇస్తుందా.. లేదంటే మూడు నెలల చొప్పున రెండుసార్లు పొడిగిస్తుందా అన్నది వేచి చూడాలి.

నేడు అమరావతిలో చంద్రబాబు పర్యటన

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

ఏపీ సీఎం చంద్రబాబు గురువారం రాజధాని ప్రాంతాన్ని సందర్శించనున్నారు. అక్కడ పరిశీలించి గత ఐదేళ్లలో ఏం జరిగిందో చూడాలని నిర్ణయించుకొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిగా అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ పాలనలో పురుడు పోసుకొని వడివడిగా అడుగులు వేసిన అమరావతి, ఆ తర్వాత జగన్ కక్షపూరిత వైఖరితో కుప్పకూలింది. టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ అమ రావతి దశ తిరిగింది. గురువారం ఉదయం చంద్రబాబు అమరావతిలోని తన నివాసం నుంచి బయలుదేరి వెళ్లి రాజధాని నిర్మాణాలను పరిశీలిస్తారు. 70,80 శాతం వరకూ నిర్మాణం పూర్తి చేసుకొని నిలిచిపోయిన ఆలిండియా సర్వీసెస్ అధికారుల నివాస భవనాలు, మంత్రుల నివాస భవనాలు, న్యాయమూర్తుల గృహ సముదాయ భవనాలు, సీడ్ యాక్సెస్ రోడ్డు, అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్లు, ఐకానిక్ నిర్మాణాల కోసం పనులు మొదలై ఆగిపోయిన ప్రాంతం, ఉద్దండరాయుని పాలెంలో రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రాంతం వంటి వాటిని ఆయన పరిశీలించనున్నారు. అసెంబ్లీ, సచివాలయం, రాజ్‌భవన్ వంటి ఐకానిక్ భవనాల కోసం పునాది వరకూ నిర్మించారు. అవి ఈ ఐదేళ్ల నుంచి నీళ్లలోనే నానుతున్నాయి. వాటి పరిస్థితి ఎలా ఉందన్నది కూడా చూడాలని అనుకొంటున్నారు. ఒకసారి మొత్తం పరిస్థితిని స్వయంగా చూసి తదుపరి పనుల్లో దేనిపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్నది ఆయన నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

పిల్లల కళ్లెదుటే భార్యను పొడిచి చంపాడు!

- అడ్డగుట్టలో ఓ తాగుబోతు భర్త దుర్మార్గం

అడ్డగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏ పని చేయకుండా, మద్యానికి బానిసై కుటుంబ బాధ్యతలను విస్మరించిన ఆ వ్యక్తి ఘోరానికి ఒడిగట్టాడు. కష్టపడి పని చేస్తూ పిల్లలను పోషిస్తున్న భార్యను కన్నబిడ్డల కళ్లెదుటే కత్తితో విచక్షణారహితంగా పొడిచి చంపాడు. తుకారంగేట్ పరిధిలోని అడ్డగుట్టలో జరిగిన ఈ దారుణం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. పెద్దపల్లి జిల్లా రామగుండం ప్రాంతానికి చెందిన లక్ష్మణ్, రోజా(35) దంపతులకు కుమారుడు ప్రభు(9), కూతుళ్లు నిరీక్షణ(5), గుండమ్మ(4) ఉన్నారు. ఏడాది క్రితం బతుకుదెరువు కోసం లక్ష్మణ్ కుటుంబం సికింద్రాబాద్‌కొచ్చింది. నాలుగు నెలల క్రితం అడ్డగుట్టలోని రెండు గుడుల(టెంపుల్) వద్దకు మారింది. భార్య రోజా సికింద్రాబాద్‌లోని ఓ బట్టల షాపులో పనిచేస్తోంది. లక్ష్మణ్ తాగుడుకు అలవాటు పడి ఏ పనీ చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. భార్య ప్రవర్తనను అనుమానిస్తూ ఆమెను తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడు. కుమారుడు ప్రభు హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నాడు. కూతుళ్లు తల్లిదండ్రుల వద్దే ఉంటున్నారు. రోజా తల్లి లక్ష్మమ్మ అడ్డగుట్ట బస్టాపు వద్ద ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో దినసరి కూలీగా పనిచేస్తోంది. ఈనెల 18న మద్యం మత్తులో ఆ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లిన లక్ష్మణ్, డబ్బులివ్వాలని అత్త లక్ష్మమ్మతో గొడవపడ్డాడు. స్థానికులు మందలించడంతో అక్కడి నుంచి కోపంతో ఇంటికొచ్చాడు. భార్యతో గొడవ పెట్టుకొని.. పిల్లలు నిరీక్షణ, గుండమ్మ చూస్తుండగానే కత్తితో ఆమె కడుపులో, ముఖంపై విచక్షణారహితంగా పొడిచాడు. ఆమె తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందింది. పిల్లలు బిగ్గరగా రోదించడాన్ని విని బస్తీవాసులొచ్చారు. అప్పటికే లక్ష్మణ్ అక్కడి నుంచి పారిపోయాడు. తుకారాంగేట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. భార్యాభర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయని, తాగిన మైకంలోనే రోజాను లక్ష్మణ్ పొడిచి చంపాడని లక్ష్మమ్మ పోలీసులకు తెలిపింది. తమ కళ్ల ముందే.. తల్లి నోట్లో తండ్రి బట్టలు కుక్కి.. పొడిచి చంపాడని చిన్నారులు ఏడుస్తూ చెప్పారు. కాగా నిందితుడు లక్ష్మణ్‌ను పోలీసులు రామగుండంలో అదుపులోకి తీసుకున్నారు.

కార్పొరేషన్లలో జగన్ సైన్యం!

సొంత మీడియా సిబ్బంది, వైసీపీ కార్యకర్తలు డంప్

- ఇంధన సంస్థల్లో ఎటుచూసినా జగన్ అనుచరగణమే
- ఏపీఎస్‌డీసీ, ఎండీసీ, ఫైబర్‌నెట్, ఈ-ప్రగతిల్లో పాగా
- అర్హత లేకున్నా ప్రభుత్వ పెద్దల సిఫారసుతో పోస్టులు
- అక్రమ నియామకాలు, చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రభుత్వ కార్పొరేషన్లలో వైసీపీ కార్యకర్తలు, సొంత మీడియా సిబ్బంది పాతుకుపోయారు. రోజూ విధులకు హాజరు కాకపోయినా వీరికి ప్రతి నెలా రూ.లక్షల్లో జీతభత్యాలు చెల్లించి రాష్ట్ర ఖజానాను ముంచేశారు. జగన్ సొంత పత్రిక, టీవీ చానెల్‌లో గుదిబండలుగా మారిన ఉద్యోగులకు ప్రభుత్వ కార్పొరేషన్లలో వైట్ కాలర్ జాబ్‌లు ఇచ్చి పోషించారు. వైసీపీ సోషల్ మీడియాలో పనిచేస్తున్నవారందరికీ రియల్‌టైమ్ గవర్నెన్స్‌లో కంటెంట్ రైటర్లుగానూ, సమాచార పౌర సంబంధాల శాఖలో ప్రభుత్వ ప్రగతిని ప్రచారం చేసే సిబ్బందిగానూ నియమించుకున్నారు. జగన్‌తో పాటు వైఎస్ విజయలక్ష్మి, ఎంపీ అవినాశ్‌రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు సిఫారసు చేస్తే చాలు.. అర్హతలతో నిమిత్తం లేకుండా భారీ జీతాలతో ఉద్యోగాలు ఇచ్చేశారు. వైసీపీ సామాజిక మాధ్యమ కార్యకర్తలు, సొంత మీడియా ఉద్యోగులు రాచమర్యాదలు అందుకున్నారు. డిజిటల్ కార్పొరేషన్, డ్రోన్ కార్పొరేషన్, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్, ఈ-ప్రగతి, రియల్ టైమ్ గుడ్ గవర్నెన్స్ సర్వీస్, ఏపీఎండీసీలలో వైసీపీ కార్యకర్తలను అధిక జీతాలకు నియమించారు. ఇవి చాలవన్నట్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటూ ఆప్కోస్ పేరిట ఒక కార్పొరేషన్‌ను జగన్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు సీఎంవో కేంద్రంగా సిఫారసులు నడిచాయి. కార్పొరేషన్లలో వైసీపీ కార్యకర్తలు, సొంత మీడియా సంస్థల ప్రతినిధులకు పెద్దఎత్తున ఉపాధి కల్పించి, ప్రతినెలా రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని జీతభత్యాలుగా చెల్లిస్తున్న భారీ కుంభకోణం తాజాగా బయటపడింది. ఆ ఉద్యోగులను పార్టీ కార్యక్రమాలకు జగన్ వినియోగించుకున్న వైనం వెలుగుచూడటంతో నిరుద్యోగ యువతలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటినుంచి కార్పొరేషన్ల కార్యకలాపాలు నిలిచిపోయాయి. కార్పొరేషన్ల కార్యాలయాలకు తాళాలు వేసి, ఒక్క కాగితమూ బయటకు రాకుండా పోలీసులు సీలు వేశారు. ఉద్యోగుల అక్రమ నియామకాలు, అడ్డగోలు చెల్లింపులపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి నివేదికలను ఇప్పటికే సిద్ధం చేయడంతో పాటు త్వరలోనే కార్యాచరణను అమలు చేసేందుకు సన్నద్ధమవుతోంది. రాష్ట్ర ఇంధన సంస్థల్లో జగన్ సైన్యాధ్యక్షులు ఇంకా కీలక పదవుల్లోనే కొనసాగుతున్నారు. జెన్కో కోల్ విభాగం ఓఎస్‌డీగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సన్నిహితుడు రఘునాథరెడ్డి విధులు నిర్వహిస్తున్నారు. విద్యుత్తు పంపిణీ సంస్థల్లోనూ జగన్ సొంత మనుషులే ఉన్నారు.

వైసీపీ సోషల్ మీడియాకు సజ్జల భార్గవరెడ్డి దూరం?

- నాగార్జున యాదవ్‌కు బాధ్యతలు!

అమరావతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా వ్యవహారాలకు ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి దూరంగా ఉంటున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయన తండ్రి, ప్రభుత్వ మాజీ సలహాదారు, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రం రోజూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ వద్దకు వస్తున్నా.. భార్గవరెడ్డి మాత్రం దూరంగా ఉంటున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. దీంతో ఆ బాధ్యతను నాగార్జున యాదవ్‌కు జగన్ అప్పగించారని అంటున్నారు. ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల నాయకులను, మహిళలను కించపరిచేలా వైసీపీ సోషల్ మీడియాలో భార్గవరెడ్డి పోస్టింగ్‌లు పెట్టేవారు. దీనిపై ఫిర్యాదులు చేసేందుకు ప్రయత్నించినా అప్పట్లో పోలీసులు కేసులు నమోదు చేయనేలేదు. ఎన్నికల్లో జగన్ ఓడిపోవడంతో.. తమపై నాడు పెట్టిన పోస్టింగ్‌లపై ఫిర్యాదు చేసేందుకు కొత్త హోం మంత్రి వంగలపూడి అనిత, ఇతర టీడీపీ మహిళా నేతలు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే భార్గవరెడ్డి దూరంగా ఉన్నారని తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల తర్వాత వైసీపీ సోషల్ మీడియా క్రియాశీలంగా లేదు. అయితే జగన్ భక్తులు కొందరు సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలకు విశ్వాసం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆయుధ మైత్రి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉత్తరకొరియాతో గట్టి ఒప్పందాలు కుదర్చుకున్నారు. ఇరవైనాలుగేళ్ళ తరువాత తమదేశంలో కాలూనిన పుతిన్‌ను చూసి కిమ్ ఎంత పొంగిపోయారో ఆ ఘనస్వాగత సత్కారాలే చెబుతున్నాయి. పుతిన్‌కూడా ఉత్తిచేత్తో వెళ్ళకుండా ఓ అద్భుతమైన, ఖరీదైన కారును ఆయనకు బహుమతిగా ఇచ్చి తన ఆదరాభిమానాలను చాటుకున్నారు. ఈ రెండుదేశాల మధ్యా ఎటువంటి బంధం ఉన్నదో ప్రత్యేకంగా చెప్పుకోనక్కరలేదు. బహిరంగంగానో, రహస్యంగానో రష్యాతో అవసరార్థం ఉత్తరకొరియా అంటకాగుతూనే ఉంటుంది. ఉక్రెయిన్ యుద్ధంలో కిమ్ అందించిన ఆయుధాలు రష్యాకు బాగా ఉపకరిస్తున్నాయని పాశ్చాత్యదేశాలు ఎప్పటినుంచో అంటున్నాయి. ఈ పర్యటనతో ఇక ఈ రెండుదేశాల స్నేహం, ఆయుధబంధం మరింత బలోపేతమైంది. తమ ఇద్దరిలో ఎవరిమీద ఈగవాలినా ఏ ఒక్కరినీ వదిలిపెట్టేది లేదని పుతిన్, కిమ్ ముక్తకంఠంతో పాశ్చాత్యదేశాలను హెచ్చరిస్తున్నారు.

ఒకరికొకరు ఏ తరహా సాయం చేసుకుంటారో స్పష్టంగా చెప్పక పోయినా, వ్యూహాత్మక భాగస్వామ్యం, శాంతియుత, రక్షణాత్మక ఒప్పందం వంటి మాటలు అసలు మర్మాన్ని విప్పకపోయినా పుతిన్ పర్యటన, ఈ ఒప్పందాలు పాశ్చాత్యదేశాలకు ఒక బలమైన హెచ్చరిక. అమెరికా, దాని మిత్రదేశాలు అతిగా వ్యవహరించినా, దూకుడుగా అడుగులువేసినా ఈ కొత్తమిత్రులు వదిలిపెట్టరు. కరచాలనాలు, ఆలింగనాలకు పరిమితమైన, సాదాసీదా బంధం కాదు ఇది అని రక్షణరంగ విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా పక్షాన కిమ్ ఎంతబలంగా ఉన్నారో ఈ ఒప్పందం చెబుతోంది. ఇప్పటివరకూ ఉత్తరకొరియానుంచి రష్యాకు ఫలానా ఆయుధాలు రహస్యంగా చేరాయంటూ ఆరోపిస్తున్న పాశ్చాత్యదేశాలు ఇకమీదట మరిన్ని సరఫరాలు లెక్క బెట్టుకోవాల్సిరావచ్చు. ఉత్తరకొరియా తయారుచేసిన ఆయుధాలు అంత కచ్చితంగా పనిచేయవన్న దుష్ప్రచారం విస్తృతంగా జరుగుతున్న తరుణంలో ఉక్రెయిన్ యుద్ధంలో వాటి వాడకం ఆ ప్రచారం సరైనదో కాదో కూడా తేల్చేస్తుంది. కొద్దినెలల్లో ముగిసిపోతుందనుకున్న ఉక్రెయిన్ యుద్ధం ఏళ్ళతరబడి సాగుతూండటం వల్ల వచ్చి పడుతున్న ప్రమాదం ఇది. పాశ్చాత్యదేశాలు ఆయుధాలతోనూ, ఆర్థికంగానూ ఉక్రెయిన్ పక్షాన మరింత గట్టిగా నిలుస్తూండటంతో రష్యా అధ్యక్షుడు కొత్త కొత్త ఒప్పందాలతో మరిన్ని ఆయుధాలను సంపాదించుకోవడంలో పడ్డారు.

కొన్ని నెలలుగా స్విట్జర్లాండ్ దూతలు ఎంతో హడావుడిగా ప్రపంచమంతా తిరిగి, ఏర్పాటుచేసిన ఉక్రెయిన్ సదస్సు చివరకు తుస్సుమన్నది. రష్యా ఆదినుంచీ ఆరోపిస్తున్నట్టుగానే ఇది దానిని హెచ్చరించడానికీ, సుద్దులు చెప్పడానికీ పరిమితమైంది. యుద్ధం పాపం పూర్తిగా రష్యాదేనంటూ, అదే అంతర్జాతీయ నియమాలు, చట్టాలను ఉల్లంఘిస్తున్నట్టూ వ్యాఖ్యానించడం ద్వారా ఈ సదస్సు తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంది. యుద్ధం చేసుకుంటున్న ఉభయపక్షాల్లోనూ ఒకదానిని ఆహ్వానించకుండా ఏకంగా 90దేశాలు ఇలా సమావేశం అవడం వల్ల ఏ ప్రయోజనమూ ఉండదు. రష్యాను ఆహ్వానించలేదు, పిలిచినా అది రాదు కూడా. చివరకు ఈ యుద్ధకాలమంతా పాశ్చాత్యదేశాలనుంచి వింటున్న ఆరోపణలనూ, సుద్దులనే ప్రపంచం ఈ సదస్సునుంచి మళ్ళీ వినాల్సి వచ్చింది. దురాక్రమణ కూడదనీ, ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని గౌరవించాలని అంటూ ఓ సుదీర్ఘమైన తీర్మానాన్ని ఈ సదస్సు చేసింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఉక్రెయిన్ పక్షాన, ఆ దేశాధినేత కోరుతున్నరీతిలో యుద్ధవిరమణకు అనుకూలంగా ఈ సదస్సు జరిగింది. ముందుగా రష్యా వెనకడుగువేయాలనీ, ఉక్రెయిన్‌లో అది వశపరుచుకున్న భూభాగాలన్నీ వదిలేసి వెనక్కుపోవాలనీ జెలెన్‌స్కీ డిమాండ్ చేస్తున్నారు. ముందుగా తూర్పు ఉక్రెయిన్‌లోని నాలుగు ప్రాంతాలను నువ్వే వదులుకొని ఆ తరువాత మాట్లాడు అని పుతిన్ అంటున్నారు. నిజానికి, పాశ్చాత్యదేశాల దయలేనిదే యుద్ధం కొనసాగించగలిగే స్థితిలో ఉక్రెయిన్ అధ్యక్షుడు లేరు. ఆ విషయంలో రష్యాయే తాను అనుకున్నది ఎప్పటికైనా సాధించగలిగే స్థితిలో ఉంది. యుద్ధం ఆగాలంటే రష్యాతో ఉక్రెయిన్ రాజీ పడాల్సిందేనని అమెరికా, దాని మిత్రదేశాలన్నిటికీ తెలుసు. అయినా, అవి ఆయుధాలు కుమ్మరిస్తూ యుద్ధం కొనసాగేట్టుగా చేస్తున్నాయి. సాధ్యమైనంత వేగంగా యుద్ధాన్ని ముగించని పక్షంలో అది అన్ని హద్దులూ దాటేస్తుందనీ, ప్రపంచాన్ని ముంచేస్తుందని రష్యా–ఉత్తరకొరియా రక్షణ ఒప్పందం హెచ్చరిస్తోంది.

ఓటర్ జాబితాల ఆధారంగా కులగణన అన్యాయం!

సర్వే లేకుండానే ఓటర్ల జాబితా ఆధారంగా బీసీలను లెక్కించి బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తామంటూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావటమంటే కాంగ్రెస్ ఇచ్చిన మాటలను తప్పుతున్నట్టే. దీన్నిబట్టి కామారెడ్డి బీసీ డిక్లరేషన్ విడుదల సందర్భంగా బీసీ కులగణన చేస్తామని, కులగణన ఆధారంగా బీసీల వర్గీకరణ చేసి వాటి ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తామని చెప్పిన మాటలు అబద్ధమని తేలిపోయింది. బీసీల వర్గీకరణ, బీసీ కులగణన, చట్టసభల నుంచి స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు కల్పించటం వంటి అంశాల్లో గత 77 ఏళ్ళుగా కాంగ్రెస్ బీసీలను ఎట్లా మోసపుచ్చుతూ వచ్చింది అన్నదానికి ఇది మరో ఉదాహరణ.

2023 ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ తెలంగాణలో ఎన్నికల ప్రచారం సందర్భంగా జగిత్యాల, వరంగల్ సభలలో చాలా గట్టిగా స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు అమలు జరుపుతామన్న వాగ్దానం చేశారు. అందుకే బీసీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపి ఓట్లు వేశారు. కానీ ఆ పార్టీ అధికారం చేపట్టాక ఆరునెలల్లో కులగణన కార్యక్రమం చేపడతామన్న మాటను మరిచిపోయి స్థానిక సంస్థల ఎన్నికలలోకి పోవటం చూస్తే బీసీలు మరొక్కసారి మోసపోయినట్టే! పార్టీ రథసారథి రాహుల్ స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో చెప్పిన మాటలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం విస్మరించింది. బీసీ కులగణన చేపట్టం అని బీజేపీ పార్లమెంటు సాక్షిగా చెబితే, కాంగ్రెస్ మాత్రం మేం అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేస్తామంటూ ఒక్క తెలంగాణలోనే కాదు దేశమంతా ఎన్నికల ప్రచార సభల్లో హోరెత్తించింది.. అదంతా అబద్ధ ప్రచారమని ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో వారి పనితీరును బట్టి అర్థమవుతున్నది.

ఓటర్ల జాబితా ద్వారా బీసీ జనాభా తెలుస్తుంది కానీ వాళ్ళ వెనుకబాటుతనం, జీవనవిధానం తెలియదు. ఈ జాబితాల్లో 18 ఏళ్ళ వయసు లోపు ఉండేవారు, ఓటరుగా నమోదు కానివారు ఉండరు. ఈ జాబితాల ఆధారంగా కొంచెం అటుఇటుగా బీసీల శాతం తెలుసుకోవచ్చును. కానీ ఏ కులం ఎంతమంది అన్నది తెలిసే అవకాశం లేదు. ఓటర్ జాబితాల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్ళాలంటే సుప్రీంకోర్టు చెప్పినట్టుగా ట్రిబుల్ టెస్ట్ ద్వారా బీసీ జనాభాను అంచనా కట్టాలి. డెడికేటెడ్ కమిషన్ వేయాలి. అంటే బీసీ కమిషన్ ద్వారా ఓటర్ల జాబితా ఆధారంగా లెక్క తీయాలి. బీసీ కమిషన్ అధ్యయనం చేసి బీసీ పర్సంటేజి ఎంత ఉందో చెప్పాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కలిపి స్థానిక సంస్థల్లో 50శాతం దాటకుండా చూడాలి. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ఆధారంగా బీసీలలోని ఎ, బి, సి, డిల వర్గీకరణ ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వాలి. ఇది ఓటర్ జాబితాల ద్వారా తెలియదు. దీనివల్ల ఇప్పటి వరకు గ్రామపంచాయతీ, మండల, జడ్పీల గడపతొక్కని అత్యంత వెనుకబడిన వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.

ఈ ఏడాది మార్చి 15వ తేదీన కులగణన చేస్తామని ప్రభుత్వం జీవో ఇచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందుగానే కులగణన చేస్తుందని బీసీలు ఎదురు చూస్తున్నారు. కానీ ఓటర్ జాబితాల ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికలకు పోవటమంటే కులగణనను ఒకరకంగా పక్కన పడేసినట్టే. ఓటర్ జాబితాల ఆధారంగా స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వటం సాధ్యం కాదు. ఇది సాధ్యం కావాలంటే రాజ్యాంగ సవరణ జరగాలి. జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు ఇవ్వాలి. ఆర్టికల్ 243(డి) (టి)లను సవరణ చేసి రిజర్వేషన్లు ఇవ్వాలి.

కాంగ్రెస్ తాము అధికారంలోకి రావటానికి బీసీలను వాడుకున్నారు కాని బీసీల చేతుల్లో గ్రామరాజ్యాలు పెట్టడానికి ఎప్పుడు ముందుకు వస్తారని బీసీలు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో సగం జనాభాగా వున్న 2 కోట్ల మంది బీసీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నతీరు తీవ్ర నిర్లక్ష్యంగా ఉందని బీసీలు భావిస్తున్నారు. ఇంకెన్నాళ్ళు మోసపుచ్చుతారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– జూలూరు గౌరీశంకర్

ముందే కూస్తున్న తొందర కోయిలలు!

బాగా గెలిచినవారికి బాగా ఆనందం ఉంటుంది. బాగా ఓడిపోయినవారికి కుంగుబాటు ఉంటుంది. విపరీతంగా గెలుస్తామనుకుని కొంచెం మాత్రమే గెలిచినవారికి కొంత నీరసం ఉంటుంది. కనాకష్టంగా ఉన్నవారు కొన్ని మెట్లు ఎక్కితేనే కొండంత సంబరం కలుగుతుంది. విజయోత్సవాలు, విచారపర్వాలు ముగిసిన తరువాత, క్రమంగా సత్యం బోధపడుతుంది. ఆటవిడుపు తరువాత అసలు పనులు మొదలు. ఘనవిజయం సాధించిన వారికి, ఘనాతిఘనమైన బరువు బాధ్యతలు, దివాళా ఖజానాకు తోడు వాగ్దాన భారాలు. అరువు గెలుపుల వారికి వారినీ వీరినీ కలుపుకుని పోవలసిన కొత్త కర్తవ్యాలు. కొత్త బలాల వారికి పొద్దెరుగని వీరంగాలు. దిగదుడుపు పార్టీలకు దింపుడు కళ్లాలు.

ఎగ్జిట్ పోల్స్ రాగానే తారాజువ్వలాగా ఎగిసిపోయి, నిజం ఫలితాల వేళకు నిప్పులు కక్కుకుంటూ నేలరాలిన స్టాక్ మార్కెట్ ఇండెక్స్, కొంచెం ఓవరాక్షన్ చేసినట్టు అనిపించింది. అందులో ఆవిరైపోయి మళ్లీ గడ్డకట్టిపోయిన లక్షల కోట్ల రూపాయల సంగతేమిటో కానీ, జనం ఒకటి అనుకుంటే దళారిమార్కెట్ మరొకటి అనుకున్నది. షేర్ మార్కెటే కాదు, దేశంలోని ప్రజాస్వామిక సూచి కూడా మరీ అతిగా ప్రకంపించింది. మల్లెల వేళ వచ్చిందని, వెన్నెల మాసం వచ్చిందనీ పాటలు పాడడం మొదలుపెట్టింది. ఇల్లు ఇంకా అలకనే లేదు, పండగకు రెడీ అయింది. ఇందుమూలముగా సమస్త జనులు తెలుసుకోవలసినది ఏమిటంటే, ఫలితాలు వచ్చి కూడా పదిహేను రోజులై పోయింది కాబట్టి, ప్రథమోత్సాహం కొంత తగ్గించుకుని, వాస్తవంలోకి మేల్కొనాలి. సూచికలను కొంచెం సవరించుకోవాలి.

ఇంతకు ముందు లాగా, రాజకీయం నీరసంగా ఏకపక్షంగా ఉండబోదు కానీ, అట్లాగని మరీ హల్లాబోల్ వాతావరణం ఉండబోవడం లేదు. కనీసం ఇప్పట్లో అంత దృశ్యము కనిపించదు. నాలుగు రోజుల్లో మొదలయ్యే తొలి పార్లమెంటు సమావేశాల్లో కొద్దిగా ఉనికి ప్రకటనలు, ఏలినవారి బల ప్రదర్శనలు చూడవచ్చు. మాకు బలం పెరిగింది, మార్పు చూడండి, అని చెప్పాలని ఇండియా కూటమి అనుకుంటుంది. కొనసాగింపే తప్ప మార్పేమీ లేదు అని బలంగా చాటాలని మోదీ ప్రభుత్వం అనుకుంటుంది. ఆ రెండు రకాల ప్రదర్శనలూ ఇప్పటికే ఉనికిలోకి వచ్చాయి. ఎన్డీయేలోని బీజేపీయేతరులు చెదిరిపోతారు, తమలో చేరిపోతారు అని ఇండియా కూటమి, అందులోనూ ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కలలు కంటోంది. బహుశా, బీజేపీ కూడా, ఇండియా కూటమిలోనుంచి ఒకటి రెండు పార్టీలను రప్పించుకోగలనని ఆశపడుతున్నదేమో తెలియదు. మొత్తానికి అస్థిరతా వాతావరణం ఉంటుందని, అందులో తమ అభివృద్ధికి సానుకూలత కలుగుతుందని ప్రతిపక్షాలు అనుకుంటున్నాయి.

వాస్తవ స్థితిగతులను ఆశ మసకబారిస్తే కష్టం. నరేంద్ర మోదీ మూడో ప్రభుత్వం పూర్తి ఐదేళ్లు కొనసాగడానికి అనేక అవకాశాలు ఉన్నాయి. ముందు ఆ సంభావ్యతను అంగీకరించాలి. మొన్నటి ఎన్నికల్లో దెబ్బతిన్న ప్రతిష్ఠను మరమ్మత్తు చేసుకునో, లేదా, తీవ్ర ఉద్వేగ పరిస్థితులు ఏర్పడితే ఆ అదనులో మధ్యంతర ఎన్నికలకు వెళ్లో ఎన్డీయే ప్రభుత్వం తనను తాను పటిష్ఠపరుచుకునే, కొనసాగించుకునే ఆస్కారం కూడా లేకపోలేదు. హోంమంత్రి మారలేదు. జాతీయ భద్రతా సలహాదారు మారలేదు. న్యాయశాఖ మంత్రి, విదేశాంగ శాఖ మంత్రి మారలేదు. లోక్‌సభ స్పీకర్ ఎవరవుతారో ఇంకా తెలియదు. తెలుగుదేశం పార్టీ కోరుతూ ఉండవచ్చును కానీ, అది తమకే ఉండాలని బీజేపీ పట్టు బట్టవచ్చు. రాష్ట్ర ప్రయోజనాల కోసం, సొంత పార్టీ ప్రయోజనాల కోసం ప్రాంతీయ పార్టీలు రాజీపడాల్సిరావచ్చు. చంద్రబాబే కాదు, నితిశ్ కుమార్ మాత్రం అర్జెంటుగా బీజేపీతో బెట్టుగా ఉండాలని ఎందుకు అనుకుంటారు?

గతంలో పూర్తి పదవీకాలం పూర్తిచేసుకున్న మైనారిటీ ప్రభుత్వాలతో పోలిస్తే, మోదీ 3.0 ఏమంత బలహీనమైనది కాదు. 1991లో కేవలం 226 సభ్యుల బలంతో పివి నరసింహారావు ప్రభుత్వం ఏర్పడి, పూర్తికాలం కొనసాగింది. 1999లో ఎన్డీయే ప్రభుత్వంలో బీజేపీ బలం 182 మాత్రమే. 2004లో మొదటి యూపీఏ ప్రభుత్వంలో కాంగ్రెస్ బలం 145 మాత్రమే. రెండో యూపీఏలోనూ కాంగ్రెస్ 206తోనే ప్రభుత్వం నడిపింది. ఈ అన్నిటికంటె ఇప్పుడు ఎన్డీయేలో బీజేపీ వాటా పెద్దది. మునుపటి సంకీర్ణ సారథులందరి కంటె మోదీ, షాలు అఖండులు. ఒక్క పీవీని మినహాయిస్తే, చాణక్యులు కూడా. అనుకోని పరిణామాలను ఎప్పుడూ నిరాకరించలేము కానీ, మోదీ పూర్తికాలం పదవిలో ఉండరని, మధ్యంతరం వస్తుందని ఊహించడానికి కానీ, ఆశించడానికి కానీ ఆధారాలేమిటి?

ప్రతి విషయంలోనూ ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు బీజేపీకి అభ్యంతరాలు పెడుతూ ఉంటారనుకుంటే, ఉండాలనుకుంటే అది పొరపాటు. విధానాల పరంగా చూస్తే, బీజేపీ ఆర్థిక సంస్కరణల ఆజెండాతో తెలుగుదేశానికి కానీ, జేడీయూకి కానీ ఎటువంటి పేచీ ఉండదు. కాకపోతే, మునుపటిలాగా, వచ్చే పెట్టుబడి అవకాశాలను అన్నిటినీ గుజరాత్‌కు తరలించుకుపోతుంటే అడ్డుపడతారు. ఆ విషయంలో బీజేపీ కొంత వెనక్కి తగ్గవచ్చు. కశ్మీర్‌లోనో అబూజ్‌మడ్‌లోనో జరిగే భద్రతాదళాల చర్యల విషయంలో ఎన్డీయే భాగస్వామ్యపక్షాలకు ఏ సమస్యా ఉండదు. ఆర్ఎస్ఎస్ చెప్పింది కాబట్టి, మణిపూర్‌లో సర్దుబాట్లు చేయడానికి బీజేపీయే ముందుకు వస్తుంది. సంఘర్షణలకు, సమస్యలకు రాజకీయ పరిష్కారాలు అన్వేషించాలని ఇండియా కూటమి కూడా ఇప్పుడు అడిగే స్థితిలో లేదు, ఇక ఎన్డీయే భాగస్వాములు ఎందుకు అడుగుతారు? అరుంధతీరాయ్ వంటి వారిని కేసులతో వేధిస్తుంటే మంచిది కాదని మిత్రపక్షాలు హితవు చెబుతాయేమో తప్ప, శాంతిభద్రతల రంగంలో అమిత్ షా మార్గమే నిరాఘాటంగా కొనసాగుతుంది. కొత్త నేరచట్టాల అమలు విషయంలో ఇండియా కూటమి పక్షాలు వాయిదా కోరినా, నీట్ విషయంలో వీధుల్లో ఉద్యమాలు చేసినా, ఎన్డీయే భాగస్వాములు తటస్థంగా ఉండవచ్చు. తాము ఏదో ఒక వైఖరి తీసుకోవలసిన అగత్యం మాత్రం మును ముందు తరచు కలుగవచ్చు.

ఒకటి మాత్రం నిజం. తమకు ప్రతిపక్ష కూటమిలో ఉన్న ఆహ్వానాన్ని తెలుగుదేశం కానీ, జేడీయూ కానీ తృణీకరించవు. వారితో కలవరు కానీ, కలిసే అవకాశం వల్ల కలిగే పలుకుబడిని ఎంజాయ్ చేస్తాయి. ప్రతిపక్ష కూటమికి కూడా తాము ఆమోదయోగ్యం కావడం, ఈ ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ప్రత్యేక సదుపాయం. దాని మీదనే కేంద్ర ప్రభుత్వంలో ఎన్డీయే భాగస్వాముల, ముఖ్యంగా టీడీపీ, జేడీయూల పరపతి ఆధారపడి ఉంటుంది. అంతమాత్రాన, లోక్‌సభలో కానీ, బయట కానీ, ప్రతిపక్ష కూటమితో ఈ పార్టీలు కలసి పనిచేయడం కానీ, గొంతు కలపడం కానీ ఇప్పట్లో ఉండదు. ఒకవేళ అటువంటిదేమన్నా చేయవలసి వచ్చినా, అది ఆ పార్టీలు తమ రాష్ట్రాలకు కేంద్రం నుంచి రాబట్టుకోవలసిన నిధుల కోసం, నిర్ణయాలకోసం ప్రయోగించే ఒత్తిడిగా మాత్రమే ఉంటుంది. ఈ విషయాన్ని అత్యాశావాదులు గుర్తించాలి.

రానున్న రోజుల్లో ఇండియా కూటమికి కలసిరాగలిగిన ఒక పరిణామం, ఈ ఏడాది జరిగే నాలుగు అసెంబ్లీల ఎన్నికలు, ముఖ్యంగా మహారాష్ట్ర ఎన్నికలు. ఈ ఎన్నికలలో మంచి ఫలితాలను చూపించగలిగితే, కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం మీద ఒత్తిడి పెరుగుతుంది. బీజేపీలోనూ, ఎన్డీయే కూటమిలోనూ అంతర్గతంగా భిన్నస్వరాలు వినిపిస్తాయి. కానీ, ఇప్పుడే తాము గెలిచామని తబ్బిబ్బైపోతున్న కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, అసెంబ్లీ ఎన్నికలను తేలికగా తీసుకుంటే, పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది.

ఇండియా కూటమికి ఉన్న మరో సానుకూల అంశం ఏమిటంటే, భాగస్వామ్య పక్షాల్లో ఏ ఒక్కటీ ఎన్డీయే కూటమిలోకి మళ్లే అవకాశం బాగా తక్కువ. ఉద్ధవ్ ఠాక్రే అటువైపు చూడరా, అవసరమైతే స్టాలిన్ కూడా రాజీపడడా, శాంతి కోసం మమత చేయి కలపదా అని సాంకేతికంగా వాదిస్తే చెప్పలేము కానీ, కూటమిలోని ప్రతిపార్టీ బీజేపీ వల్ల ఏదో రకంగా బాధిత పక్షమే కాబట్టి, అట్లా జరగడం కష్టం. పైగా, ఈ పక్షాలు అన్నీ తమ తమ రాష్ట్రాలలో బీజేపీ నుంచి సవాళ్లను ఎదుర్కొంటున్నవే. కలవడం అంటే, తమ ప్రాంతాలలో బీజేపీ ప్రాబల్యాన్ని ఆహ్వానించడమే. ఎన్డీయే కూటమి సంగతి వేరు. రెండు ప్రధాన బీజేపీయేతర భాగస్వాములు ఇండియా కూటమికి కూడా ఆమోదయోగ్యమైన వారు. షిండే సేన ఉనికి మహారాష్ట్ర ఎన్నికల తరువాత కానీ చెప్పలేము.

కాబట్టి, ప్రభుత్వం అదే. రాజకీయ వాదనలూ అవే, చేయదలచిన అభివృద్ధీ అదే, చూపబోయే కాఠిన్యమూ అదే. ఏవో గొప్పమార్పులు వస్తాయని ఊహిస్తే ఆశాభంగాలు ఎదురవుతాయి. జాతీయ ప్రతిపక్షాలు ఈ సంగతి గ్రహించి, 2024 ఎన్నికలకు ముందు తమ జనాదరణ పెంచుకోవడానికి ఎటువంటి కార్యక్రమాలను చేశాయో వాటిని మరింత ఉధృతంగా కొనసాగించాలి. రాజకీయ లాభాలు ఎవరికీ ఊరికే రావు. కాంగ్రెస్‌తో సహా, ఆ కూటమి పక్షాలన్నీ చేయవలసినంత పరిశ్రమ చేయలేదు కాబట్టే, అధికారానికి అల్లంత దూరానే ఆపివేశారు. వేసిన నాలుగు అడుగులకు ఉత్సాహపడితే తప్పేమీ లేదు కానీ, మరిన్ని అడుగులు వేయడానికి ఆయాసపడితేనే కష్టం.

కేంద్రంలో ప్రభుత్వం నడక ఆసక్తికరంగా, ఉత్కంఠ భరితంగా ఉంటుంది. సందేహం లేదు. గతంలో వలె కాక ఇప్పుడు అనేకపాత్రాభినయం చూడవచ్చు. ప్రజలు మౌన ప్రేక్షకులుగా మిగలకుండా, తమకు నచ్చిన పాత్రధారులను ఉత్సాహపరచవచ్చు. కానీ, రేపోమాపో క్లైమాక్స్ వస్తుందని మాత్రం ఆశించవద్దు.


akbar

ప్రభుత్వం అదే. రాజకీయ వాదనలూ అవే, చేయదలచిన అభివృద్ధీ అదే, చూపబోయే కాఠిన్యమూ అదే. ఏవో గొప్పమార్పులు వస్తాయని ఊహిస్తే ఆశాభంగాలు ఎదురవుతాయి. జాతీయ ప్రతిపక్షాలు ఈ సంగతి గ్రహించి, 2024 ఎన్నికలకు ముందు తమ జనాదరణ పెంచుకోవడానికి ఎటువంటి కార్యక్రమాలను చేశాయో వాటిని మరింత ఉధృతంగా కొనసాగించాలి. రాజకీయ లాభాలు ఎవరికీ ఊరికే రావు. కాంగ్రెస్‌తో సహా, ఆ కూటమి పక్షాలన్నీ చేయవలసినంత పరిశ్రమ చేయలేదు కాబట్టే, అధికారానికి అల్లంత దూరానే ఆపివేశారు. వేసిన నాలుగు అడుగులకు ఉత్సాహపడితే తప్పేమీ లేదు కానీ, మరిన్ని అడుగులు వేయడానికి ఆయాసపడితేనే కష్టం.



▪ కె. శ్రీనివాస్

సందర్భం

ఇండియా కూటమి భాగస్వామ్యపక్షాల్లో ఏ ఒక్కటీ ఎన్డీయే కూటమిలోకి మళ్లే అవకాశం బాగా తక్కువ. ఉద్ధవ్ ఠాక్రే అటువైపు చూడరా, అవసరమైతే స్టాలిన్ కూడా రాజీపడడా, శాంతి కోసం మమత చేయి కలపదా అని సాంకేతికంగా వాదిస్తే చెప్పలేము కానీ, కూటమిలోని ప్రతిపార్టీ బీజేపీ వల్ల ఏదో రకంగా బాధిత పక్షమే కాబట్టి, అట్లా జరగడం కష్టం.

ఉద్యమకారులే తెలంగాణ రక్షణ కవచం!

తెలంగాణ సిద్ధించిన తర్వాత కూడా మూడేళ్లపాటు 'తెలంగాణ సినిమా ప్రొటెక్షన్ ఫోరం' పోరాటాన్ని కొనసాగించాల్సి వచ్చింది. నాడు రాష్ట్రం వేరుపడ్డా, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాత్రం ఉమ్మడిగా కొనసాగింది. ఐ అండ్ పీఆర్ బిల్డింగ్ కారిడార్‌లో ధర్నా చేసి తెలంగాణ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టిఎఫ్‌డీసీ)ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశాం. అనంతరం టిఎఫ్‌డీసీ ఏర్పడింది. ఆ తర్వాత కూడా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఎంపానెల్‌మెంట్ సభ్యులే గవర్నమెంట్ యాడ్స్ తీయడం గమనించి, కొత్త సభ్యత్వాలను ప్రకటించమని డిమాండ్ చేశాం. కొత్త ఎంపానెల్‌మెంట్ సభ్యత్వాలు ఇచ్చారు గాని, ప్రభుత్వ పెద్దల జోక్యంతో నచ్చినవారికి, ఇష్టం వచ్చినట్టుగా అవకాశాలు ఇచ్చుకున్నారు. ఈ అంశంపై ఎన్నిసార్లు ఎంతమంది అడిగినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది.

అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్యమకారులందరూ బీఆర్ఎస్ నాయకుల వివక్షలను, అక్రమాలను వెలుగులోకి తెస్తూ, కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తూ ప్రచారం చేశారు. ఆ సమయంలో ఏఐసీసీ పెద్దలు కూడా పలుసార్లు ఉద్యమ సంఘాలతో సమావేశమయ్యారు. ఏఐసీసీ ప్రతినిధులు కొంతమంది ఉద్యమకారులను నేరుగా రాహుల్ గాంధీతో భేటీ చేయించి వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచినారు. వీటన్నిటి ప్రతిఫలంగా, రేవంత్ రెడ్డి ప్రభావంతో, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఉత్సాహంతో, నేతల ఐక్యతతో కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఎన్నికల సమయంలో పనిచేసిన ఉద్యమకారులు కొత్త ప్రభుత్వంలో భాగస్వాములై పనిచేద్దామనుకున్నారు. కానీ కాంగ్రెస్ పెద్దలకు ఫోన్లు చేస్తే, మునుపటిలా స్పందించలేదని కొందరు ఆవేదన చెందారు. అంతలో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ మొదలైంది. మళ్ళీ తమ అవసరం వారికి ఉంటుందని ఆ పిలుపుకై ఎదురుచూస్తూ ఉండిపోయారు కొందరు. కానీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఉద్యమకారులందరినీ తమ వెంట ఉంచుకున్నట్లు, పార్లమెంట్ ఎన్నికలప్పుడు వారిని కాంగ్రెస్ పార్టీ వెంట ఉంచుకోలేకపోయింది. మిత్రపక్షమైన టీజేఎస్ రాజకీయ పార్టీ అధ్యక్షుడినే ఉద్యమ ప్రతినిధిగా చూపించుకున్నది. ఇలా కాకుండా అసెంబ్లీ ఎన్నికలప్పటిలాగే లోక్‌సభ ఎన్నికలప్పుడు కూడా ఉద్యమకారులతో సమావేశాలు పెట్టి, కాంగ్రెస్ పార్టీ ప్రచారాల్లో వీరిని కలుపుకొని పోతే, ప్రజల్లో ఇంకా విశ్వసనీయత పెరిగి ఉండేది. కాంగ్రెస్ పార్టీకి కనీసం ఇంకో నాలుగైదు సీట్లు అయినా దక్కేవి. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారుల సూచనలను పరిగణలోకి తీసుకొని పాలనను కొనసాగిస్తే పాలించే పార్టీకి మేలు జరుగుతుంది. రానున్న రోజుల్లో వేరే పార్టీ పుంజుకునే అవకాశం ఉండదు. ఉద్యమకారులే తెలంగాణకు రక్షణ కవచం! ఉద్యమకారుల ఆకాంక్షలను, ఎన్నికల సమయంలో వారికిచ్చిన హామీలను నెరవేర్చితే చాలు, ఉద్యమకారులే ఈ ప్రభుత్వాన్ని కాపాడుకుంటారు. అప్పుడు ఇది ముమ్మాటికి ప్రజాపాలన అవుతుంది.

– సయ్యద్ రఫీ (చిత్ర దర్శకుడు)

అన్నిటికీ రేషన్ కార్డు అడిగితే ఎలా?

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అసలు రేషన్ కార్డుల జారీ జరగనే లేదు. గతంలో ఇవ్వబడిన కార్డుకు ఒక చిన్న పేపర్ అంటించి ఒక ఆన్‌లైన్ టాగ్ తొడిగారు. కుటుంబ సభ్యుల్లో చౌకధరల దుకాణం వద్దకు ఎవరు వెళ్లినా ఆధార్ నంబర్ చెబితే రాష్ట్రంలో ఎక్కడైనా సరుకులు తెచ్చుకునే వెసులుబాటుని ఇచ్చారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కొన్ని రేషన్ కార్డులు ఇవ్వాలనుకుంటుంది. ఆహ్వానించదగ్గ పరిణామమే. అయితే ఈ ప్రక్రియలో లబ్ధిదారుల అర్హతానర్హతల గురించి కూలంకషంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపిన తర్వాతనే రేషన్ కార్డులు జారీ చేయాలి. ఆర్థికపరమైన నియమ నిబంధనలను, సామాజిక ఆర్థిక స్థితిగతులను, వాస్తవంగా నివసిస్తున్న ప్రాంతాన్ని, వారి సంవత్సర ఆదాయాన్నీ... వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకోవాలి. సంవత్సరాదాయాన్ని మూడు లక్షల వరకు పరిమితిని విధించి తెలంగాణలో ఆదివాసీలు, దళితులు, అత్యంత వెనుకబడిన కులాలు, మైనారిటీలకు తప్పనిసరిగా ఇవ్వాలి.

గత ప్రభుత్వం పదేళ్ళల్లో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకపోగా ఉన్న వాటిని తగ్గించే ప్రయత్నం చేసింది. బోగస్ కార్డుల ఏరివేత లేదా వీడ్ అవుట్ పేరిట చాలా కార్డులను తొలగించింది. వాటి స్థానంలోకి ఒక్క కార్డు కూడా ఇవ్వలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానాల్లో భాగంగా కొత్త రేషన్ కార్డులు ఇస్తామంటూ మాట ఇచ్చి ఉన్నందున ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి దరఖాస్తులను ఆహ్వానించింది. అందులో ఎక్కువ శాతం రేషన్ కార్డులు ఉన్నాయి. అంటే ఇంకా చాలామంది కొత్త రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తున్నారని రుజువయింది. కానీ, ఆరు గ్యారంటీల దరఖాస్తుకు తెల్లకార్డు అర్హతగా ఉన్నట్లు తెలుస్తోంది. అర్హులైన వారికి కొత్త కార్డులు ఇవ్వకుండా ఆరు గ్యారంటీల అమలు కోసం రేషన్ కార్డు జత చేయాలి అనటం ఎలా సమంజసం? అర్హులకు కార్డు ఇచ్చాక ఆరు గ్యారంటీల హామీ అమలుకు రేషన్ కార్డ్ లింకు పెడితే లబ్ధిదారులకు న్యాయం జరుగుతుంది. ప్రజలకు మీరు ఇచ్చిన భరోసాను కోల్పోకుండా ఉంటారు.

– వి. బాలరాజు, రిటైర్డు తహశీల్దారు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

హరీష్ విష ప్రచారం వెనక కుటిల తంత్రం

అక్రమాలు, అబద్ధాలను కలిపితే హరీష్ రావు అవుతారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనా కాలంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా, జలవనరుల శాఖ మంత్రిగా గోరంత పనికి కొండంత ప్రచారం చేసిన ఆయన ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చేస్తున్న కొండంత పనిపై విషం చిమ్ముతున్నారు. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గతేడాది డిసెంబరు ఏడున ఏర్పడిన తర్వాత మహాలక్ష్మి పేరుతో రాష్ట్రంలోని మహిళలంతా ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసే అవకాశం కల్పించారు. నాటి నుంచి వరుసగా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.పది లక్షలకు పెంచడం; ఆటో, క్యాబ్ డ్రైవర్లు, గిగ్‌వర్కర్లకు రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం; టీఎస్‌పీఎస్సీ ప్రక్షాళన; 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా; డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు అందించడం; ప్రజా సదస్సుల నిర్వహణ; ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు స్వీకరించడం; రూ.500కే గ్యాస్ సిలెండర్ల పంపిణీ; ధరణిలో మార్పులు; ఉద్యోగాలకు వరుస నోటిఫికేషన్ల జారీ... ఇలాంటి చర్యలెన్నో తీసుకున్నది. హైదరాబాద్ నగర ప్రజలను ఏళ్లుగా వేధిస్తున్న ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు రక్షణ శాఖతో సంప్రదించి ఆ శాఖ భూముల బదిలీకి ఒప్పందం కుదుర్చుకోవడమే గాక, ఆయా ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా తడిచిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు తుఫానుతో నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందచేసింది. యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా వాటిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. అన్నింటికి మించి హరీష్‌రావు మామ కేసీఆర్ గడీలా మార్చుకున్న ప్రగతి భవన్ ఎదుట కంచెలను తొలగించి దానిని ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మార్చింది. ఈ మంచి పనులను ఏనాడూ హరీష్ రావు ప్రశంసించలేదు. పైగా ప్రజా ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న ప్రగతిశీల కార్యక్రమాలను చూసి ఓర్చుకోలేక మరింతగా విషం కక్కడం ప్రారంభించారు.

నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాగిన తెలంగాణ ఉద్యమాన్ని ఆలంబనగా చేసుకొని బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ తొలి ప్రభుత్వంలో జల వనరుల మంత్రిగా హరీష్‌రావు పని చేశారు. అప్పుడు కాళేశ్వరం ప్రారంభించారు. అంచనాలు పెంచుతూ సొంత డిజైన్లు చేసుకుంటూ వెళుతూ రూ.వేల కోట్లను స్వాహా చేశారు. నాసిరకం నిర్మాణంతో అయిదేళ్లు కాకముందే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది. గతంలోనే వరదతో పంపు హౌస్‌లన్నీ మునిగిపోయినా అధికారం దన్నుతో పోలీసు బలగాలను పెట్టి అక్కడకు ఎవరినీ వెళ్లకుండా చూసి తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. కానీ ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత మేడిగడ్డ బ్యారేజీ కుంగడంతో కాళేశ్వరంలోని డొల్లతనం బయటపడింది. కాళేశ్వరంపై విచారణ సాగుతుండడంతో తన అక్రమాలు ఎక్కడ బయటకు వస్తాయోనన్న భయంతో హరీష్‌రావు వణికిపోతున్నారు. ఈ క్రమంలోనే ప్రతి చిన్న అంశంపైనా స్పందిస్తూ నానాయాగీ చేస్తున్నారు. నిరుద్యోగులపై ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తున్నారు.



ఒక వైపు బీఆర్ఎస్ ఉనికి కోల్పోతుండడం, మరొకవైపు తమ పాలనా కాలంలో చేసిన పాపాలపై విచారణలు ఊపందుకొని జైలు జీవితం గడపాల్సి వస్తుందనే బెంగ హరీష్‌రావును భయపెడుతోంది. కాళేశ్వరంపై విచారణ, కరెంటు కొనుగోలుపై విచారణతో తన మామ కేసీఆర్‌తో పాటు తాను జైలుకు వెళ్లకతప్పదని హరీష్‌రావుకు అర్థమవుతోంది. అందుకనే మామ కేసీఆర్ సూచనతో బీజేపీలో చేరి తనను, తన కుటుంబాన్ని రక్షించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు.

మా కొలువులు మాకేనంటూ సాగిన తెలంగాణ ఉద్యమ సమయంలో హరీష్‌రావు ఎక్కడలేని హడావుడి సృష్టించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే కొలువులన్నీ మనకే దక్కుతాయంటూ నిరుద్యోగులను రెచ్చగొట్టారు. తన వంటిపై పెట్రోల్ పోసుకొని యువతను రెచ్చగొట్టి వారి ఆత్మహత్యలకు కారణమయ్యారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనా కాలంలో ఒకే ఒక్కసారి గ్రూప్–1 నోటిఫికేషన్ జారీ చేశారు. దానిని సమర్థంగా నిర్వహించలేకపోవడంతో పేపర్ లీక్ అయింది. చివరకు ఆ పరీక్షను రద్దు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గ్రూప్–1 పరీక్షకు నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు ప్రిలిమ్స్ పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. సుమారు ఏడువేల మంది స్టాఫ్ నర్సులకు జనవరి నెలాఖరులో నియామక పత్రాలను ముఖ్యమంత్రి అందజేశారు. వివిధ శాఖల్లో ఉన్న ఖాళీల భర్తీకి అవసరమైన ఏర్పాట్లను రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్‌లో రూ.40వేల కోట్ల విలువైన ఒప్పందాలను చేసుకున్నారు. వీటితో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. తెలంగాణ యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇప్పించి ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఐటీఐల్లో నైపుణ్య ఆధారిత శిక్షణ కోసం టాటా కన్సల్టెన్సీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. యువతలో నైపుణ్యాభివృద్ధికి ఉమ్మడి పది జిల్లాల్లో స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇలా వేలాది పోస్టులు భర్తీ చేస్తూ తెలంగాణ ఉద్యమ నినాదమైన నియామకాలను రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం నెరవేర్చుతుంటే సాంకేతికపరమైన ఒకటి రెండు చిన్న చిన్న అంశాలను అడ్డుపెట్టుకొని నిరుద్యోగుల్లో అభద్రతా భావాన్ని సృష్టిస్తూ, అపోహలు కల్పిస్తున్నారు హరీష్‌రావు.

1985 నుంచి కేసీఆర్, ఆ తర్వాత హరీష్‌రావుకు కంచుకోటగా ఉన్న సిద్దిపేటలో 60 వేలకుపైగా ఓట్లను బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు హరీష్‌రావు మళ్లించారు. ఇది దాచేస్తే దాగని సత్యం. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు పూర్తిగా తిరస్కరించి సున్నా సీట్లకే పరిమితం చేశారు. ఒకవైపు బీఆర్ఎస్ ఉనికి కోల్పోతుండడం, మరొకవైపు తమ పాలనా కాలంలో చేసిన పాపాలపై విచారణలు ఊపందుకొని జైలు జీవితం గడపాల్సి వస్తుందనే బెంగ హరీష్‌రావును భయపెడుతోంది. కాళేశ్వరంపై విచారణ, కరెంటు కొనుగోలుపై విచారణతో తన మామ కేసీఆర్‌తో పాటు తాను జైలుకు వెళ్లకతప్పదని హరీష్‌రావుకు అర్థమవుతోంది. అందుకనే మామ కేసీఆర్ సూచనతో బీజేపీలో చేరి తనను, తన కుటుంబాన్ని రక్షించుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. (కేసీఆర్ కుమార్తె కవిత ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఇప్పటికే తీహార్ జైలులో ఉన్న విషయం ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన అంశం). ఇందులో భాగంగానే బీఆర్ఎస్‌లోని పాత మిత్రుడు, ప్రస్తుత మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, తన చీకటి మిత్రుడు రఘునందన్‌రావుతో కలిసి బీజేపీలో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే బీజేపీపై విమర్శలు మానేసి కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. బీఆర్ఎస్ (తొలుత టీఆర్ఎస్) ఏర్పడిన నాటి నుంచి నిత్యం చంద్రబాబు నాయుడుపై విమర్శలు, దూషణలు చేసిన హరీష్ రావు అకస్మాత్తుగా ఏపీ ముఖ్యమంత్రిని చూసి నేర్చుకోవాలని రేవంత్ రెడ్డికి సుద్దులు చెబుతున్నారు. నిన్న మొన్న కొలువు దీరిన ఒడిశాలో బీజేపీ ప్రభుత్వాన్ని ప్రశంసిస్తున్నారు. బీజేపీలో చేరడం రాష్ట్రంలో తాను నమ్ముకున్న ముగ్గురి మిత్రులతో సాధ్యపడకపోతే ఇప్పుడు ఎన్డీఏలో కీలకంగా ఉన్న చంద్రబాబు నాయుడు ద్వారానైనా చేరేందుకు ఎత్తులు వేస్తున్నారు. హరీష్‌రావు కుటిల నీతిని, కుయుక్తులను విజ్ఞులైన తెలంగాణ ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

▪ సామ రామ్మోహన్ రెడ్డి
ఛైర్మన్, మీడియా & కమ్యూనికేషన్స్, టీపీసీసీ

బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 33.1 కనిష్ఠం 26.3

బిల్లులు చెల్లించకుంటే కనెక్షన్ కట్: వాటర్ బోర్డు

హైదరాబాద్ సిటీ, జూన్19 (ఆంధ్రజ్యోతి): నీటి బిల్లులు చెల్లించాలని సందేశాలు పంపినా నిర్లక్ష్యంగా వ్యవహరించే వినియోగదారుల నల్లా కనెక్షన్లను తొలగించాలని వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రెవెన్యూపై నిర్దేశించిన లక్ష్యాల్ని ఈ నెలాఖరులోపు చేరుకోవాలని సూచించారు. ఖైరతాబాద్‌లోని వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయంలో బుధవారం రెవెన్యూపై ఎండీ సమీక్షాసమావేశం నిర్వహించారు.


ఎస్ఎన్‌డీపీ ఫేజ్-2 రద్దు..!

హెచ్-సిటీలో భాగంగా కొత్త ప్రణాళిక ● రూ.458.22 కోట్లతో ప్రతిపాదనలు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మెరుగైన వరద ప్రవాహ వ్యవస్థ నిర్వహణ ప్రాజెక్టులపై జీహెచ్ఎంసీ పునరాలోచనలో పడింది. నిధుల లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రాధాన్యతాక్రమంలో నాలాల విస్తరణ, అభివృద్ధి పనులను చేపట్టాలని నిర్ణయించింది. గత ప్రభుత్వం చేపట్టిన వ్యూహాత్మక నాలాల అభివృద్ధి ప్రణాళిక(ఎస్ఎన్‌డీపీ)లో ఫేజ్ 2 పనులను పక్కన పెట్టింది. కొత్త ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రేటర్ పరిధిలో ముంపు తీవ్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని నాలాల పనులకు జీహెచ్ఎంసీ ప్రతిపాదనలు రూపొందించింది. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సీఐటీఐ) పేరిట నూతన ప్రణాళికలు సిద్ధం చేసింది. జీహెచ్ఎంసీలోని ఆరు జోన్లలో రూ.458.28 కోట్ల అంచనా వ్యయంతో 29 పనులకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) రూపకల్పనకు ఏజెన్సీలను తాజాగా బల్దియా ఎంపిక చేసింది.

గ్రేటర్ వరకు మాత్రమే..

ప్రస్తుతానికి గ్రేటర్ పరిధి వరకు మాత్రమే కొత్త ప్రణాళికలు రూపొందించారు. నిధుల లభ్యతను బట్టి దశల వారీగా పనులను చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు. ఎస్ఎన్‌డీపీ ఫేజ్-1లో మెజార్టీ పనులు తుది దశకు చేరుకున్నాయి. పలు కారణాలతో రెండు, మూడు ప్రాంతాల్లో ప్రారంభం కాని పనులను రూ.100 కోట్ల అంచనా వ్యయంతో హెచ్-సిటీలో చేర్చినట్టు ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారొకరు తెలిపారు. డీపీఆర్ అందిన అనంతరం పనులకు సంబంధించి టెండర్ నోటిఫికేషన్ ప్రకటిస్తామని పేర్కొన్నారు.


(ఫైల్)

హెచ్-సిటీ తాజా ప్రతిపాదనలివి..

జోన్ పరిధి	పనులు	వ్యయం (రూ.కోట్లలో)
ఎల్‌బీనగర్	7	131.61
చార్మినార్, ఖైరతాబాద్, సికింద్రాబాద్	9	120.47
శేరిలింగంపల్లి	7	102.89
కూకట్‌పల్లి	6	103.31
మొత్తం	29	458.22



ఎల్లంపల్లిలో అత్యవసర పంపింగ్

- నీటిమట్టాలు పడిపోవడంతో ప్రారంభం
- హైదరాబాద్‌కు నిరాటంకంగా గోదావరి జలాల తరలింపు

హైదరాబాద్ సిటీ, జూన్19 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో వాటర్‌బోర్డు బుధవారం అత్యవసర పంపింగ్ ప్రారంభించింది. రిజర్వాయర్ నీటిమట్టాలు ప్రమాదకర స్థాయికి చేరడంతో మహా నగరానికి గోదావరి జలాల తరలింపులో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టింది. అధునాతనమైన ఏడు భారీ పంపులను ప్రారంభించి ఎల్లంపల్లి రిజర్వాయర్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోస్తున్నారు. దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత అత్యవసర పంపింగ్ ప్రారంభించారు. ఇప్పటికే నాగార్జునసాగర్‌లో అత్యవసర పంపింగ్ కొనసాగుతోంది.

హైదరాబాద్ మహా నగరానికి రోజూ 750 మిలియన్ లీటర్ల గోదావరి జలాలను సరఫరా చేస్తున్నారు. ఎల్లంపల్లి రిజర్వాయర్ వద్ద భారీ పంపులను ఏర్పాటు చేసి ఈ నీటిని తరలిస్తున్నారు. రిజర్వాయర్‌లో నీళ్లు ఎక్కువ ఉంటే గ్రావిటీ ద్వారా మల్లారం పంపింగ్ కేంద్రం వరకు గోదావరి జలాలు వస్తాయి. నీటిమట్టం తగ్గిపోతే గ్రావిటీ ద్వారా నీళ్లు వచ్చే అవకాశం తగ్గుతుంది. భారీ మోటర్లకు నీళ్లు అందకపోతే

మిగతా 6వ పేజీలో..

హాస్టళ్లు కాదు.. అనారోగ్య కేంద్రాలు!

- దారుణంగా నగరంలోని ప్రైవేట్ హాస్టళ్లు
- కుళ్లిన కూరగాయలు, కాలం చెల్లిన సరుకులు
- ఐటీ కారిడార్‌లోని వసతి గృహాల్లోనూ అదే సీనూ
- ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీల్లో బయటపడిన బాగోతం
- అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్న యువత

అపరిశుభ్ర వాతావరణంలో వంటావార్పు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కన్నవారిని, సొంత ఊరిని వదిలి పొట్టకూటి కోసమో, ఉన్నత విద్య కోసమో దేశం నలుమూలల నుంచి హైదరాబాద్ నగరానికి వచ్చే ఎంతోమంది.. ప్రైవేటు హాస్టళ్లు, పీజీ(పేయింగ్ గెస్ట్)ల్లో బస చేస్తుంటారు. అద్దెల రూపంలో ఒక్కొక్కరి నుంచి వేల రూపాయలు వసూలు చేసే హాస్టళ్ల నిర్వాహకులు తమ వద్ద వసతి పొందుతున్న వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కూరగాయలు, పురుగులు పట్టిన బియ్యం, గడువు ముగిసిన కారం, మసాలాలు, నాసిరకం సరుకులు, అపరిశుభ్రతకు నిర్వచనంగా నిలిచే వంట గదులు, సామాన్లు... గుట్కాలు నములుతూ వండి వడ్డించే పనివారు.. హైదరాబాద్ నగరంలోని చాలా ప్రైవేట్ హాస్టళ్లలో నెలకొన్న దారుణమైన పరిస్థితులివి. ఇలాంటి వాతావరణంలో ఉంటూ, అక్కడ వండిన ఆహారాన్ని తింటూ.. డబ్బులిచ్చి మరీ చాలామంది తమ ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నారు. ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృందాలు చేపట్టిన తనిఖీల్లో ప్రైవేటు హాస్టళ్లలో నెలకొన్న ఈ భయానక పరిస్థితులు వెలుగు చూస్తున్నాయి.

ఆరోగ్యంతో చెలగాటం

హైదరాబాద్‌లోని మాదాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో ఉన్న ప్రైవేటు హాస్టళ్లలో టాస్క్‌ఫోర్స్ బృందాలు గత మూడు రోజులుగా తనిఖీలు చేస్తున్నాయి. చాలా హాస్టళ్లలో కనీసం సరైన తాగునీరు కూడా అందుబాటులో ఉంచడం లేదని చూసి అధికారులు నివ్వెరపోయారు. మాదాపూర్‌లోని సింధు జడ్డు ఉమెన్స్ హాస్టల్, ఓం శ్రీ సాయి నంద డీలక్స్ మెన్స్ హాస్టల్, తనుశ్రీ గ్రాండ్ విమెన్స్ హాస్టల్, ఓం శ్రీ సాయి నంద ఉమెన్స్ హాస్టల్, ఎస్ఆర్ లేడీస్ హాస్టల్, వీజీ హోం స్టే, శ్రీలక్ష్మి పీజీ హాస్టల్, ఆర్-3 కోలివ్, సెవెన్ హిల్స్ లగ్జరీ పీజీ ఫర్ మెన్, హరి హెవెన్ లగ్జరీ మెన్స్ హాస్టల్, తిరుమల మెన్స్ ఎగ్జిక్యూటివ్ హాస్టల్, శ్రీ లక్ష్మి ఎగ్జిక్యూటివ్ మెన్స్ హాస్టల్, మమత ఎగ్జిక్యూటివ్ ఉమెన్స్ పీజీలతో పాటు నారాయణ సొసైటీ, (సర్వే నెంబర్ 11/20), నారాయణ మెడికల్ అకాడమీ, (సర్వే నెంబర్ 11/51)లో కనీస ప్రమాణాలు పాటించడం లేదని అధికారులు గుర్తించారు. ఆయా హాస్టళ్లలో వంట చేసే మనుషులు.. పని సమయంలో హెయిర్ క్యాప్‌లు, హ్యాండ్ గ్లవ్స్, ఫేస్ మాస్కులు ధరించడం లేదు. చాలామంది గుట్కాలు నములుతూ ఇష్టారీతిన మాట్లాడుతూ వంటలు చేస్తూ వాటినే వడ్డిస్తున్నారు. ఇక, వంట గదుల్లో బొద్దింకలు, తుప్పు పట్టిన వంట పరికరాలతోపాటు అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆమోదం పొందిన ఆహార పదార్థాలనే హాస్టళ్లలో వంటకు వాడాలి. కానీ చాలా హాస్టళ్లలో స్థానికంగా తయారైన సాస్‌లు, మసాలాలు, ఫుడ్ కలర్స్ కాలం చెల్లిన సరుకులు ఇష్టమొచ్చినట్టుగా వాడేస్తున్నారు. నాసిరకం బియ్యంతో వండిన అన్నాన్ని చాలా హాస్టళ్లలో వడ్డిస్తుండగా, పలు హాస్టళ్లలో పురుగు పట్టిన బియ్యాన్ని వినియోగిస్తున్నారు. ఆయా హాస్టళ్లలో సేకరించిన బూజు పట్టిన పప్పులు, బియ్యం, పిండి, మసాలాల నమూనాలను అధికారులు ల్యాబ్‌లకు పంపారు. రూ.వేలు, లక్షల్లో వేతనాలు పొందే ఐటీ ఉద్యోగులు ఉండే ఐటీ కారిడార్‌లోని హాస్టళ్లు, పీజీల్లో, కార్పొరేట్ కళాశాలలకు చెందిన హాస్టళ్లలో ఇలాంటి పరిస్థితులు ఉండడం గమనార్హం.


హాస్టల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సిబ్బంది



ప్రమాణాలకు పాతర

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వేల సంఖ్యలో ప్రైవేటు హాస్టళ్లు ఉన్నాయి. అందించే వసతుల బట్టి ఒక్కొక్కరి నుంచి నెలకు రూ.6 వేల నుంచి రూ.20 వేల దాకా నిర్వాహకులు వసూలు చేస్తుంటారు. ఇంత డబ్బు వసూలు చేస్తోన్న హాస్టళ్ల నిర్వాహకులు నిబంధనలు, కనీస నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. నిబంధనల ప్రకారం హాస్టళ్లలో పని చేసే సిబ్బంది ఆరోగ్యాన్ని తెలియచేసే మెడికల్ సర్టిఫికెట్లు ఉండాలి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆమోదం పొందిన ఆహార పదార్థాలనే వినియోగించాలి. చాలా హాస్టళ్లలో అలాంటివి ఉండడం లేదు. ప్రైవేట్ హాస్టళ్లకు ఏ విభాగం అనుమతి ఇవ్వాలి? ఎవరు వాటిని పరిశీలించాలి? అనే అంశాలపై స్పష్టత లేదు. దీంతో హాస్టళ్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రమాణాల ప్రకారం హాస్టల్ నిర్వాహకులు జీహెచ్ఎంసీ నుంచి ఫుడ్ లైసెన్స్ తీసుకోవాలి. అలాగే, హాస్టళ్లకు జీహెచ్ఎంసీ నుంచి ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి. బల్దియా సిబ్బంది పట్టించుకోకపోవడం వల్ల చాలా మంది హాస్టల్ నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడం లేదు. ఎవరైనా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నా నిబంధనల ప్రకారం తనిఖీలు చేయకుండా లైసెన్సులు జారీ చేస్తున్నారు. దీంతో 50-60 గజాల్లో నాలుగైదు అంతస్తులు నిర్మించి హాస్టళ్లకు అద్దెకిస్తున్నారు. రెండు పడకల గదుల ఇళ్లనూ హాస్టళ్లుగా మారుస్తున్నారు. బల్కంపేట ప్రాంతంలో రెండు పడకల గదిలో 15 నుంచి 20 మందికి వసతి కల్పిస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఏదైనా దుర్ఘటన జరిగితే తీవ్ర నష్టం తప్పదు.


కుళ్లిపోయిన ఆలుగడ్డలు

21న ఖైదీలు, జైలు సిబ్బందికి యోగా

● తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ జనరల్ అభిలాషా బిస్త్

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఖరీదైన ఉపకరణాలేవీ లేకుండా ఆరోగ్యాన్ని పొందగలిగే ప్రక్రియ యోగా అని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ జనరల్ అభిలాషా బిస్త్ అన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జైళ్లు, కార్యాలయాల్లో ఖైదీలకు, సిబ్బందికి విడివిడిగా యోగా శిక్షణను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో పోలీస్ అకాడమీలోని 1200 మంది పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లు పాల్గొంటారని వెల్లడించారు. కొన్నేళ్లుగా యోగా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోందని శ్రీశ్రీ రవిశంకర్ తెలిపారు. యోగాలో ఆసనాలు అనేవి ఆరంభ సూచిక మాత్రమే అని, విజ్ఞానం చాలా లోతైనదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా ప్రదేశాలలో 55 వేలమందికి పైగా యోగా సాధకులు, ఔత్సాహికులు ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనబోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

జూలై 21, 22 తేదీల్లో పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలు

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ(పీహెచ్‌డీ) అడ్మిషన్ల ప్రక్రియలో కదలిక వచ్చింది. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జూలై 21, 22 తేదీల్లో ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. వాస్తవానికి పీహెచ్‌డీ అడ్మిషన్ల నిమిత్తం ఈ ఏడాది జనవరి 23న జేఎన్‌టీయూ అడ్మిషన్ విభాగం నోటిఫికేషన్ జారీచేయగా, 1,000 మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించారు. అయితే.. కొందరు అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల ఫైలు ఆర్నెళ్లపాటు అడుగు ముందుకు పడలేదు. ఇటీవల జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్‌గా బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారి బుర్రా వెంకటేశం.. ఈ విషయమై సీరియస్‌గా స్పందించారు. సంబంధిత విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఇన్‌చార్జ్ వీసీ ఆదేశాల మేరకు ప్రవేశ పరీక్షల తేదీలను ఖరారు చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. దీంతో ఎంతోకాలంగా పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం నిరీక్షిస్తున్న అభ్యర్థులకు ఉపశమనం కలిగినట్లయింది.

చంపేశారు..



చోరీ సొత్తు పంపకాల్లో వివాదం

● యువకుడి హత్య

సనత్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు దొంగల మధ్య చోరీ సొత్తు పంపకాల్లో ఏర్పడిన వివాదం హత్యకు దారి తీసింది. కత్తితో పొడిచి బండ రాళ్లతో మోది హత్య చేసిన సంఘటన సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగడ్డ ఏజీకాలనీ సమీపంలోని నేతాజీ నగర్‌కు చెందిన అజహర్(22), ఎర్రగడ్డకు చెందిన మహ్మద్ ఆసిఫ్(23) తోడుదొంగలు. నగరంలోని పలు ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. 2023లో సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా చోరీ చేశారు. చోరీ సొత్తును విక్రయించి డబ్బుగా చేసుకుని పంచుకునేవారు. ఈ క్రమంలో ఇటీవల వీరిద్దరి మధ్య చోరీ సొత్తు పంపకాల విషయంలో తేడా వచ్చింది. ఇదే విషయమై ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి ఇద్దరు మద్యం తాగి భరత్‌నగర్ ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ వెనక పొదల్లోకి వెళ్లారు. అక్కడ మళ్లీ మద్యం తాగి ఘర్షణ పడ్డారు. ఘర్షణలో ఆసిఫ్ అజార్‌ను కత్తితో పొడిచి రాళ్లతో తలపై మోది హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. బుధవారం మధ్యాహ్నం తానే మరో మిత్రుడు అజీజ్‌కు ఫోన్ చేసి హత్య విషయం చెప్పాడు. అంతకుముందే అజార్ తల్లిదండ్రులు బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తులో అజార్ హత్యకు గురైనట్టు గుర్తించి సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న సనత్‌నగర్ పోలీసులు అజార్ మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ఆసిఫ్ కోసం గాలిస్తున్నారు.


అజహర్ (ఫైల్)

మాట్లాడుకుందామని పిలిచి..

● సోదరులపై కత్తులతో దాడి.. ఒకరి మృతి

చాంద్రాయణగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మాట్లాడుకుందామని పిలిపించి నలుగురు సోదరులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం.. కాలాపత్తర్‌కు చెందిన అన్వర్, అసద్ పాత నేరస్థులు. అదే ప్రాంతానికి చెందిన వాజిద్, సాజిద్, ఖదీర్, రఫీక్ సిమ్లాన్(38) నలుగురూ సోదరులు. అన్వర్, అసద్‌లతో వాజిద్ సోదరులకు పాతకక్షలున్నాయి. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఒంటి గంట సమయంలో మాట్లాడుదామని వాజిద్‌ను అన్వర్, అసద్ ఫాతిమా హాస్పిటల్ వద్దకు పిలిపించారు. వాజిద్ అక్కడికి వెళ్లిన విషయం తెలుసుకున్న అతని సోదరులు సాజిద్, ఖదీర్, రఫీక్ సిమ్లాన్ కూడా అక్కడికి వెళ్లారు. అన్వర్, అసద్‌లకు వాజిద్ సోదరులకు మధ్య వివాదం తలెత్తింది. రెండు గ్రూప్‌ల మధ్య మాటామాటా పెరగడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. అన్వర్, అసద్‌లు వాజిద్ సోదరులపై కత్తులతో దాడికి దిగారు. తీవ్ర గాయాలపాలైన రఫీక్ సిమ్లాన్ అక్కడికక్కడే మృతిచెందాడు. వాజిద్, సాజిద్, ఖదీర్‌లకు కత్తి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అన్వర్, అసద్‌ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

భార్యపై అనుమానంతో..

అడ్డగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అనుమానంతో భార్యను వేధిస్తూ బుధవారం కత్తితో పొడిచి చంపేశాడు. అడ్డగుట్టలో ఉంటున్న లక్ష్మణ్, రోజా (35) దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. భార్య వస్త్ర దుకాణంలో పనిచేస్తుండగా, లక్ష్మణ్ తాగుడికి బానిసై ఏ పనీ చేయకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. అనుమానంతో తరచూ భార్యను వేధించేవాడు. మంగళవారం

మిగతా 6వ పేజీలో..

తెలంగాణ ఓ బ్రాండ్‌గా అభివృద్ధి చెందుతుంది..!

ఫ్లో సదస్సులో ఆర్ట్ పరిశోధకుడు, ఆర్టెరీ ఫౌండర్ అరవింద్ విజయ్ మోహన్

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓ బ్రాండ్‌గా అభివృద్ధి చెందుతుందని, సైబరాబాద్ ఆకర్షణీయంగా ఉందని సుప్రసిద్ధ ఆర్ట్ రీసెర్చర్, ఆర్టెరీ ఇండియా ఫౌండర్-సీఈవో అరవింద్ విజయ్ మోహన్ అన్నారు. మాగ్నెటిక్ బ్రాండ్స్ అనే నేపథ్యంతో సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఫ్లో హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియా గజ్దార్‌తో పలు అంశాలపై ముచ్చటిస్తూ వ్యాఖ్యలు చేశారు. బ్రాండ్ ఇండియా గురించి మాట్లాడుతూ గుర్తించతగిన శక్తిగా మారిందన్నారు. మొత్తం ప్రపంచం ఇప్పుడు బ్రాండ్ ఇండియాను గుర్తిస్తుందంటూ అంతర్జాతీయంగా ఇప్పుడు ఇండియాను సానుకూలంగా చూస్తున్నారని, అభివృద్ధి చెందుతున్న దేశంగానూ కీర్తిస్తున్నారన్నారు. ఈ సందర్భంలోనే పలు విజయవంతమైన బ్రాండ్లు సాధించిన విజయం దానికి గల కారణాలను కూడా విశ్లేషించారు. రోల్స్ రాయిస్ ఎక్కడా ఆటో ఎక్స్‌పోలో పాల్గొనదు. ఎక్కడా ఓ ప్రకటన కూడా ఇవ్వదు. అయినా అది విజయవంతమైన బ్రాండ్‌గానే నిలిచింది. కారణమేమిటంటే, ఎక్స్‌క్లూజివిటీ అనే ఆలోచనల చుట్టూ ప్రతిబింబించడం. ఇది ఓ కారు కంటే కూడా హోదా, ఎక్స్‌క్లూజివిటీ, ఆకర్షణల సమ్మేళనంలా ఉంటుంది. అలాగే పటేక్ ఫిలిప్పీ అత్యున్నత నాణ్యత కలిగిన లగ్జరీ వాచ్‌లు తయారుచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా దీనికి క్రేజ్ ఉంది. అలాగే ఐబీఎం, నైకీ, ఓల్డ్ స్పైస్, పేపర్‌బోట్, రోలెక్స్‌వాచీలు అంతర్జాతీయంగా ఖ్యాతి గడించడానికి వాటి ఎక్స్‌క్లూజివిటీ, నాణ్యత కారణం. ఈ నాణ్యత లేకపోవడం, ముఖ్యంగా ఒరిజినాలిటీ లేకపోవడంతో లగ్జరీ విభాగంలో భారతీయ బ్రాండ్లు పెద్దగా గుర్తింపు తెచ్చుకోలేకపోయాయన్నారు. భారతీయ బ్రాండ్లకు అంతర్జాతీయంగా ఖ్యాతి గడించే అవకాశాలు రావాలంటే నాణ్యత, ఒరిజినాలిటీ పై అధికంగా దృష్టి సారించాలన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న అరవింద్ విజయ్ మోహన్

తన గురించి చెబుతూ ఆర్ట్ టీచర్ల కుటుంబం నుంచి వచ్చిన తనకు దానిపై స్వతహాగానే అభిరుచి కలిగిందన్నారు. తాను ప్రణాళిక చేసుకుని లేదంటే లెక్కలు వేసుకుని ఇక్కడకు రాలేదంటూ, బ్రాండ్ స్టోరీ క్రాఫ్ట్‌మెన్‌షిప్ తరువాత వచ్చిందన్నారు. భారతదేశంలో కళపై పెడుతున్న పెట్టుబడుల గురించి మాట్లాడుతూ ఆర్ట్‌ను పెట్టుబడి మార్గంగా ఎన్నడూ చూడలేమన్నారు. ఆర్ట్ అనేది ఓ సాంస్కృతిక పెట్టుబడిగా అభివర్ణించిన ఆయన ఆ విధంగా చూస్తే దానిలో గర్వం తొణికిసలాడవచ్చన్నారు.

ఎల్లంపల్లిలో అత్యవసర పంపింగ్

(5వ పేజీ తరువాయి)

మరమ్మతులకు గురయ్యే ప్రమాదం ఉంది. అదే జరిగితే హైదరాబాద్ మహా నగరానికి నీటి తరలింపు నిలిచిపోనున్నది. దాంతో నగరంలో చాలా ప్రాంతాలకు నీటి కొరత ఏర్పడుతుంది. ఐటీ కారిడార్ పరిధిలోకి వచ్చే మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ, లింగంపల్లి, మియాపూర్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి, చందానగర్, నిజాంపేట, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాలకు గోదావరి జలాలే సరఫరా అవుతున్నాయి. ప్రస్తుతం ఎల్లంపల్లిలో నీటిమట్టాలు తగ్గడంతో జలాశయంలో గతంలో ఏర్పాటు చేసిన కాంక్రీట్ దిమ్మలు బయటకు వచ్చాయి. వాటిపై అత్యవసర పంపింగ్ చేసేందుకు అధికారులు మోటార్లను బిగించారు. 20 భారీ మోటార్లను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉండగా, ప్రస్తుతం ఏడు మోటార్లను బిగించి అత్యవసర పంపింగ్‌ను ప్రారంభించారు.

చంపేశారు..

(5వ పేజీ తరువాయి)

రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వచ్చిన భార్యతో గొడవ పడి కుమార్తెల ఎదుటే కత్తితో పొడిచి చంపేశాడు.

అర్ధరాత్రి యువకుడి హత్య

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆసిఫ్‌నగర్ పరిధిలో నోబుల్ టాకీస్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి ఓ యువకుడి హత్య కలకలం రేపింది. గుర్తు తెలియని దుండగులు అలీంను కత్తులతో పొడిచి పారిపోయినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అలీం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. హత్యకు కారణం పాతకక్షలా, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చందూలాల్ బారాదరిలో హత్యాయత్నం

చాంద్రాయణగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగుతున్న సమయంలో స్నేహితుల మధ్య తలెత్తిన వివాదంలో స్నేహితుడిని కత్తితో పొడిచి గాయపరిచారు. శాలిబండ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలిబండ అలీబాగ్‌కు చెందిన ఫిరోజ్(28), ఫయాజ్ టక్కర్(35) స్నేహితులు. మంగళవారం అర్ధరాత్రి చందూలాల్ బారాదరిలో మద్యం తాగుతున్న సమయంలో వీరి మధ్య వివాదం తలెత్తింది. ఆగ్రహం చెందిన ఫయాజ్ టక్కర్ కత్తితో ఫిరోజ్ మెడపై కొట్టి గాయపరిచాడు.

పెండింగ్ పనులను పూర్తిచేయాలి

చార్మినార్ జూన్ 19 (ఆంధ్రజ్యోతి): యాకుత్‌పురా నియోజకవర్గంలో పెండింగ్ పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ కోరారు. టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, ఎండీ ముషారఫ్ ఫారుకి, జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డితో మంగళవారం పెండింగ్ పనులపై చర్చించారు.


టీజీఎస్‌పీడీసీఎల్ చైర్మన్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

బండ్లగూడకు పూర్తిస్థాయి ఎస్‌హెచ్‌ఓగా సత్యనారాయణ

మదీన, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ పోలీస్‌స్టేషన్ పూర్తిస్థాయి ఎస్‌హెచ్‌ఓగా కె.సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఆయన మూడు నెలలుగా ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన మహ్మద్ షాకిర్ అలీని సస్పెండ్ చేయడంతో ఆయన స్థానంలో సత్యనారాయణ ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్నారు. సత్యనారాయణకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ నగర పోలీస్ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



అవార్డు అందుకుంటున్న కండక్టర్

ఇద్దరు కండక్టర్లకు అవార్డులు

చాంద్రాయణగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ హైదరాబాద్ రీజియన్ ప్రగతి చక్రం త్రైమాసిక పురస్కారాల్లో ఫలక్‌నుమా డిపోకు చెందిన కండక్టర్లు సీహెచ్ వెంకటేశ్, ఎం.కిషన్ ఎంపికయ్యారు. బుధవారం ఇబ్రాహీంపట్నం డిపోలో జరిగిన కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. డిపో మేనేజర్ జాకిర్ హుస్సేన్ వారిని అభినందించారు.



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

రాజేంద్రనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బడి వద్దు - ప్రభుత్వ బడి ముద్దు అంటూ గ్రేస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శివరాంపల్లి, హసన్‌నగర్ ప్రాంతాలలో బడిబాట నిర్వహించారు. బడీ ఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలని చెబుతూ బడి బాట కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా గ్రేస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు ఎ. సదాలక్ష్మి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.


జగదీష్‌ను సన్మానిస్తున్న ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్

గోనె సంచుల వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి

అఫ్జల్‌గంజ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గన్నీ బ్యాగ్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా నియమితుడైన పేరే జగదీష్ వంజరిని బుధవారం గౌలిగూడలోని ప్రజా ఏక్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గోనె సంచుల వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ పి. కైలాసం, పి. శేఖర్, డి. నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



పత్రీజీ ధ్యాన జ్ఞాన మహాయజ్ఞంలో స్పిరిచ్యువల్ సొసైటీ సభ్యులు డాక్టర్ సంజయ్ సింగ్, విజయ్ భాస్కర్ రెడ్డి, సుధీర్ షా

కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన జ్ఞాన మహాయజ్ఞం

గోషామహల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో పిరమిడ్స్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ భాగ్యనగర్ ట్రస్టు ఆధ్వర్యంలో పత్రీజీ ధ్యాన జ్ఞాన మహాయజ్ఞం ఐదు రోజులుగా ఘనంగా కొనసాగుతుందని సొసైటీ సభ్యులు డాక్టర్ సంజయ్ సింగ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, సుధీర్‌షా తెలిపారు. బుధవారం తెల్లవారు జామున 5 నుంచి 8 గంటల వరకు ఆనాపానాసతి ధ్యానం, అఖండ ధ్యానం, శ్వాసపైన ధ్యాస పెట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ ధ్యానులు ధ్యానం వల్ల కలిగే లాభాలు, ఆరోగ్య రహస్యాలను వివరించారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా డేను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని తెలిపారు.


నల్సార్‌లో ఇద్దరు విశిష్ట ప్రొఫెసర్ల నియామకం

శామీర్‌పేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని నల్సార్ యూనివర్సిటీ విశిష్ట ప్రొఫెసర్లుగా మాజీ గవర్నర్, దౌత్యవేత్త గోపాలకృష్ణ గాంధీ, ప్రముఖ పాత్రికేయుడు, మెగసెసే అవార్డు గ్రహీత సాయినాథ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నల్సార్ వైస్ చాన్సలర్, ప్రొఫెసర్ కృష్ణదేవరావు మాట్లాడుతూ.. విశిష్ట ప్రొఫెసర్ అనే పదవికి ప్రజాక్షేత్రంలో అత్యంత గొప్పసేవ చేస్తున్న మేధావులను గుర్తించి, నల్సార్ విశ్వవిద్యాలయంలో విద్యాపరంగా వారి సేవలను వినియోగించుకోనున్నట్లు తెలిపారు. న్యాయ విద్య పరిధిని విస్తృతం చేసి, లా విద్యార్థులకు, న్యాయ భావన జస్టిస్‌కు అనేక ప్రధాన ప్రశ్నలను పరిచయం చేయాలని భావిస్తున్నామన్నారు. ఆ దిశగా మేధావులను విశిష్ట ప్రొఫెసర్లుగా నియమించి ఒక ముందడుగు వేసినట్లు వివరించారు. ప్రజాక్షేత్రంలో మేధావుల బోధనల ద్వారా చట్టమనేది కేవలం సాంకేతిక విషయంపై అధ్యయనం మాత్రమే కాదని, విద్యార్థులకు సామాజిక, ఆర్థిక న్యాయానికి లోతైన ప్రశ్నలను, అంశాలను అందించడం అవసరమని ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు, చట్టానికి, సామాజిక ఆర్థిక న్యాయానికి మధ్య ఉండే సంబంధాన్ని ఈ మేధావులు వివరిస్తారని ఆయన తెలిపారు.


ప్రొఫెసర్లు సాయినాథ్, గోపాలకృష్ణగాంధీ

చారిత్రక కట్టడం కబ్జా

నార్సింగ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ ఫొటోలో కనిపిస్తున్న కట్టడం నాడు గోల్కొండను పరిపాలించిన కులీకుతుబ్‌షాహీ కాలం నాటిది. షేక్‌పేట, మణికొండ మధ్యలో ఈ కట్టడం ఉంది. నాడు సైనికులు పహారా కాసేందుకు ఈ కట్టడాన్ని నిర్మించారు. అప్పటి భాషలో దీన్ని చత్రి అంటారు. దాని చుట్టూ నిర్మాణాలు చేపట్టిన సదరు వ్యక్తులు చివరకు దీనికి నాలుగుపక్కల గోడలు నిర్మించి తలుపు పెట్టి మరీ తాళం వేసుకున్నారు. చారిత్రక కట్టడం రూపురేఖలు మార్చినా చట్టం ఒప్పుకోదు. కానీ ఇక్కడ పట్టించుకునే వారేరి?


చారిత్రక కట్టడానికి ఇటుకలతో నిర్మించిన గోడ, ఏర్పాటు చేసిన తలుపు

ఘనంగా రాహుల్‌గాంధీ పుట్టిన రోజు వేడుకలు

అఫ్జల్‌గంజ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను బుధవారం గాంధీ భవన్‌లో తెలంగాణ ఫిషరీష్ చైర్మన్ మెట్టు సాయికుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.


గాంధీభవన్‌లో విద్యార్థులకు నోటుబుక్‌లు పంపిణీ చేస్తున్న మంత్రులు భట్టి విక్రమార్క, కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి


మైలార్‌దేవుపల్లి ఉడంగడ్డలో కేక్ కట్ చేస్తున్న మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మి

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మైలార్‌దేవుపల్లి డివిజన్ ఉడంగడ్డలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎ.సదాలక్ష్మి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు.

బీసీ కులగణన చేసి రిజర్వేషన్లు పెంచాలి

ఖైరతాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో బీసీ కులగణన చేసి రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన పెంచాలని, లేనట్లయితే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని బీసీ సంఘాలు హెచ్చరించాయి. ఎన్నికల కోడ్ ముగియగానే కులగణన చేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఆమేరకు పనులు ప్రారంభించక పోవడంతో ప్రజలను చైతన్యపరచి ఉద్యమబాట పట్టనున్నట్లు నాయకులు తెలిపారు. బుధవారం లక్డీకపూల్ హోటల్ అశోకాలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీసీ మేధావులతో మేధోమదన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీని దృష్టిలో పెట్టుకుని దేశ వ్యాప్తంగా బీసీలు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన విషయాన్ని గుర్తించాలన్నారు. ఆయన ఇచ్చిన మాటకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం బాధాకరమన్నారు.


మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య

జూలై 1 నుంచి మేధావులతో బస్సు యాత్ర

జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. బీసీ మేధావులను చర్చలకు పిలిచి రిజర్వేషన్ల పెంపునకు మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు. లేకపోతే అన్ని జిల్లాల్లో జేఏసీలను ఏర్పాటు చేసి జూలై 1 నుంచి బీసీ మేధావులతో బస్సు యాత్ర చేపడతామన్నారు. అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు, బాసర నుంచి భాగ్యనగర్ వరకు బహిరంగ సభలు నిర్వహించి బీసీలను చైతన్యం చేస్తామన్నారు. హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ అనంతరం ప్రభుత్వం స్పందించకపోతే తెలంగాణ బంద్ నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఐఏఎస్ చిరంజీవులు బీసీలకు జరుగుతున్న అన్యాయంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ.. బీసీ కులగణన చేపట్టేందుకు కేవలం 15 రోజులు సరిపోతుందన్నారు. సదస్సులో ప్రొఫెసర్లు సింహాద్రి, తిరుమల, బీసీ సంఘాల నేతలు వీజీఆర్ నారగోని, గణేష్‌చారి, సురేష్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్‌గౌడ్, బీసీ మేధావులు సుంకర సత్యనారాయణ, ప్రొఫెసర్ వినయ్‌బాబు, ప్రొఫెసర్ వెంకట్రామయ్య, సమ్మయ్య, వేణుమాధవ్, కుల్కచర్ల శ్రీనివాస్, తాటికొండ విక్రం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు పరుగు

● పట్టించుకోని అధికారులు

పహాడీషరీఫ్ జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపేట్ ప్రధాన రహదారిలో మురుగు నీరు పారుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రాత్రి సమయం అంధకారం ఉండడంతో ప్రజలు, వాహనదారులు మురుగునీటిలో జారిపడి ప్రమాదాల బారిన సంఘటనలు ఉన్నాయి. సమస్య పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.


కొత్తపేట రోడ్డులో పారుతున్న మురుగు నీరు

ఏసీ రిపేర్ కోసం ఫోన్ చేస్తే..

రూ. 2.11 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఏసీ రిపేర్ కోసమని కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసిన వృద్ధుడిని ట్రాప్ చేసిన సైబర్ నేరగాడు అతడి బ్యాంకు ఖాతా నుంచి రూ. 2.11 లక్షలు కాజేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన ఓ వృద్ధుడు ఏసీ మరమ్మతులు చేయడానికి సామ్‌సంగ్ కస్టమర్ కేర్ నంబర్ కోసం గూగుల్‌లో వెతికాడు. అతడికి ఓ నంబర్ కనిపించగా దానికి ఫోన్ చేసి సమస్య చెప్పాడు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తి 'ముందుగా మీరు ఆన్‌లైన్‌లో రూ. 5 పంపండి అప్పుడే మీ కంప్లైంట్ మా వద్ద రిజిస్టర్ అవుతుంది. ఆ తర్వాత టెక్నీషియన్ వచ్చి ఏసీ మరమ్మతులు చేస్తారు' అని నమ్మించాడు.

అతడి మాటలు నమ్మిన బాధితుడు యూపీఐ ఐడీని ఓపెన్ చేసి అతడు చెప్పిన విధంగా చేశాడు. ఆ తర్వాత మెసేజ్‌లు చూసుకుంటే బ్యాంకు ఖాతాలో డబ్బులు డెబిట్ అయినట్లు తెలిసింది. వృద్ధుడు ఫోన్ చేసి నిలదీయగా.. డబ్బులు మీ ఖాతాలో జమ చేస్తాను. వేరే నంబర్ నుంచి ఫోన్ చేయమని చెప్పాడు. ఒక లింక్ వస్తుంది దాన్ని క్లిక్ చేయండి అని చెప్పడంతో బాధితుడు వాళ్ల అమ్మగారి ఫోన్ నంబర్ చెప్పాడు. ఆ నంబర్‌కు లింక్ వచ్చింది. కస్టమర్ కేర్ సర్వీస్ నుంచి వచ్చినట్లు ఉందని భావించిన బాధితుడు లింక్‌ను క్లిక్ చేసి అవతలి వ్యక్తి చెప్పినట్లుగా యూపీఐ ఐడీ తదితర వివరాలు నమోదు చేశాడు. తర్వాత బాధితుడి అమ్మ ఖాతా నుంచి కూడా డబ్బులు డెబిట్ అయ్యాయి.

ఇలా మొత్తం రూ. 2.11 లక్షలు డెబిట్ అయ్యాయి. అవతలి వ్యక్తి కాల్ కట్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏఐతో డబ్బు, సమయం ఆదా

● జేఎన్‌టీయూ రెక్టార్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి

హైదరాబాద్‌సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో డబ్బు, సమయం ఆదా అవుతుందని జేఎన్టీయూ రెక్టార్ ప్రొఫెసర్ విజయకుమార్‌రెడ్డి అన్నారు. 'ఇంజనీరింగ్ విద్యలో ఆధునిక పోకడలు' అనే అంశంపై మ్యాథ్‌వర్క్ సంస్థ బుధవారం జేఎన్‌టీయూలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం విద్యార్థుల ఆలోచన విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అధ్యాపకులు వినూత్న బోధనాపద్ధతులను అలవర్చుకోవాలన్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను టెక్నాలజీ సాయంతో మరింత సులభంగా అందించే ప్రయత్నం చేయాలన్నారు. ఉపాధ్యాయులు నిత్యం పరిశోధన, పరిశీలనకు సంబంధించిన పుస్తకాలు చదవడంతో పాటు కొత్త ఆవిష్కరణలకు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విభాగంతో పాటు నేడు అభివృద్ధి చెందుతున్న ప్రతి రంగాల్లోనూ లక్ష్యాలను సాధించేందుకు సులభమైన మార్గాలు అనేకం ఉన్నాయన్నారు. ఈ తరహా వర్క్‌షాప్‌ల వలన అధ్యాపక వృత్తిలో మరింత మెరుగ్గా రాణించేందుకు వీలవుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో కొత్త ఆవిష్కరణలు వస్తున్నందున ఎదురయ్యే సమస్యల పరిష్కారాల కోసం పరిశోధన అవసరమన్నారు. వర్క్‌షాప్‌లో కొత్త అంశాలు చర్చకు రావడం ఉపాధ్యాయులకు ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఎం.మాధవీలత, ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎ.రజని, మ్యాథ్‌వర్క్స్ ప్రతినిధులు జహీదావసీమ్, డాక్టర్ లక్ష్మీ నారాయణ్ పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు

జేఎన్‌టీయూలో బీ ఫార్మసీ కోర్సు

● ఈ ఏడాది నుంచే ప్రవేశాలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీలో ఈ విద్యా సంవత్సరం (2024-25) కొత్తగా బీ ఫార్మసీ కోర్సును ప్రారంభించేందుకు అనుమతిస్తూ రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలోని సెంటర్ ఫర్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో ప్రస్తుతం ఎం-ఫార్మసీ కోర్సులు నడుస్తుండగా, ఈ ఏడాది నుంచి 60 సీట్లతో బీ ఫార్మసీ కోర్సు ప్రవేశపెట్టాలని సదరు విభాగాధిపతి ప్రతిపాదించారని, ఆ ప్రతిపాదనలకు ఇన్‌చార్జి వైస్‌చాన్సలర్ ఆమోదం తెలిపినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కొత్తగా అనుమతించిన బీ-ఫార్మసీ కోర్సు 60 సీట్లలో 30 సీట్లు రెగ్యులర్ కేటగిరీ, మరో 30 సీట్లు సెల్ఫ్‌ఫైనాన్స్ కేటగిరి కింద విభజించారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్.. తప్పిన ప్రమాదం

మంగళ్‌హాట్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఆబిడ్స్ మహబూబియా జూనియర్ కాలేజ్ సమీపంలో బుధవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు వచ్చి పేలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఘటనపై విచారణ చేస్తున్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/qmWf1yk లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోనే గోల్కొండ బోనాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నార్సింగ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): చారిత్రక గోల్కొండ కోటపై జరిగే బోనాల ఉత్సవాలకు జగదాంబిక ట్రస్టు బోర్డు ఏర్పాటు విషయమై 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సమయం తక్కువ ఉన్నందున పూర్తిస్థాయి ట్రస్టు బోర్డు ఏర్పాటు చేయడం లేదని, ఉత్సవ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తామని, రెండు రోజుల్లో వారి పేర్లు ప్రకటిస్తామని జగదాంబిక ట్రస్టు బోర్డు ఈవో శ్రీనివాసరాజు తెలిపారు. ఆయన బుధవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. ఇప్పటికే ఉత్సవ కమిటీ పనిచేస్తుందని, బోనాల ఉత్సవాలు పూర్తయిన తర్వాత పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వచ్చేనెల 7వ తేదీన ప్రారంభం కానున్న గోల్కొండ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బుధవారం ఆలయ హుండీ లెక్కించారు. రూ. 59 వేల ఆదాయం వచ్చిందని తెలిపారు.

నీట్ పరీక్షలో అవకతవకలపై

సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలి

పహాడీషరీఫ్ జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్‌ఎస్ జల్‌పల్లి మునిసిపాలిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్ డిమాండ్ చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నీట్ వ్యవహారంపై ప్రధాని మోదీ మౌనం వీడాలన్నారు. నీట్ పరీక్షల్లో అవకతవకలతో లక్షలాదిమంది విద్యార్థులు నష్టపోయారన్నారు.

23న చెస్ పోటీలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్‌ను ఈనెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్టు తెలంగాణ చెస్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్ ప్రసాద్ వెల్లడించారు. ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్‌లో అండర్-7, 9, 11, 13, 15 విభాగాల్లో బాలబాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఐదేసి రౌండ్ల పాటు పోటీలు జరుగుతాయని, ఆసక్తి గల వారు www.chesstelangana.com వెబ్‌సైట్‌లో లేదా 7337578899, 7337399299 ఫోన్ నంబర్లకు వాట్సాప్‌లో తమ వివరాలు పంపించి పేర్లు నమోదు చేసుకోవచ్చు.



ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మణికొండ మున్సిపల్ చైర్మన్, ఎంఈవో రామరెడ్డి తదితరులు

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మున్సిపల్ చైర్మన్

నార్సింగ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం, వట్టినాగులపల్లి ప్రభుత్వ పాఠశాలను నార్సింగ్ మున్సిపల్ చైర్మన్ నాగపూర్ణ శ్రీనివాస్ మండల విద్యాధికారి రామిరెడ్డి, మండల ఎంఎన్‌ఓ విజయకుమార్ సందర్శించారు. పాఠశాలలో సమస్యలు, మౌలిక సదుపాయాలను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్లు సునీల్‌కుమార్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో ప్రజాపాలన కౌంటర్ ప్రారంభం

నార్సింగ్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మణికొండలో ప్రజాపాలన కౌంటర్ ప్రారంభించారు. దరఖాస్తుల్లో మార్పులు తదితర అంశాలపై మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్‌లో అడిగి తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు.

లా పూర్తి చేసిన బీసీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లా పూర్తి చేసిన బీసీ విద్యార్థులు మూడేళ్లపాటు ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా బీసీ అభివృద్ధి అధికారి జి.ఆశన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ జిల్లాకు చెందిన అర్హులైన బీసీ అభ్యర్థులు జూలై 4 వరకు లక్డీకపూల్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, స్ఫూర్తి భవన్ 4వ అంతస్తులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వివరాలతోపాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జీరాక్స్ ప్రతులు జతచేయాలని సూచించారు. అభ్యర్థులు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌చే గుర్తింపబడిన విద్యాసంస్థ నుంచి లా కోర్సులో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ. 2 లక్షలకు మించరాదని, బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు.

సమ్మోహనంగా వన్సిక సుదర్శన్ భరతనాట్యం

రవీంద్రభారతి, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): వైవిధ్యభరితమైన నాట్యంతో లయబద్ధమైన అడుగులతో నర్తకి వన్సిక సుదర్శన్ ఆహూతులను సమ్మోహనపరిచింది. బుధవారం రవీంద్రభారతిలో శ్రీరామనాటక నికేతన్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్య గురువు మంజులా రామస్వామి మనువరాలైన వన్సిక సుదర్శన్ భరతనాట్యంలో అరంగేట్రం చేసింది. గణేష స్తుతి, పాద వర్ణం, శంకర శ్రీగిరి, విషమకర, తిల్లాన తదితర అంశాల్లో నర్తించి భళా అనిపించింది. నట్టువాంగంపై గురువు మంజుల రామస్వామి, గణేష్ గానం చేయగా, మృదంగంపై రాజగోపాలచారి, వయొలిన్‌పై సాయికుమార్, ఫ్లూట్‌పై దత్తాత్రేయ వాయిద్య సహకారం అందజేశారు. పదవ తరగతి చదువుతున్న వన్సిక ఇప్పటి వరకూ వందకు పైగా ప్రదర్శనలతో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. జీ20 సమ్మిట్‌లో హెరిటేజ్ షోకేస్ వంటి కార్యక్రమాల్లో పాల్గొని మన్ననలు అందుకుంది. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఐఏఎస్ విశ్రాంత అధికారి డా. కేవీ రమణాచారి, తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ అలేఖ్య పుంజాల, సినీ డైరెక్టర్ నాగ్‌అశ్విన్, రేణు చక్రవర్తి, కెప్టెన్ షోమా సూర్ తదితరులు పాల్గొన్నారు. మంజులా రామస్వామికి గురు సత్కారం చేశారు.


నాట్యం చేస్తున్న వన్సిక

కాఫీ కథను తెలియజేసిన 'క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్'

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తోట నుంచి కప్పులోకి చేరే వరకు కాఫీకి ఉన్న ప్రయాణ కథను తెలియజేసేలా మాదాపూర్‌లోని ద కోరమ్‌లో బుధవారం క్రాఫ్టింగ్ కాఫీ కల్చర్ పేరిట ఓ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాఫీ ప్రియులు, సాగుదారులు, కేఫ్ యజమానులు, స్పెషాలిటీ కాఫీ కమ్యూనిటీకి చెందిన నిపుణులందరినీ ఒకేచోటకు చేర్చి స్పెషాలిటీ కాఫీలను చర్చించింది. రత్నగిరి ఎస్టేట్ నుంచి తీసుకువచ్చిన స్పెషాలిటీ కాఫీలను ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన చర్చా కార్యక్రమంలో రత్నగిరి ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్టనర్ అశోక్ పాత్రే మాట్లాడుతూ.. హై-గ్రేడ్ స్పెషాలిటీ ఇండియన్ కాఫీని పండించడంలోని సవాళ్లు, కాఫీ ప్రాముఖ్యతను వివరించారు. ఫస్ట్ క్రాక్ స్పెషాలిటీ రోస్టర్స్ వ్యవస్థాపకురాలు చాందిని ఎస్‌ఆర్‌కే మాట్లాడుతూ.. కాఫీ రైతులు, వినియోగదారుల మధ్య అంతరాన్ని తగ్గించడమే తమ లక్ష్యమన్నారు.


కాఫీ సువాసనలను ఆస్వాదిస్తున్న చాందిని

భూవివాదంలో జూనియర్ ఎన్టీఆర్‌కు స్వల్ప ఊరట

● మళ్లీ ఎన్టీఆర్ వాదనలు విని తీర్పు ఇవ్వాలని డీఆర్టీకి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూబ్లీహిల్స్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో దాదాపు రూ.24 కోట్ల విలువైన 681 చదరపు గజాల భూవివాదంలో నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు హైకోర్టులో స్వల్ప ఊరట లభించింది. ఆయనకు వ్యతిరేకంగా డెట్ రికవరీ ట్రైబ్యునల్ (డీఆర్టీ) జారీ చేసిన తీర్పును హైకోర్టు కొట్టేసింది. డీఆర్టీ.. ఎన్టీఆర్ వాదనలను మెరిట్ ఆధారంగా వినలేదని, ఇంప్లీడ్ పిటిషన్ దశలోనే ఆయన పిటిషన్‌ను కొట్టేసిందని.. ఇది సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పేర్కొంది. జూనియర్ ఎన్టీఆర్ సహా అన్ని పక్షాల వాదనలు తాజాగా మళ్లీ విని వీలైనంత వేగంగా తీర్పు ఇవ్వాలని డీఆర్టీకి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

రామోజీరావు యాదిలో స్మృతిగీతం ఆవిష్కరణ

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): పత్రికా రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన గొప్ప కలం యోధుడు రామోజీరావు అని సీపీఐ నేతలు కొనియాడారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో బుధవారం 'రామోజీరావు యాదిలో' పేరుతో స్మృతిగీతం సీడీని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు తన తొలినాళ్లలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండటం గర్వకారణం అన్నారు. చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ అనేక సవాళ్లను ఎదుర్కొని తాను అనుకున్న గమ్యానికి చేరిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి అధ్యక్షుడు పల్లె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మూడు కొత్త నేర చట్టాలను వెనక్కి తీసుకోవాలి

● ప్రతిపక్షాలు బలంగా ఉన్నాయి.. కేంద్రంపై ఒత్తిడి తేవాలి
● చట్టాలపై విస్తృత చర్చ జరగాలి
● రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న 'ఆంధ్రజ్యోతి' సంపాదకులు కె. శ్రీనివాస్, చిత్రంలో వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ తదితరులు

పంజాగుట్ట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మూడు కొత్త నేర చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మహిళా, ట్రాన్స్ జెండర్ సంఘాల ఐక్య వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్చకు అవకాశం ఇవ్వకుండా, ప్రతిపక్షాలు సభలో లేకుండా చేసి ఆ చట్టాలను ఆమోదింప చేసుకున్నదని వారు ఆరోపించారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పౌర హక్కులను అణిచివేసే కొత్త నేరచట్టాలు - ఎవరి ప్రయోజనాల కోసం' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. మహిళా, ట్రాన్స్ జెండర్ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పీవోడబ్ల్యూ సంధ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, ప్రజా గాయని విమలక్క, ట్రాన్స్ మహిళా హక్కుల ఉద్యమకారిణి రచన ముద్రబోయిన, సజయ, ఖలీదా పర్వీన్, గ్రామ్యా రుక్మిణీరావు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని మాట్లాడారు.

కేంద్రంపై ఒత్తిడి తేవాలి

ప్రస్తుతం పార్లమెంటులో ప్రతిపక్షాల బలం గట్టిగా ఉన్నందున ప్రజాచైతన్యాన్ని కలిగించి, కేంద్రంపై ఒత్తిడి వచ్చే అవకాశం ఉంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ చట్టాలను జూలై ఒకటి నుంచి అమలు చేయాలని కేంద్రం చూస్తున్నదని వారు అన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలలో అనేక రకాల స్థానిక చట్టాలు ఉన్నాయని, ఏ చట్టం కింద జూలై ఒకటి తర్వాత కేసులను విచారిస్తారని అన్నారు. ఒకే దేశంలో రెండు న్యాయచట్టాలు ఉండడం అనేది గందరగోళానికి దారి తీస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ చట్టాలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్కువ సమయం ఉన్నా వీటిపై విస్తృతంగా ప్రచారం, చర్చ చేద్దామని వక్తలు పిలుపునిచ్చారు. సమావేశంలో కవిఎటీ ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు సత్యవతి, కృష్ణకుమారి, వసుంధర, అంకురం సుమిత్ర, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి..

భారతీయ శిక్షాస్మృతి(ఐపీసీ-1860)స్థానంలో కొత్తగా వస్తున్న భారతీయ న్యాయ సంహిత చట్టం(బీఎన్ఎస్), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీపీసీ-1973)స్థానంలో భారతీయ సురక్ష సంహిత చట్టం(బీఎస్ఎస్), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్(ఐఈఏ-1872)స్థానంలో వస్తున్న భారతీయ సాక్ష్య అధినియం(బీఎస్ఏ)చట్టాల గురించి చాలామందికి తెలియదని, వాటి మీద సరైన అవగాహన లేదని 'ఆంధ్రజ్యోతి' సంపాదకులు కె.శ్రీనివాస్ అన్నారు. పార్లమెంటులో వాటిని ఆమోదించిన సమయంలో సభలో ప్రతిపక్షాలను లేకుండా చేశారని విమర్శించారు. కేంద్రం తెస్తున్న ఆ మూడు చట్టాల్లో ఏమి ఉందో కూడా కనీసం ప్రాంతీయ భాషా పత్రికలలో వివరాలు రాలేదని విచారం వ్యక్తం చేశారు. ఆ చట్టాలపై విస్తృత చర్చ జరగాలని అన్నారు. కేంద్రం అన్యాయంగా కొత్త నేర చట్టాలను తీసుకొస్తున్నదని వీక్షణం ఎడిటర్ ఎన్.వేణుగోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలోని అన్ని న్యాయస్థానాల్లో కోట్లలో కేసులు పెండింగులో ఉన్నాయని, కొత్త చట్టం వచ్చినా, పాత చట్టం మరో 30 సంవత్సరాల వరకు ఉంటుందని, దీంతో అన్ని వర్గాలతో పాటు న్యాయస్థానాలపై కూడా పెనుభారం పడుతుందని అన్నారు.

మూడు నెలల చిన్నారికి నోబుల్ వరల్డ్ రికార్డు


చిన్నారికి నోబుల్ రికార్డ్ అవార్డును అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

వనస్థలిపురం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మూడు నెలల చిన్నారి నోబుల్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకుంది. ఎల్బీనగర్‌కు చెందిన తిరు కొల్లూరి శ్రీకాంత్ ప్రవల్లిక దంపతులకు గత మూడు క్రితం కైరా జన్మించింది. ఈ చిన్నారి మూడు నెలల వయస్సు రాగానే పండ్లు, కూరగాయలు, జంతువులు, పక్షులు మొదలైన 80 ప్లాష్ కార్డులను గుర్తించింది. ఇంతటి ప్రతిభ కనబర్చిన చిన్నారి కైరాను నోబుల్ వరల్డ్ రికార్డ్ అవార్డు వరించింది. చిన్నారి కైరా వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి చిన్నారి గొప్పదనాన్ని వివరించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ చిన్నారి భవిష్యత్‌లో మరిన్ని వరల్డ్ రికార్డులను సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, చిన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డెల్టా-5 మోటార్ సైకిల్ యాత్ర ప్రారంభం


బృందం సభ్యునికి జ్ఞాపికను అందజేస్తున్న మేజర్ జనరల్ రాకేష్‌మనోచా

అల్వాల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): 'రజత్ జయంతి ఆఫ్ కార్గిల్ విజయ్‌దివస్'ను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న డెల్టా 5 మోటార్ సైకిల్ యాత్ర బుధవారం నగరం నుంచి నాగ్‌పూర్ వైపునకు బయలుదేరింది. హుస్సేన్‌సాగర్ లేక్ వద్ద తెలంగాణ, ఆంధ్రాసబ్‌ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్, మేజర్ జనరల్ రాకేష్‌మనోచా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ చారిత్రాత్మకమైన విజయం సాధించి 25ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా భారత ఆర్మీకి చెందిన రెజిమెంట్ ఆఫ్ ఆర్టిలరీ బృందం ఈ యాత్రను చేపట్టింది. ఎనిమిది మంది సభ్యుల బృందంతో ఈనెల 12న ధనుష్కోటి వద్ద ప్రారంభమైన ఈ యాత్ర సోమవారం నగరానికి చేరుకుంది. రెండు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాలను చుట్టిన ఈ బృందం బుధవారం ఇక్కడినుంచి బయలుదేరింది.

రైల్వే స్టేషన్‌లో 60 కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో 60 కిలోల గంజాయి సరుకును జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. బుధవారం సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావెద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నెంబర్‌2లో ఆగి ఉన్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో బుధవారం సికింద్రాబాద్ జీఆర్‌పీ సీఐ సాయిఈశ్వర్‌గౌడ్, ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్‌లతో పాటు ఆర్పీఎఫ్ ఎస్సై సుబ్బారావు కలిసి తనిఖీ చేశారు. ఒడిశాకు చెందిన దిలీప్‌కుమార్ (34) వద్ద ట్రాలీ బ్యాగు కనిపించడంతో పోలీసులు తనిఖీ చేశారు అందులో 60కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించి అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ వ్యవహారంలో ఢిల్లీకి చెందిన తపాన్, బిజయ్ వ్యక్తులకు గంజాయి సరుకు ఇవ్వడానికి ఢిల్లీ వెళుతున్నట్లు తెలిపాడు. ప్రస్తుతం తపాన్, బిజయ్‌లు పరారీలో ఉన్నారని రైల్వే పోలీసులు తెలిపారు. రూ.15లక్షల విలువ చేసే 60 కిలోల గంజాయి సరుకును స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.


రివార్డులు అందుకున్న సిబ్బందితో సీపీ శ్రీనివాస్‌రెడ్డి

ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన సిబ్బందికి రివార్డులు

హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో కష్టపడి పనిచేసి, శక్తివంచన లేకుండా విధులు నిర్వహించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని గుర్తించి హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి రివార్డులు అందజేశారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిటీ కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిబ్బందిని అభినందించి రివార్డులతో సత్కరించారు. ఎలక్షన్‌సెల్, పోస్టల్ బ్యాలెట్ వింగ్, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వుడ్, ఐటీసెల్, ఐసీసీసీ సిబ్బంది, లా అండ్ ఆర్డర్ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది ఉన్నట్లు సీపీ తెలిపారు.


జెండా ఊపి అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న అల్లు అరవింద్

అంబులెన్సులకు దారి ఇవ్వండి

రాయదుర్గం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అత్యవసర చికిత్స కోసం వెళ్లే అంబులెన్సులకు ప్రతి ఒక్కరూ దారి వదలాలని, తద్వారా ఒక ప్రాణాన్ని కాపాడిన వారవుతారని ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. నాక్‌రామ్‌గూడలోని స్టార్ ఆస్పత్రి యాజమాన్యం నూతనంగా అందుబాటులోకి తీసుకు వచ్చిన స్టార్ ట్రామా, యాక్సిడెంట్స్ రెస్పాన్స్ నెట్‌వర్క్ సిస్టమ్‌ను ఆయన స్టార్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గోపీచంద్ మన్నంతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి, గుండెపోటు వచ్చిన వారికి గోల్డెన్ టైమ్ అనేది ఉంటుందని, ఆ సమయంలో వారికి సరైన చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడ వచ్చన్నారు. డాక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ హార్ట్ అటాక్, బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిన వారికి గోల్డెన్‌టైమ్‌లో చికిత్స అందిస్తే వారి ప్రాణాలను కాపాడ వచ్చన్నారు. అత్యవసర సమయంలో 90711 04108 నంబర్‌కు కాల్ చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడిసిన్ గ్రూప్ లీడ్ డాక్టర్ రాహుల్ కట్టా, పలువురు వైద్యులు, ట్రాఫిక్ పోలీసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లోపాలు ఎత్తిచూపితే కేసులా?

జర్నలిస్ట్ రేవతిపై కేసు ఉపసంహరించుకోవాలి: టీజేఎఫ్

హైదరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపిన జర్నలిస్ట్ రేవతిపై పోలీసు కేసు పెట్టడం తగదని తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం(టీజేఎఫ్) పేర్కొంది. సమస్యను పరిష్కారించాల్సిన టీజీఎస్‌పీడీసీఎల్ ఆమెను టార్గెట్ చేయడం ఏమిటని ప్రశ్నించింది. రేవతిపై పెట్టిన కేసును ఉపసహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, డీజీపీని టీజేఎఫ్ అధ్యక్షుడు పల్లె రవికుమార్‌గౌడ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ మహేశ్వరం మహేంద్రలు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించే దిశగా అడుగులు వేయాల్సిందిపోయి కేసు పెట్టడాన్ని ఖండిస్తున్నామని వారు తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే స్పందించి డీజీపీకి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రజాసమస్యలపై జర్నలిస్టు వృత్తిలో ఉన్న ప్రతి ఒక్కరూ స్పందిస్తారని, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా ప్రయత్నిస్తారని పేర్కొన్నారు. ఆ కోవలోనే జర్నలిస్ట్ రేవతి ఓ విద్యుత్ వినియోగదారు చెప్పిన సమస్యను ప్రస్తావిస్తూ దాని తీవ్రతను చెప్పేందుకే ఎక్స్ వేదికగా ప్రశ్నించారని, రేవతికి టీజేఎఫ్ అండగా నిలుస్తుందని వారు వెల్లడించారు.

ప్రీ-లాంచింగ్ పేరుతో ఘరానా మోసం

● జీఎస్ఆర్ గ్రూప్‌పై బాధితుల ఫిర్యాదు
● విల్లాలు, ప్లాట్ల వెంచర్ల పేరుతో నిండా ముంచేసిన శ్రీనివాస్ రావు


సీసీఎస్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

హిమాయత్‌నగర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విల్లాల పేరుతో ఘరానా మోసానికి పాల్పడిన జీఎస్ఆర్ గ్రూప్ రియల్ ఎస్టేట్ సంస్థపై బాధితులు ఫిర్యాదు చేశారు. జీఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ జి.శ్రీనివాస్‌రావుపై పది రోజుల క్రితమే ముప్పై ముందికి పైగా బాధితులు ఫిర్యాదుచేసినప్పటికీ నిందితుడిపై చర్యలు తీసుకోకపోవడంతో బుధవారం మరోసారి సీసీఎస్ డీసీపీ శ్వేతను కలిసి మరిన్ని ఆధారాలు.. చెక్కులు, డబ్బు చెల్లించిన రశీదులు, అగ్రిమెంట్ పత్రాలు సమర్పించారు.

నగర శివార్లలో రంగారెడ్డి, యాదాద్రి జిల్లాల పరిధిలోని మోకిల, కొల్లూరు, అబ్దుల్లాపూర్‌మెట్, యాదాద్రి తదితర ప్రాంతాలలో విల్లాలు, ప్లాట్లకు సంబంధించి భారీ వెంచర్లు వేస్తున్నామని, ప్రీ-లాంచింగ్‌లో సగం ధరకే విల్లాలు, ప్లాట్లు ఇస్తామంటూ జీఎస్ఆర్ గ్రూప్ ఆఫర్ పెట్టింది. పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టేవారికి లాభాల్లో షేర్ ఇస్తామంటూ నమ్మబలికింది. దీంతో పెద్ద సంఖ్యలో కస్టమర్లు రూ.కోటి నుంచి మూడు కోట్ల వరకు చెల్లించారు. అయితే ఇదంతా జరిగి రెండేళ్లు కావస్తున్నా వెంచర్ల జాడ లేకపోవడం, వెంచర్ల కోసం కొనుగోలు చేసిన స్థలాలు కూడా సంస్థవి కాకపోవడంతో తమ డబ్బులు వాపసు చెల్లించాలంటూ జీఎస్ఆర్ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రావును కస్టమర్లు నిలదీశారు. మోసాలు బయటపడటంతో శ్రీనివాస్‌రావు ఎదురుదాడికి దిగి వారిని బెదిరించే ప్రయత్నం చేశాడు. దీంతో 32మందికి పైగా బాధితులు హైదరాబాద్ సీసీఎస్‌లో ఫిర్యాదు చేశారు. జీఎస్ఆర్ గ్రూప్‌పై మొత్తం రెండు కేసులను పోలీసులు నమోదు చేశారు. ముందస్తు బెయిల్ తెచ్చుకున్న శ్రీనివాస్‌రావు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. జీఎస్ఆర్ గ్రూప్‌నకు చెందిన ముఖ్యులకు నోటీసులు ఇవ్వాలని డీసీపీ ఆదేశించినప్పటికీ ఏసీపీ తాత్సారం చేస్తున్నట్లు తెలుస్తోంది..

...అందుకే ధ్యానం చేయాలి!

మెడిటేషన్ వల్ల మెదడు ఆరోగ్యమే కాదు.. శారీరకంగా ఎంతో మంచిది. మెడిటేషన్ చేయటం వల్ల మరి కొన్ని ఫలితాలున్నాయి. అవే ఇవి...

- జీవితంలో ఎక్కువగా మెంటల్ పొల్యూషన్ ఉండటం వల్ల కచ్చితమైన నిర్ణయాలు తీసుకోలేరు. కన్‌ఫ్యూజ్‌కు గురవుతుంటారు. ఇలాంటి సమయంలోనే ఆలోచనల్లో క్లారిటీ అవసరం. అందుకే మెడిటేషన్ చేయటం అలవరుచుకోవాలి. అప్పుడే మెంటల్ ఫాగ్ పోతుంది. దీనివల్ల చక్కటి ఆలోచనలు కలుగుతాయి. ముఖ్యంగా ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. తన మీద తనకు.. నమ్మకం కుదురుతుంది. ఎలాంటి ప్రతికూల పరిస్థితుల్లో అయినా.. ఆగకుండా ముందుకు నడిచి.. అద్భుతమైన విజయాలు సాధిస్తారు.
- మనిషి అంటేనే భావోద్వేగాలకు బానిస. ఆనందం, జాలి, బాధ.. లాంటి ఎమోషన్స్ వెంట వెంటనే.. బయటకు కనపడేట్లు ప్రకటిస్తే.. ఒక్కోసారి తోటి వాళ్ల ముందు చులకన అవుతారు. అవి వారి వ్యక్తిత్వం మీద ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే రోజుకు కనీసం పది నిముషాల పాటు మెడిటేషన్ చేస్తే.. భావోద్వేగాల ప్రవాహాన్ని బ్యాలెన్స్ చేయవచ్చు. ఎమోషనల్ బ్యాలెన్స్ ఉన్నప్పుడే ఏదైనా సాధించగలరు.
- కొందరు కొన్ని పనులు చేసేప్పుడు ఎక్కువగా ఆలోచిస్తారు. ముఖ్యంగా చేసే పనిలో విజయం దక్కుతుందో లేదో అనే ఆందోళనకు, భయానికి లోనవుతుంటారు. యాంగ్జయిటీకి గురయ్యేవారు కచ్చితంగా మెడిటేషన్ చేస్తేనే.. చక్కటి ఫలితం ఉంటుంది.
- మెడిటేషన్ చేయటం వల్ల సమస్యలను పరిష్కరించే నేచర్ అలవడుతుంది. ముఖ్యంగా ఏదైనా సమస్య వస్తే రెండే దారులుంటాయి. ఏ దారిలో వెళితే సులువుగా పరిష్కారం వైపు వెళ్తామనేదే ప్రశ్న. ధ్యానం చేసేవారిలో ఎలాంటి ఇతర ఆలోచనలు లేకపోవడం వల్ల.. అద్భుతాలు క్రియేట్ చేస్తారు.
- ధ్యానం చేసేవారిలో ఏకాగ్రత అద్భుతంగా ఉంటుంది. ఏ పని చేసినా మంచి విజయాన్ని సాధిస్తారు. లక్ష్యాల మీద దృష్టి ఉంచి అటువైపునే పయనించి విజయాలను అందుకుంటారు.




గొంతు నొప్పికి ఉపశమనం...

ఆహారం వల్ల కావొచ్చు.. వాతావరణం మారినపుడు కావొచ్చు.. కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. వాటిలో గొంతు నొప్పి ఒకటి. మంటతో పాటు తిన్న ఆహారం మింగలేకపోవటం లాంటి సమస్యలుంటాయి. ఈ గొంతు నొప్పినుంచి ఉపశమనం పొందాలంటే ఈ చిట్కాలు పాటించాలి.


- గొంతు నొప్పి ఉన్నప్పుడు చల్లని నీరు తాగకూడదు. గోరు వెచ్చని నీళ్లు తాగాలి. వెనిగర్‌ను పుక్కిలించటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. అల్లంలో బ్యాక్టీరియాను పోగొట్టే లక్షణాలుంటాయి. అందుకే చిన్న ముక్క వేసి నీళ్లు కాచుకోవాలి. ఆ నీటిని తాగాలి లేదా అల్లం టీ తాగవచ్చు.
- నీళ్లలో తులసి ఆకులు వేసి మరిగించాలి. చల్లార్చిన తర్వాత తాగాలి. లేకుంటే రెండు స్పూన్ల తులసిరసంలో స్పూన్ తేనె కలిపి తాగాలి. గొంతు నొప్పి తగ్గిపోతుంది.
- నీటిలో టీస్పూన్ అల్లం రసం వేసి అందులోకి తేనే కలిపి తాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది.
- గోరు వెచ్చని పాలల్లో చిటికెడు పసుపు వేసి తాగటం వల్ల కూడా చక్కని ఫలితం ఉంటుంది.
- మూడు కప్పులు నీళ్లలో కొద్దిగా వాము వేసి మరిగించాలి. గోరు వెచ్చని వాము నీళ్లను తాగాలి.
- తమలపాకు రసంలో కొద్దిగా తేనె వేసి కలిపి తాగాలి. సూప్‌లు తాగితే ఉపశమనం ఉంటుంది. కారం, మసాలా, ఐస్‌క్రీమ్స్ జోలికి పోకూడదు. మరీ ఇబ్బందిగా ఉంటే మాత్రం వైద్యుడిని సంప్రదించాలి.



ప్రేరణ



నిరక్షరాశ్యత, ఉద్యోగావకాశాల్లో పరిమితులు, ఆర్థిక సమస్యల వల్ల మహిళలు పేదరికంలోనే మగ్గిపోవలసిన పరిస్థితి నెలకొంటోంది. ఈ సమస్యను పరిష్కరించాలనే సంకల్పంతో ప్రగతి సంస్థ ద్వారా ఆడపిల్లల విద్యావసరాలకు సహాయపడుతోంది ఎడ్యుకేట్ గర్ల్స్ ఫౌండర్, **సఫీనా హుస్సేన్**. ఆవిడ ఇంటర్వ్యూలో వెల్లడైన విశేషాలివి!



అమ్మాయిలను బడి బాట పట్టిస్తూ..

• ప్రగతి ఆలోచన ఎక్కడి నుంచి వచ్చింది?

భారతదేశంలోని మారుమూల గ్రామాల్లోని నిరక్షరాశ్య సమాజాలను ఆడపిల్లల చదువుల వైపు నడిపించే లక్ష్యంతో ఏర్పడిన సంస్థ ఎడ్యుకేట్ గర్ల్స్. గత 16 ఏళ్లుగా విద్యాహక్కులో భాగంగా ఎనిమిదో తరగతి వరకూ ఆడపిల్లలను చదివించడం మీదే మేం దృష్టి పెట్టాం. ప్రభుత్వ సహాయసహకారాలతో పాటు, భారీ కమ్యూనిటీ వాలంటీర్ల సహాయంతో ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ ద్వారా ఇప్పటివరకూ లక్షల



మంది ఆడపిల్లలను బడుల్లో చేర్పించాం. రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బీహార్‌లలోని 29 వేల గ్రామాల్లోని ఆడపిల్లలకు చదువును చేరువ చేయగలిగాం! పేదరికం, పితృస్వామ్యం, ప్రయాణ సౌకర్యాల లేమి, సమాజాల్లో సెకండరీ స్కూల్ మౌలిక సదుపాయాల లోపం లాంటి కారణాల వల్ల ఆడపిల్లలు ఎనిమిదో తరగతి తర్వాత బడులు మానేస్తున్నారు. దాంతో కనీస విద్యార్హతలు లేక చిన్న స్థాయి వృత్తుల్లోకి కూడా వాళ్లు ప్రవేశించలేకపోతున్నారు. అంతకుమించి స్వతహాగా సంక్రమించిన హక్కుల పట్ల అవగాహన లేక, కేవలం శారీరక శ్రమతో కూడిన కూలీ పనులు, ఇంటి పనులకే పరిమితమైపోతున్నారు.

అలాగే భౌతిక, లైంగిక, కుటుంబపరమైన నిర్ణయాల పట్ల కూడా వాళ్లు నియంత్రణ కోల్పోతున్నారు.

ఇలాంటి మహిళల సమస్యలను పరిష్కరించడం కోసం మేం 2021లో ప్రగతి అనే మరొక కార్యక్రమాన్ని చేపట్టాం!

• ప్రగతి ప్రధాన లక్ష్యం?

15 నుంచి 29 ఏళ్ల మహిళలు ప్రభుత్వ బడుల నుంచి కనీసం పదో తరగతి పాసయ్యేలా చూడడం మా లక్ష్యం.

> నేను ఢిల్లీలో పుట్టి పెరిగాను. కొన్ని క్లిష్టమైన పరిస్థితుల్లో టీనేజీ వయసులోనే చదువు మానుకుని పెళ్లి చేసుకోవలసి వచ్చింది. అయితే మా ఆంటీ ప్రమేయంతో నేను ఆ ప్రమాదం నుంచి గట్టెక్కగలిగి చదువును కొనసాగించగలిగాను. అంతే కాకుండా ఉన్నత చదువుల కోసం లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు వెళ్లగలిగాను. అప్పట్లో కూడా "కూతురి మీద అంత డబ్బు ఎందుకు ఖర్చు చేస్తున్నావు. ఆడపిల్ల ఎప్పటికైనా పెళ్లి చేసుకోవలసిందే, అలాంటప్పుడు అంత పెట్టుబడి పెట్టడం ఎందుకు?" అని మా నాన్నను అడిగినవాళ్లున్నారు. ఏదేమైతేనేం చివరకు అవరోధాలను జయించి, ఉన్నత చదువు చదువుకోగలిగాను. నాలా అమ్మాయిలందరికీ ఆదరణ, సహాయసహకారాలు దొరకడం కష్టం. కాబట్టే ఆడపిల్లలకు విద్యను అందించడం కోసం నా వంతు కృషి చేస్తున్నాను.

ఎంట్రీ లెవల్ ఉద్యోగాలు, వొకేషనల్ ట్రైనింగ్‌లలో ప్రవేశాలకు పదో తరగతి పాసై ఉండడం కీలకం కాబట్టి అమ్మాయిలు పదో తరగతి పూర్తి చేయగలిగే వరకూ బడులు మానుకోకుండా చూసుకోవడం మీదే మేం దృష్టి పెడుతున్నాం. ప్రగతి సంస్థ, చదువు పూర్తి చేసిన ఆడపిల్లలకు ఉద్యోగావకశాలను కల్పించడంలో కూడా సహాయపడుతుంది. ఆరు నెలల సుదీర్ఘమైన విలేజ్ క్యాంప్స్ సహాయంతో స్థానిక పెద్దల తోడ్పాటుతో ఆడపిల్లలు పదో తరగతి పాసయ్యేలా బహిరంగ బడి పాఠ్యప్రణాళికలను అనుసరించేలా ఆడపిల్లలను ప్రోత్సహిస్తుంది. ఈ విషయంలో గ్రామ పెద్దలు ప్రధాన భూమిక పోషిస్తూ ఉంటారు. చదువు ఈడున్న ఆడపిల్లలను గుర్తించి, పరీక్షలు రాసేవరకూ వాళ్లకు మార్గ నిర్దేశం చేసి, భవిష్యత్తు ఉద్యోగావకాశాల పట్ల వాళ్లకు అవగాహన కల్పిస్తూ ఉంటారు.

• బడికి వెళ్లలేని ఆడపిల్లలకు మీరెలాంటి సౌకర్యాలు, సౌలభ్యాలు కల్పిస్తూ ఉంటారు?

మేం కేవలం పాఠ్యపుస్తకాలు, సబ్జెక్టులకే పరిమితం కాకుండా, ప్రాజెక్టు వర్క్స్, జీవన నైపుణ్యాలను మెరుగపరిచే అంశాల పట్ల కూడా అవగాహన ఏర్పరుస్తూ ఉంటాం. సెల్ఫ్ స్టడీ టెక్నిక్స్‌తో పాటు, పీర్ సపోర్ట్ నెట్‌వర్క్స్ అభివృద్ధికి తోడ్పడతాం. అలాగే పరిస్థితులను బట్టి మసలుకోవడం, చాకచక్యంగా మెలగడం, సమస్యలను పరిష్కరించడం లాంటి మెలకువలను కూడా నేర్పిస్తాం. అలాగే పరీక్షా కేంద్రాలకు చేరుకోగలిగే ప్రయాణ మార్గాలు, సాధనాల గురించి కూడా అవగాహన కల్పిస్తాం.

• మీ భవిష్యత్తు ప్రణాళికలు?

రాబోయే పదేళ్లలో కోటి మంది ఆడపిల్లలు పదో తరగతి పూర్తి చేసేలా సహాయపడాలన్నదే మా లక్ష్యం. ప్రభుత్వ సహకారంతో మారుమూల గ్రామాల్లో బహిరంగ బడలును నెలకొల్పి ఆడపిల్లలు చదువుకుని, స్వయంస్వావలంబన సాధించడంలో సహాయపడాలని భావిస్తున్నాం. కలలు కనే ప్రతి ఆడపిల్లా ఆ కలలను నిజం చేసుకోవడంలో విద్య కీలక పాత్ర పోషిస్తుంది. విద్య అనేది ఒక ప్రత్యేక హక్కు కాదు, అది జన్మహక్కు. చదువు, మన మీద మనం పెట్టుకునే పెట్టుబడి. తరగని ఆస్తి. ఈ వాస్తవం నగీనా బానో మాటల్లోనే వెల్లడైంది. నగీనా... హింసకు గురై, పట్టించుకోకుండా వదిలేసిన బాల వధువు. ఆ అమ్మాయి చదువుతో తన జీవితాన్ని సరిదిద్దుకుని, పిల్లలకు మంచి భవిష్యత్తును అందించగలిగింది. ఆ చదువుల ఛాంపియన్ తన అనుభవం గురించి మాట్లాడుతూ.. "నా చదువే నా సొంత ఆస్తి. దాన్నెవరూ నా నుంచి దూరం చేయలేరు. దాన్నెవరూ దొంగిలించలేరు. ఎలాంటి వరదలూ, కరవులూ దాన్ని నా నుంచి లాగేసుకోలేవు. చనిపోయేవరకూ నా చదువు నాతోనే ఉంటుంది" అని ఒక సందర్భంలో నాతో చెప్పింది. నగీనాలా ఆడపిల్లలందరూ చదువు విలువను తెలుసుకుని తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలనే లక్ష్యంతోనే నేను ప్రగతి సంస్థను నెలకొల్పాను. అర్థాంతరంగా చదువును మానేసే అమ్మాయిలు ఎంతో మంది ఉన్నారు. కర్షిన అనే అమ్మాయి తొమ్మిదో తరగతిలో రెండు సబ్జెక్టుల్లో ఫెయిలైంది. ఆ అమ్మాయికి చదువుకోవాలని ఉన్నా, చదువులో వెనకబడడంతో ఆమెను చదువు మాన్పించేశారు. వాళ్ల గ్రామంలో ప్రగతి క్యాంప్ ఏర్పాటైనప్పుడు, ఆ అమ్మాయి చదువును కొనసాగించాలనే కోరికను బయల్పరిచింది. అలా మా ప్రగతి సంస్థ సహాయంతో తన గ్రామంలోనే ఒక చిన్న దుకాణాన్ని నెలకొల్పుకోగలిగింది. అలాగే తన చదువును పూర్తి చేసి, వ్యాపారాన్ని విస్తరించుకోగలిగింది.

• గోగుమళ్ల కవిత

ఆరేళ్ళ క్రితం వరకూ ఆమె సాధారణ గృహిణి... భర్త, కుమార్తె మరణంతో కలిగిన కుంగుబాటును తట్టుకుంటూ... కొడుకు సంకల్పాన్ని గెలిపించడానికి... అరవయ్యేనిమిదో ఏట మోడలింగ్‌లో అడుగుపెట్టారు. కొత్త దారిలో అడుగులు వెయ్యడానికి వయసుతో పని లేదంటున్న రుక్మిణి పీతాంబరన్... వెండితెరపై కూడా మెరుస్తున్నారు.



"ఇప్పుడైతే నన్ను చాలామంది గుర్తుపట్టేస్తున్నారు కానీ.. కొన్నేళ్ళ క్రితం వరకూ మా పక్కవీధివారికే నేను పెద్దగా తెలీదు. కేరళలోని అళప్పుజాలో స్థిరపడిన మధ్యతరగతి కుటుంబం మాది. నేను పెద్దగా చదువుకోలేదు. పెళ్ళయ్యాక... గృహిణిగా తీరికలేకుండా ఉండేదాన్ని" అని గుర్తు చేసుకున్నారు రుక్మిణి. ఆమె భర్త పీతాంబరన్. వాళ్ళకొక అమ్మాయి... అంగవైకల్యంతో పుట్టింది. దాన్ని సరి చేయించడానికి తిరగని ఆసుపత్రులు లేవు, కలవని వైద్యులు లేరు. కానీ ఫలితం లేకపోయింది. ఈలోగా ఆమె భర్త కూడా అనారోగ్యానికి గురయ్యారు. "అప్పుడే మేము ఒక అబ్బాయిని దత్తత తీసుకొని పెంచాం. అతనే రాజీవ్. మా ఆశలన్నీ వాడిమీదే. అందుకు తగ్గట్టే వాడు కూడా మమ్మల్ని ఎంతో ప్రేమగా చూసుకొనేవాడు. కానీ తోటి విద్యార్థులు, ఇరుగు

మోడల్ మదర్

పొరుగువారు దత్తపుత్రుడంటూ మాటలతో ఎంతగానో వేధించేవారు. అవన్నీ నాతో చెప్పుకొని బాధపడేవాడు" అని చెప్పారు రుక్మిణి. చదువులో రాజీవ్ చాలా చురుగ్గా ఉండేవారు. కళలన్నా, పెయింటింగ్ అన్నా ఎంతో ఇష్టం. హైస్కూల్లో చదువుతున్నప్పుడే... ఫ్యాషన్ డిజైనర్ అవ్వాలనుకున్నారు. ముంబయి 'నిఫ్ట్'లో... పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. "పర్యావరణ అనుకూల



మైన, ఏ కాలానికైనా ప్రత్యేకంగా కనిపించే దుస్తులతో ఒక బ్రాండ్ సృష్టించాలన్నది నా కల. కానీ దానికోసం పెట్టుబడి సమకూర్చుకోవడానికి కొంతకాలం పట్టింది" అంటారు రాజీవ్. ప్రకటనల రంగం, సినీ, నాటక రంగాలు... ఇలా ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ పని చేశారు. డబ్బు కూడబెట్టారు. తన పేరుతో చేనేత దుస్తుల బ్రాండ్‌ను కొచ్చిలో ప్రారంభించారు.

ఆట పట్టిస్తున్నాడనుకున్నా...

"అయితే ఆ దుస్తులకు మోడల్స్‌ను కుదుర్చుకోవడం కష్టమయింది. ఈ ఇబ్బందుల్లో ఉండగా... నాన్న, అక్క మరణించారు. ఆ విషాదాన్ని మేం తట్టుకోలేకపోయాం. ముఖ్యంగా అమ్మ వేదనను చూడలేకపోయేవాణ్ణి. ఆమెను మళ్ళీ మామూలు మనిషిని చెయ్యాలనుకున్నాను. ఆమె దృష్టిని వేరే విషయాలవైపు మళ్ళించాలని ఆలోచన చేశాను. నా పని గురించి ఆమెతో చర్చించేవాణ్ణి. నేను డిజైన్ చేసిన చీరల్ని ఆమెకు చూపించేవాణ్ణి. వాటిని ఆమె కట్టుకుంటే.. ఫొటోలు తీసేవాణ్ణి. ఆ తరువాత నేను ఏ చీర డిజైన్ చేసినా... ఇది అమ్మ కట్టుకుంటే ఎలా ఉంటుంది? అని ఊహించుకొనేవాణ్ణి" అని చెప్పారు రాజీవ్. అప్పుడే... అమ్మనే మోడల్‌గా పెట్టుకోవాలనుకున్నారు. మామూలుగా ఆమె అయితే ఇష్టపడదని తెలుసు. వేరే మోడల్స్‌ను తీసుకోవడానికి తనకున్న ఇబ్బందులను ఆమెకు వివరించారు. "నేను తయారు చేసిన చీరలకి నువ్వే మోడల్‌గా ఉండాలని రాజీవ్ చెప్పినప్పుడు... ఏదో సరదాగా ఆటపట్టిస్తున్నాడని అనుకున్నాను. ఆ తరువాత... వాడు తన సమస్యలు చెప్పగానే... 'సరే' అన్నాను. అయితే... 'ఈ వయసులో... నేనిది చెయ్యగలనా? ఈవిడ మోడల్ ఏంటని అందరూ నవ్వితే... వాడికి అవమానం కదా!' అనిపించింది. కానీ ఈ లోకంలో నాకున్నది వాడొక్కడే. వాడి సంతోషమే నాకు ముఖ్యం" అంటారు రుక్మిణి.

నటన కష్టం కాదు...


మెల్లగా... మోడలింగ్ వాతావరణానికి ఆమె అలవాటు పడ్డారు. ఆ తరువాత... గత ఆరేళ్లుగా... రాజీవ్ డిజైన్ చేసిన చీరలకు ఆమే మోడల్. కొద్ది రోజుల్లోనే ఆమె విపరీతమైన పాపులారిటీ సాధించారు. వేరే బ్రాండ్లు కూడా తమ దుస్తులకు, నగలకు మోడలింగ్ చెయ్యాలంటూ ఆమెను ఆహ్వానిస్తూనే ఉన్నాయి. "ఇతర బ్రాండ్లకు నేను మోడల్‌గా ఉండను. ఎందుకంటే ఇదంతా చేస్తున్నది మా అబ్బాయి కోసం" అంటారు రుక్మిణి. ఆమె పాపులారిటీని గుర్తించి... సినీ రంగం కూడా అవకాశాచ్చింది. రాహుల్ సదాశివన్ దర్శకత్వంలో 'భూతకాలమ్', అన్వర్ రషీద్ దర్శకత్వంలో 'ట్రాన్స్'... తదితర చిత్రాల్లో ఆమె కనిపించారు. "తెరమీద నన్ను చూసుకొని... నేనే నమ్మలేకపోయాను. సినిమాల్లో నటించడం మంచి అనుభవం. నటన నాకు కష్టంగా అనిపించలేదు. దర్శకుడు చెప్పింది చేసేస్తాను అంతే" అంటారామె నవ్వుతూ. రుక్మిణి... ఇప్పుడు సెలబ్రిటీ. ఎక్కడికి వెళ్ళినా జనం ఆమెను గుర్తుపట్టి పలకరిస్తారు. యువత ఫొటోలు దిగితే... పెద్దలు మాట కలిపి అభినందిస్తూ ఉంటారు. "అందరికీ ఎన్నో కలలు ఉంటాయి. చాలామందికి వాటిని నెరవేర్చుకోవడం కష్టమవుతుంది. కానీ నేను ఎప్పుడూ కలలోనైనా ఊహించలేనివి నా జీవితంలో జరిగాయి. దేనికైనా వయసుతో నిమిత్తం లేదు. మనకు దొరికిన పని చిత్తశుద్ధితో చేస్తే చాలు. కాస్త ఆలస్యమైనా అనుకున్నవి జరుగుతాయి. కాబట్టి ఎప్పుడూ నిరాశ పడకూడదు... నా బిడ్డకైనా, ఎవరికైనా నేను చెప్పేది ఇదే" అంటున్నారీ మోడల్ మదర్.

కౌన్సెలింగ్

లవ్ అడిక్షన్

డాక్టర్! మా అబ్బాయికి 25 ఏళ్లు. ఎంతో మంది అమ్మాయిలతో ప్రేమ వ్యవహారాలు నడిపించాడు. ఏ అమ్మాయితో ఉన్నా, ఆ అమ్మాయే లోకంగా జీవిస్తూ, మమ్మల్నీ, చదువునీ, బాధ్యతలనూ వదిలేస్తూ ఉంటాడు. అబ్బాయి ధోరణితో మాకు భయంగా ఉంది. జీవితంలో వెనకపడిపోతాడేమో నని ఆందోళనగా కూడా ఉంది. ఇలాంటి ప్రవర్తన సాధారణమైనదేనా? **- ఓ సోదరి, హైదరాబాద్.**

మద్యం, మాదకద్రవ్యాల మాదిరిగానే ప్రేమను వ్యసనంగా మలుచుకునే వాళ్లు ఉంటారు. మీ అబ్బాయి ఆ కోవకు చెందినవాడే నని అనిపిస్తోంది. ఎలాంటి వ్యసనపరులైనా వారి బాల్యంలో ఏదో ఒక ట్రామా (మానసిక గాయం)ను ఎదుర్కొని ఉంటారు. నిర్లక్ష్యానికి గురవడం లేదా హింస (లైంగిక, మానసిక, శారీరక)కు గురయి ఉంటారు, లేదా తల్లితండ్రులు పట్టించుకోకుండా వదిలేయడం, తల్లితండ్రుల నుంచి తగినంత ప్రేమ దక్కకపోవడం, విపరీతమైన ఒత్తిడుల మధ్య పెరగడం, లేదా ఇంకేదైనా ట్రామాకు గురవడం జరిగి ఉంటుంది. ప్రేమ వ్యసనపరులుగా మారడానికి ప్రధాన కారణం బాల్యంలో వారి మీద జరిగిన లైంగిక దాడులే! బాల్యంలో ఎలాంటి ట్రామాకు గురైనా పెరిగి పెద్దయ్యాక ఆరోగ్యకరమైన సామాజిక అనుబంధాలు ఏర్పరుచుకోవడంలో వీళ్లకెప్పుడూ ఇబ్బందులు ఉంటూనే ఉంటాయి. అనుబంధాలు ఏర్పరుచుకోవడంలో భయం కూడా కొందర్లో ఉంటుంది. ఆరోగ్యకరమైన అనుబంధాలు ఏర్పరుచుకునే మెలకువల లోపానికి బాల్యంలోనే బీజాలు పడితే అవి వయసుతో పాటు పెరిగి, భవిష్యత్తులో లవ్ అడిక్షన్‌కు కచ్చితంగా దారి తీస్తాయి. బాల్యం లేదా యుక్తవయసులో గురయ్యే ట్రామాల వల్ల ఆత్మన్యూనత, డిప్రెషన్, ఆందోళన మొదలైన మానసిక సమస్యలు తలెత్తి, వాటి ఫలితంగా లవ్ అడిక్షన్‌కు గురయ్యే అవకాశాలూ ఉంటాయి. లవ్ అడిక్ట్స్... అవమానం, భయం, డిప్రెషన్, ఆందోళన మొదలైన ఇబ్బందికరమైన భావోద్వేగాల ప్రభావం అనుభవం కాకుండా ఉండేలా మొద్దుబారడం కోసం ప్రేమ అనే ఊహాలోకంలో విహరించడం బాల్యం నుంచే అలవరుచుకుంటారు. ఇందుకోసం ప్రేమలోకి తోసేందుకు ఉపయోగపడే మెదడులో న్యూరోకెమికల్స్ ఉత్పత్తిని పెంచుకుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే... ఒక లవ్ అడిక్ట్‌కి ఎవరైనా ఆకర్షణీయంగా కనిపిస్తే, వాళ్లతో తమ జీవితం ఎంత అద్భుతంగా ఉంటుందోనని ఊహించుకుంటూ, ఆ క్రమంలో తనకు, ఎదుటి వ్యక్తికి ఎదురయ్యే వీలుండే ఇబ్బందులు, సమస్యల గురించిన ఆలోచనలను పక్కన పెట్టేస్తాడు. అయితే ఇతర వ్యసనపరులు కూడా ఇలాంటి లక్ష్యాన్నే.. డ్రగ్స్ వాడడం, జూదం ఆడడం, వీడియో గేమ్స్ ఆడడం, డబ్బులు ఖర్చుపెట్టడం, సెక్స్ లేదా ఇతర వ్యసనాలకు లోను చేసే పదార్థాల ఆధారంగా అందుకుంటారు. ఇలా తనంతట తానుగా మెదడులో పెంచుకునే న్యూరోకెమికల్ రియాక్షన్ వల్ల క్రమేపీ జీవితంలోని ఇబ్బందుల నుంచి గట్టెక్కే మెలకువలనూ అలవరుచుకుంటారు. క్లుప్తంగా చెప్పాలంటే ప్రేమ వ్యసనపరులు వెతుకులాడేది ప్రేమ కోసం కాదు, తమ భావోద్వేగాలను అదుపు చేయగల సాధనం కోసమే!



లవ్ అడిక్షన్ లక్షణాలు

సాధారణంగా ప్రేమ వ్యసనం పురుషులకంటే స్త్రీలకే ఈ సమస్య ఎక్కువ అనుకుంటే పొరపాటు. ఇద్దర్లోనూ ఈ సమస్య ఉంటుంది. లవ్ అడిక్షన్‌లో ఉన్న వ్యక్తుల ప్రధాన లక్షణాలు ఇలా ఉంటాయి. అవేంటంటే...

- లైంగిక సంబంధాన్ని ప్రేమానుబంధం, అంతే లేని అనురాగ బంధం అనుకోవడం
- ఎవరితోనూ రిలేషన్‌షిప్‌లో లేకపోతే ఒంటరిగా భావిస్తూ, అనుబంధం కోసం వెంపర్లాడడం
- ఆ కొత్త రిలేషన్‌షిప్ వెతుకులాటలో ఆత్మీయులు, కుటుంబీకులు, స్నేహితుల పట్ల నెరవేర్చాల్సిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం
- ఒక రిలేషన్‌షిప్‌లో ఉండగానే వేరొక అనుబంధం కోసం వెతుకుతూ ఉండడం
- నడుస్తున్న రిలేషన్‌షిప్‌ను లైంగికంగా/ప్రేమపరంగా మరింత దృఢంగా ఉంచడం కోసం పరితపించడం
- ఉన్న భాగస్వామిని పోగొట్టుకోకుండా ఉండే /ఒక కొత్త వ్యక్తితో రిలేషన్‌షిప్‌లోకి అడుగు పెట్టే క్రమంలో ఇతర పనుల మీద ఆసక్తి కనబరచకపోవడం
- మానసిక భావోద్వేగాలు, ఇతరత్రా ఒత్తిడికి లోను చేసే ఏ పరిస్థితి నుంచి తప్పించుకోవడానికైనా ప్రేమ మీద ఆధారపడడం

ఏది ఏమైనా లవ్ అడిక్ట్స్ తమ సమయాన్నంతా ఉన్న రిలేషన్‌షిప్‌ని నిలిపి ఉంచుకోవడానికి లేదా కొత్త రిలేషన్‌షిప్‌లో మునిగిపోవడానికే కేటాయిస్తూ ఉంటారు. వీళ్ల ప్రపంచమంతా 'ప్రేమ' చుట్టూనే తిరుగుతుంది. తినే తిండి మొదలు, వేసుకునే దుస్తులు, చేసే ఉద్యోగం, కాలక్షేపం కోసం వెళ్లే ప్రదేశాలు... ఇలా ప్రతిదీ తమని పరిపూర్ణం చేసే ఒక 'పర్‌ఫెక్ట్' పార్ట్‌నర్‌ని దొరకబుచ్చుకునే వీలుండే మార్గాల్లోనే కూర్చబడుతూ ఉంటుంది. మీ అబ్బాయి ఈ కోవకే చెందుతాడు కాబట్టి మానసిక నిపుణుల చేత కౌన్సెలింగ్ ఇప్పించడం అవసరం.

డాక్టర్ కల్యాణ చక్రవర్తి, క్లినికల్ సైకాలజిస్ట్, ల్యూసిడ్ డయాగ్నొస్టిక్స్, హైదరాబాద్.

ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
గురువారం • 20 జూన్ 2024
cinema@andhrajyothy.com

ఎస్‌కే 30 షురూ



ఇప్పటిదాకా లవ్‌స్టోరీలు, మాస్ యాక్షన్ ఎంటర్టైనర్‌లతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సందీప్ కిషన్ తన పంథా మార్చారు. తన కెరీర్‌లో చేయని సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న 30వ చిత్రం (ఎస్‌కే 30)లో ఓ సరికొత్త పాత్రలో అలరించబోతున్నారు. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు చుట్టూ అల్లుకున్న కథ ఇది. బుధవారం ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పలు బ్లాక్‌బస్టర్ ఎంటర్టైనర్‌లను అందించిన త్రినాథరావు నక్కిన 'ఎస్‌కే 30'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ కలయికలో రాజేశ్ దండా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రావు రమేశ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రసన్నకుమార్ బెజవాడ కథ, మాటలు అందిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. డీవోపీ: నిజార్ షఫీ. ఎడిటర్: ఛోటా కే ప్రసాద్. బాలాజీ గుత్తా సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

కూల్ అవ్వండి మేడం గారు



విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ నటుడిగా జాతీయ స్థాయిలో చక్కని గుర్తింపు సొంతం చేసుకున్నారు దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ 'మహానటి', 'సీతారామం' లాంటి చిత్రాలతో విజయాలను అందుకున్నారు. ఆయన తాజాగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. 'లక్కీ భాస్కర్' చిత్రంలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'కోపాలు చాలండి శ్రీమతి గారు..కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ సాగే గీతాన్ని యూనిట్ బుధవారం విడుదల చేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ ప్రత్యేక శైలిలో స్వరపరిచిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్‌లు ఆలపించారు. శ్రీమణి సాహిత్యం ఈ గీతానికి ప్రత్యేకాకర్షణగా నిలిచింది. దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి, ఎడిటర్:నవీన్ నూలి

'నింద' అందరికీ నచ్చుతుంది



'కాంద్రకోట మిస్టరీ' అని మా సినిమా పోస్టర్ వదిలినప్పుడు అందరూ ఇది ఘోస్ట్ సినిమా అనుకున్నారు. టీజర్ తర్వాత అందరికీ ఓ క్లారిటీ వచ్చింది. వరుణ్ సందేశ్‌కు ఇది తగిన క్యారెక్టర్. ఆయనకు ఇది కమ్ బ్యాక్ సినిమా అవుతుంది' అన్నారు రాజేశ్ జగన్నాథం. వరుణ్‌సందేశ్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఈ కథ మీద నాకు నమ్మకం ఉంది. నిర్మాతల కోసం ప్రయత్నించా. ఆ తర్వాత వేరే వాళ్ల ఎందుకని నేనే నిర్మాతగా మారా. నాకు క్రియేటివ్ ఫీల్డ్ అంటే ఇష్టం. దర్శకత్వ శాఖ నాకు నచ్చింది. సినిమా తీయడం ఇష్టం కూడా. అయితే తీసిన సినిమాను విడుదల చేయడం ఎంత కష్టమో ఇప్పుడు అర్థమవుతోంది' అన్నారు. 'నింద' సినిమాలో ప్రతి పాత్ర అందరికీ గుర్తుండి పోతుంది. వరుణ్‌సందేశ్ కొత్తగా కనిపిస్తారు. చక్కని ఆర్టిస్టులతో ఈ సినిమా తీశాను. 'నింద' చూసిన తర్వాత మలయాళంలోనే కాదు తెలుగులోనూ కాన్సెప్ట్ బేస్డ్ చిత్రాలు వస్తున్నాయి అని ప్రేక్షకులు ఫీల్ అవుతారు' అన్నారు జగన్నాథం. తన దగ్గర స్క్రిప్టులు సిద్ధంగా ఉన్నాయనీ, ఇకపై దర్శకత్వం మీదే ఫోకస్ పెడతానని ఆయన చెప్పారు.



నా కెరీర్‌లో కల్కి లాంటి సినిమా చేయలేదు

అమితాబ్ బచ్చన్

'కల్కి 2898 ఏడీ' చిత్రంలో భాగమవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇదో కొత్త ప్రపంచం, నా కెరీర్‌లో ఇప్పటిదాకా ఇలాంటి సినిమా చేయలేదు. 'కల్కి' చిత్రీకరణలో అనుభవాలను ఎప్పటికీ మర్చిపోలేను' అని అమితాబ్ బచ్చన్ అన్నారు.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రమిది. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ సహా పలువురు అగ్రనటులు కీలకపాత్రలు పోషించారు. దీపికా పదుకొనే, దిశాపటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ నిర్మించారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ముంబైలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ 'ఓ వినూత్నమైన చిత్రానికి రూపకల్పన చేసిన నాగ్ అశ్విన్, అతని బృందానికి నా అభినందనలు. ఆయన ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఆయన ఇలాంటి కథని ఎలా ఆలోచించగలిగాడో అనిపించింది. ఈ చిత్రంలో విజువల్స్ అసాధారణంగా ఉంటాయి. తన ఆలోచనలను తెరపైన అద్భుతంగా ఆవిష్కరించగలిగాడు. ఈ ఫ్యూచరిస్టిక్ ప్రాజెక్ట్ ఓ మహా అద్భుతం' అని నాగ్ అశ్విన్‌ను ప్రశంసించారు.



తన పాదాలకు నమస్కరించబోతున్న అమితాబ్‌ను వారిస్తున్న అశ్వనీదత్

కమల్‌హాసన్ మాట్లాడుతూ 'నాగ్ అశ్విన్ కూడా మా గురువుగారు బాలచందర్‌లా సాదాసీదాగా కనిపిస్తాడు కానీ అసాధారణ ప్రజ్ఞావంతుడు. తన ఆలోచనలను సృజనాత్మకంగా తెరకెక్కించగల నేర్పు నాగ్ అశ్విన్‌లో అపారంగా ఉంది. ఇందులో ప్రతినాయక ఛాయలున్న పాత్ర నాది. మంచి వినోదం పంచుతుంది. నా ఫస్ట్‌లుక్‌లానే సినిమా కూడా మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది' అన్నారు.

ప్రభాస్ మాట్లాడుతూ 'దిగ్గజాలతో పనిచేసే అవకాశం కల్పించిన అశ్వనీదత్, నాగీకి ధన్యవాదాలు. దేశవ్యాప్తంగా పాపులారిటీ సాధించిన తొలి భారతీయ నటుడు అమితాబ్‌బచ్చన్. ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. నా చిన్నప్పుడు కమల్‌హాసన్ గారి సినిమాలు చూసి ఆయనలా నటించేవాణ్ణి. దీపిక అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ఇంతమంది గొప్ప నటులతో కలసి నటించానంటే నమ్మలేకపోతున్నాను' అని చెప్పారు.

దీపికా పదుకొనే మాట్లాడుతూ 'నాగీ క్రియేట్ చేసిన మ్యాజిక్ 'కల్కి' చిత్రం. ఆయనో జీనియస్. తనలో చాలా స్పష్టత ఉంది. సినిమాను అద్భుతంగా తీశారు. నటిగా నాకు గొప్ప అనుభవం మిగిల్చిన సినిమా ఇది' అన్నారు.

అశ్వనీదత్ మాట్లాడుతూ 'అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపిక సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినందుకు ఆనందంగా ఉంది. 'కల్కి' గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అన్నారు.

ఆకట్టుకునే సినిమా కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఇట్లు.. మీ సినిమా' ఈ నెల 21న విడుదల కానుంది. నలుగురు యువకులు సినిమా మీదున్న ప్యాషన్‌తో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎటువంటి సవాళ్లు ఎదుర్కొన్నారు.. అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రమిది. లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి హరీశ్ చావా దర్శకుడు. నోరి నాగప్రసాద్ నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్ చావా మాట్లాడుతూ 'సినిమా కథ కోసం అన్వేషిస్తున్నప్పుడు ఏ కథో ఎందుకు.. సినిమా ఇండస్ట్రీలో పడే ఇబ్బందుల గురించి సినిమా తీద్దాం అన్నారు మా నిర్మాత. పరిశ్రమలోకి అడుగుపెట్టే వారికి అవగాహన కల్పించే విధంగా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు. 'పరిశ్రమలోకి వచ్చే కొత్త వాళ్లు పడే ఇబ్బందుల్ని ఆసక్తికరంగా, ప్రేక్షకులకు నచ్చే రీతిలో చూపించాం. ఈ నెల 21న విడుదల చేస్తున్నాం. చిన్న సినిమా కనుక దయచేసి అందరూ థియేటర్లకు వెళ్లి చూడండి' అని కోరారు నిర్మాత నాగప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరో అభిరామ్, హీరోయిన్ వెన్నెల, తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నిర్ణయమే సక్సెస్ ఇచ్చింది



విజయానికి అడ్డతోవలు లేవనేది లోకోక్తి. కథానాయిక నేహాశెట్టి కూడా అదే మాట చెబుతున్నారు. ముందస్తు ప్రణాళికతో సిద్ధమవ్వడం వల్లే ఏ రంగంలో అయినా సక్సెస్ సొంతం అవుతుందంటున్నారు ఇందుకు తన సొంత అనుభవాన్నే ఉదాహరణగా చూపుతున్నారు. తన స్కూల్ రోజుల్లోనే నటనపై దృష్టి సారించాలని నిర్ణయం తీసుకున్నారట. ఇక అప్పటి నుంచి నటనకు సంబంధించిన వివిధ అంశాల గురించి తెలుసుకోవడం, డైలాగ్స్ చెప్పడం, డాన్స్ ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారట. టాలీవుడ్‌లో అవకాశాలు వచ్చాకనే తెలుగు భాష నేర్చుకున్నాను. ఇలా విభిన్న అంశాలమీద అవగాహన సాధించడం సినిమాల్లోకి అడుగుపెట్టినప్పుడు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు. మొదట్లో విజయాలు రాకపోయినా మన కష్టానికి తగిన అవకాశాలు వెతుక్కుంటూ రావడంతో హీరోయిన్‌గా నిలదొక్కుకున్నాను అని ఆమె చెప్పారు. ఇటీవలే విడుదలైన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రంలో కథానాయికగా ఆకట్టుకున్నారు నేహ.

ఆర్కిటెక్ట్ నిత్య



'మనమే' చిత్రంతో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు శర్వానంద్. ఇప్పుడు తన తదుపరి చిత్రం ('శర్వా 37-వర్కింగ్ టైటిల్) షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి 'సామజవరగమన' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. 'ఏజెంట్' చిత్రంలో తన గ్లామర్‌తో అలరించిన సాక్షి వైద్య శర్వాకు జోడీగా నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. బుధవారం సాక్షి పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రను పరిచయం చేసింది. ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో సాక్షి కనిపించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, జ్ఞానశేఖర్ వీఎస్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాత.

బెస్ట్ థ్రిల్లర్

నవీన్‌చంద్ర హీరోగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను హీరో నిఖిల్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'ఈ కథ వినగానే నచ్చేసింది. ఎనిమిది నెలలు ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేసి, తెలుగు, తమిళ భాషల్లో విడివిడిగా షాట్స్ తీశారు. స్క్రిప్ట్ కోసం ఇంత ప్యాషన్‌గా పని చేసిన నిర్మాతలను నేను చూడలేదు. తప్పకుండా మంచి విజయం సాధిస్తారు. నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది. కథ, స్క్రీన్‌ప్లే, యాక్షన్, యాక్టింగ్.. అన్నీ అద్భుతంగా ఉంటాయి' అని చెప్పారు. నిర్మాతల్లో ఒకరైన



రేయా హరి మాట్లాడుతూ 'తెలుగులో నాకు ఇది మొదటి సినిమా. ఇందులో భాగం కావడం ఆనందంగా ఉంది' అన్నారు. 'మాకు ఇది మూడో సినిమా. మొదటి రెండు చిత్రాలూ హిట్ అయ్యాయి. తెలుగు, తమిళ భాషల్లో విడివిడిగా తీశాం. ఇది ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అని మరో నిర్మాత అక్బర్ చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ, త్వరలోనే థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తామనీ నిర్మాతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజా రవీంద్ర కూడా పాల్గొన్నారు. రేయా హరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో అభిరామి, దిలీపన్, రిత్విక, రవివర్మ తదితరులు ఇతర ముఖ్య పాత్రధారులు.

ఆధ్యాత్మిక అంశాలతో...



అశ్విన్‌బాబు, అర్బాజ్‌ఖాన్, దిగంగనా సూర్యవంశీ ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'శివం భజే'. బ్రహ్మాజీ, దేవి ప్రసాద్, కాశీ విశ్వనాథ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్‌రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. బుధవారం 'శివంభజే' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఆధ్యాత్మిక అంశాలకు యాక్షన్ హంగులను మేళవించి రూపొందించిన చిత్రమిదని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. జూలైలో 'శివం భజే'ను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. టైటిల్‌తోనే మా సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం:వికాస్ బడిస, సినిమాటోగ్రఫీ: దాసరథి శివేంద్ర

సస్పెన్స్ థ్రిల్లర్



ప్రవీణ్ కేవీ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'మహిష' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను నటుడు శ్రీకాంత్ విడుదల చేసి, టీమ్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు రామకృష్ణ గౌడ్ కూడా పాల్గొన్నారు. 'ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ 'ఇది సస్పెన్స్ థ్రిల్లర్. నూతన నటీనటులు నటించారు. సినిమాలో ఐదు పాటలు ఉన్నాయి. శ్రీవెంకట్ సంగీతం అందించారు. త్వరలో పాటలను విడుదల చేస్తాం' అని చెప్పారు. పృథ్వీ, యశిక, వైష్ణవి, కపిల్, మౌనిక, దీపు తదితరులు నటించిన ఈ చిత్రానికి ఫొటోగ్రఫీ: సతీశ్, వివేక్.



ఇంటర్మీడియెట్ టీనేజ్ లవ్‌స్టోరీ



ప్రణవ్ ప్రీతమ్, షాజ్ఞశ్రీ వేణున్ జంటగా నటించిన 'ప్రభుత్వ జూనియర్ కళాశాల' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించారు. భువన్‌రెడ్డి కొవ్వూరి నిర్మాత. బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'ఎన్నో ఇబ్బందుల్ని దాటుకొని మా సినిమాను విడుదలకు తీసుకురావడమే పెద్ద విజయంగా భావిస్తున్నాం. ఇంటర్మీడియెట్ టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. కొన్ని నెలల పాటు వర్క్ షాప్ నిర్వహించి షూటింగ్‌కు వెళ్లాం. ఆర్టిస్టులను మా ఊరు పుంగనూరు తీసుకు వెళ్లి రాయలసీమ యాస నేర్పించాం. సినిమా మీద ప్యాషన్‌తోనే ఇదంతా చేశాం' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో నాకు ఎవరితోనూ పరిచయాలు లేవు. మా దర్శకుడు శ్రీనాథ్‌కు సినిమా అంటే ఎంతో ప్యాషన్, కమిట్‌మెంట్ ఉన్నాయి. ఆయన త్వరలోనే పెద్ద సినిమాలు చేస్తాడనే నమ్మకం ఉంది. మేం ఇచ్చిన తక్కువ బడ్జెట్‌లోనే సినిమాను బాగా తీశాడు' అన్నారు. చిత్రంలో నటించే అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు హీరో ప్రణవ్ ప్రీతమ్, హీరోయిన్ షాజ్ఞ కృతజ్ఞతలు తెలిపారు.



నవ్వించే మంచి దెయ్యం

వెన్నెల కిశోర్, నందితా శ్వేత, నవమి గాయక్ ముఖ్య పాత్రలు పోషించిన హారర్, కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓఎంజీ'(ఓ మంచి ఘోస్ట్) ఈ నెల 21న విడుదల కానుంది. శంకర్ మార్తాండ్ దర్శకత్వంలో డాక్టర్ అబినికా ఇనాబతుని నిర్మించారు. మంగళవారం సాయంత్రం జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో దర్శకుడు మాట్లాడుతూ 'సంగీత దర్శకుడు అనూప్ రూబెన్స్ వల్లే ఈ సినిమా ప్రారంభమైంది. మా మీదున్న నమ్మకంతో అబినికా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆర్టిస్టులంతా అద్భుతంగా నటించారు. అనూప్ ఇచ్చిన రీరికార్డింగ్ సినిమాను మరో స్థాయికి తీసు కెళ్లింది' అని తెలిపారు. 'ఇది మాకు తొలి సినిమా. శంకర్ కథ ఎంత బాగా చెప్పారో అంతకుమించి అనేలా సినిమాను తీశారు. అందరూ చూడతగ్గ చిత్రమిది' అని చెప్పారు డాక్టర్ అబినికా. నందితా శ్వేత మాట్లాడుతూ 'నాకు కామెడీ అంటే చాలా ఇష్టం. స్టోరీ నెరేట్ చేస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అందరినీ నవ్వించేలా మా సినిమా ఉంటుంది' అన్నారు.




ఒమేగా హాస్పిటల్స్‌లోకి రూ.500 కోట్ల పెట్టుబడులు

- మోర్గాన్ స్టాన్లీ పీఈ ఏషియా ఫండ్ నుంచి సమీకరణ
- తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్త విస్తరణ కోసం నిధుల వినియోగం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఏషియా నిర్వహణలోని ఫండ్ నుంచి రూ.500 కోట్లు సమీకరించినట్లు హైదరాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ప్రైవేట్ లిమిటెడ్ (ఒమేగా హాస్పిటల్స్) బుధవారం ప్రకటించింది. ఒమేగా హాస్పిటల్స్‌లోకి ఇదే తొలి ప్రైవేట్ ఈక్విటీ పెట్టుబడి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని ఆసుపత్రుల ఏర్పాటుతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ సహా దేశం అంతటా విస్తరించేందుకు ఈ నిధులను వినియోగించుకోనున్నట్లు సంస్థ తెలిపింది. అలాగే దక్షిణాదిలో మరింత బలపడటానికి కూడా ఈ పెట్టుబడులు దోహదపడతాయని ఒమేగా హాస్పిటల్స్ పేర్కొంది.

గడిచిన కొన్నేళ్లలో దేశంలో కేన్సర్ కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని, ఈ వ్యాధిగ్రస్తులకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి స్థాయి వైద్య సేవలందించడమే తమ లక్ష్యమని ఒమేగా హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ వంశీ అన్నారు. ఈ లక్ష్యం దిశగా మా ప్రయాణాన్ని మరింత వేగవంతం చేసేందుకు మోర్గాన్ స్టాన్లీ పీఈ ఏషియాతో భాగస్వామ్యం తోడ్పడనుందన్నారు. మరికొన్నేళ్లలో ఒమేగా హాస్పిటల్స్‌ను దేశంలోనే అతిపెద్ద కేన్సర్ కేర్ హాస్పిటళ్ల నెట్‌వర్క్‌గా అభివృద్ధి చేయాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుత ఆసుపత్రులను మరింత విస్తరించడంతోపాటు మరిన్ని కొత్త హాస్పిటళ్ల ఏర్పాటుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయని ఒమేగా హాస్పిటల్స్ సీఈఓ డాక్టర్ నమ్రత అన్నారు.

గడిచిన ఏడాది కాలంలో భారత కేన్సర్ కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌లో తమకిది రెండో పెట్టుబడి అని మోర్గాన్ స్టాన్లీ పీఈ ఏషియా ఎండీ అర్జున్ సైగల్ తెలిపారు. డాక్టర్ మోహన్ వంశీ, డాక్టర్ నమ్రత నేతృత్వంలో ఒమేగా హాస్పిటల్స్ మెరుగైన వృద్ధి అవకాశాలను కలిగి ఉందన్నారు.



రెండో పెద్ద కేన్సర్ కేర్ ఆస్పత్రి

కేన్సర్ బారిన పడిన వారికి పూర్తి స్థాయి సేవలందించేందుకు ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ మోహన్ వంశీ నేతృత్వంలో ఒమేగా హాస్పిటల్స్ 2010 జూలైలో ప్రారంభమైంది. ప్రస్తుతం 10కి పైగా ఆస్పత్రులు, 1,400కు పైగా పడకల సామర్థ్యం కలిగిన ఒమేగా హాస్పిటల్స్ దేశంలోనే రెండో అతిపెద్ద కేన్సర్ కేర్ హాస్పిటల్స్ నెట్‌వర్క్‌గా ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఒమేగా హాస్పిటల్స్, హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో 450 పడకల సామర్థ్యం, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కూడిన మల్టీ కేర్ సూపర్ స్పెషాలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌తో పాటు గుంటూరు, వైజాగ్, కర్నూలు, భీమవరం, కరీంనగర్‌లోనూ సంస్థ ఆస్పత్రులను నిర్వహిస్తోంది. అంతేకాదు, మధ్యప్రదేశ్‌కు చెందిన జబల్‌పూర్, ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌కు సైతం విస్తరించింది.

స్విస్ కంపెనీ చేతికి కోటక్ జనరల్

- 70 శాతం వాటా రూ.5,560 కోట్లకు కొనుగోలు
- జూరిక్ కోటక్ ఇన్సూరెన్స్‌గా పేరు మార్పు

న్యూఢిల్లీ: కోటక్ మహీంద్రా జనరల్ ఇన్సూరెన్స్‌లో (కోటక్ జనరల్) మెజారిటీ వాటా కొనుగోలు ప్రక్రియ పూర్తయిందని స్విట్జర్లాండ్‌కు చెందిన జూరిక్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ తెలిపింది. కోటక్ జనరల్‌లో 70 శాతం వాటాను రూ.5,560 కోట్లకు జూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేసింది. ఈ ఒప్పందానికి సంబంధిత నియంత్రణ మండలుల అనుమతులు లభించడంతో కోటక్ జనరల్ టేకోవర్ ప్రక్రియను జూరిక్ ఇన్సూరెన్స్ పూర్తి చేసిందని కోటక్ మహీంద్రా బ్యాంక్ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు సమాచారం అందించింది.

కోటక్ బ్యాంక్ సాధారణ బీమా వ్యాపార విభాగమే కోటక్ జనరల్. వాటా కొనుగోలు పూర్తయిన నేపథ్యంలో కంపెనీ పేరును జూరిక్ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌గా మార్చారు. భారత సాధారణ బీమా రంగంలోకి ఇప్పటివరకు వచ్చిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి (ఎఫ్‌డీఐ) ఇదే. అంతే కాదు, 2021లో జనరల్ ఇన్సూరెన్స్ విభాగంలో ఎఫ్‌డీఐ పరిమితిని 49 శాతం నుంచి 74 శాతానికి పెంచాక వచ్చిన తొలి విదేశీ పెట్టుబడి కూడా ఇదే. కోటక్ జనరల్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేస్తున్నట్లు జూరిక్ ఇన్సూరెన్స్ గత ఏడాది నవంబరులో ప్రకటించింది.

పునరుత్పాదక ఇంధన వనరులపై
అదానీ ఫోకస్

వచ్చే పదేళ్లలో రూ.8.34 లక్షల కోట్ల పెట్టుబడి



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై పెద్ద ఎత్తున దృష్టి పెడుతోంది. ఇందుకోసం వచ్చే పదేళ్లలో 10,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.8.34 లక్షల కోట్లు) పైగా పెట్టుబడులు పెట్టనుంది. క్రిసిల్ నిర్వహించిన ఒక సదస్సులో అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతం అదానీ ఈ విషయం వెల్లడించారు. హరిత ఇంధన ఉత్పత్తికి అవసరమైన యంత్రాల తయారీతో పాటు, వాటి నుంచి విద్యుత్ ఉత్పత్తి వరకు ఈ పెట్టుబడుల్లో భాగమన్నారు. సౌర, పవన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్యానల్స్, టర్బైన్లు, హరిత ఉదజని తయారీకి అవసరమైన ఎలక్ట్రోలైజర్లనూ అదానీ గ్రూప్ తయారు చేయనుంది.

'లక్ష' కోట్ల డాలర్ల అవకాశం: పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన ప్రాజెక్టులతో పాటు డిజిటల్ మౌలిక సదుపాయాల్లో కీలకమైన డేటా కేంద్రాలపైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు అదానీ తెలిపారు. ఈ రెండు రంగాల్లోనే దేశంలో లక్ష కోట్ల డాలర్లకు పైగా వ్యాపార అవకాశం ఉందన్నారు. పునరుత్పాదక, ప్రత్యామ్నాయ ఇంధన ప్రాజెక్టుల్లో భాగంగా గుజరాత్‌లోని కచ్ జిల్లాలో 30,000 మెగావాట్ల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచంలోనే అతి పెద్ద పార్కు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యం 2030 నాటికి 50,000 మెగావాట్లకు చేరుతుందన్నారు.

స్టార్టప్స్ కోసం రామ్‌ఇన్ఫో ఇన్నోవేషన్ సెంటర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : స్టార్టప్స్ కోసం ప్రత్యేకంగా ఇన్నోవేషన్ సెంటర్లను ప్రారంభించినట్లు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న రామ్‌ఇన్ఫో లిమిటెడ్ ప్రకటించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఒకటి, అమెరికాలో రెండు సెంటర్లు ఏర్పాటు చేసినట్లు కంపెనీ ఎండీ ఎల్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు సాఫ్ట్‌వేర్ సర్వీసులు అందిస్తూ వస్తున్న తమ కంపెనీ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కొత్త విభాగాల్లోకి ప్రవేశించిందని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా సరికొత్త టెక్నాలజీలైన కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ సర్వీసెస్‌లోకి ప్రవేశించినట్లు తెలిపారు. కాగా స్టార్టప్‌ల కోసం ఏర్పాటు చేసిన ఇన్నోవేషన్ సెంటర్ల ద్వారా వారికి అవసరమైన తోడ్పాటును అందించనున్నట్లు శ్రీనాథ్ వెల్లడించారు. టెక్నాలజీపరమైన అంశాలతో పాటు ఫైనాన్సింగ్, మార్కెటింగ్ వంటి సేవలను ఆఫర్ చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే కొన్ని స్టార్టప్స్‌కు ఈ తరహా సేవలను అందించామన్నారు. అమెరికాలో ఏర్పాటు చేసిన సెంటర్ల కోసం అక్కడి ప్రముఖ యూనివర్సిటీలతో జట్టు కట్టినట్లు చెప్పారు. కాగా కంపెనీ దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో ప్రభుత్వ, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, అనలిటిక్స్, ఇంజనీరింగ్ సర్వీస్‌ల్లో సేవలందిస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ-సేవ, మీ-సేవ, సువిధ వంటి సర్వీసులను రామ్‌ఇన్ఫో అందిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.1,100 కోట్ల రెవెన్యూను ఆర్జించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

గ్లాండ్ ఫార్మాలో 6 శాతం వాటా విక్రయించిన ఫోసున్ ఫార్మా

న్యూఢిల్లీ: గ్లాండ్ ఫార్మాలో 6 శాతం వాటాలను ప్రమోటింగ్ కంపెనీల్లో ఒకటైన ఫోసున్ ఫార్మా విక్రయించింది. ఓపెన్ మార్కెట్ ద్వారా జరిగిన ఈ లావాదేవీ విలువ రూ.1754 కోట్లు. చైనాకు చెందిన ఫోసున్ ఫార్మా హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న గ్లాండ్ ఫార్మాలో తన అనుబంధ సంస్థ ఫోసున్ ఫార్మా ఇండస్ట్రియల్ పిటీఈ ద్వారా ఈ బల్క్ డీల్ నిర్వహించినట్టు బీఎస్ఈకి పంపిన నివేదికలో తెలిపింది. ఈ డీల్‌లో భాగంగా 6 శాతం వాటాతో సమానమైన 99 లక్షల షేర్లను ఒక్కో షేరు రూ.1771.81 సగటు ధరకు విక్రయించినట్టు పేర్కొంది. ఈ విక్రయం అనంతరం గ్లాండ్ ఫార్మాలో ఫోసున్ ఫార్మా వాటా 51.86 శాతానికి తగ్గింది. మరోపక్క గ్లాండ్ ఫార్మాలో యూబీఎస్ ప్రిన్సిపల్ కేపిటల్ ఏషియా 8.25 లక్షల షేర్లను (0.5 శాతం) కొనుగోలు చేసింది. ఒక్కో షేరు రూ.1771.05 సగటు ధరకు కొనుగోలు చేయగా మొత్తం డీల్ విలువ రూ.146.11 కోట్లయింది.

సెన్సెక్స్ కొత్త రికార్డు

ముంబై: తీవ్ర ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో బుధవారం సెన్సెక్స్ మరో జీవితకాల గరిష్ఠ స్థాయిలో ముగియగా నిఫ్టీ మాత్రం ఆల్‌టైమ్ హై నుంచి దిగజారింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, యంత్రపరికరాలు, ఎనర్జీ షేర్లలో లాభాల స్వీకారం మార్కెట్ లాభాలను కుదించేసింది. వరుసగా ఐదో సెషన్‌లో కూడా లాభపడిన సెన్సెక్స్ ఇంట్రాడేలో 550.49 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠస్థాయి 77851.63 పాయింట్లకు దూసుకుపోయినా చివరికి 36.45 పాయింట్లకే లాభం పరిమితం చేసుకుని మరో రికార్డు స్థాయి 77337.59 వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ ఇంట్రాడేలో 106.10 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయి 23664 పాయింట్లను తాకినా చివరికి లాభాన్ని 41.90 పాయింట్లకే పరిమితం చేసుకుని 23516 వద్ద ముగిసింది.

ఇండస్ టవర్స్‌లో 18 శాతం వాటాలు విక్రయించిన వొడాఫోన్: వొడాఫోన్ బుధవారం ఇండస్ టవర్స్‌లో 18 శాతం వాటాలను 170 కోట్ల యూరోలకు (రూ.15,300 కోట్లు) విక్రయించింది. దేశంలో వొడాఫోన్ ఆస్తులు తాకట్టు పెట్టి తీసుకున్న 180 కోట్ల విలువ గల బ్యాంకు రుణాల చెల్లింపునకు ఈ విక్రయం ద్వారా సమకూరిన నిధుల్లో అధిక శాతం వినియోగిస్తుంది. యాక్సిలరేటెడ్ బుక్ బిల్ట్ విధానంలో ఇండస్ ఇండ్‌లో 48.47 కోట్ల వాటాలు విక్రయించినట్టు కంపెనీ ప్రకటించింది.

వడ్డీ ఆదాయంపై పన్ను భారం తగ్గించాలి

ఎస్‌బీఐ ఛైర్మన్

న్యూఢిల్లీ: కనీసం వచ్చే కేంద్ర బడ్జెట్‌లోనైనా వడ్డీ ఆదాయంపై పన్ను భారం తగ్గించాలని ఎస్‌బీఐ ఛైర్మన్ దినేశ్ ఖారా కోరారు. అపుడు డిపాజిట్లు పెరిగి, బ్యాంకులు ప్రాజెక్టులకు దీర్ఘకాలిక రుణాలు ఇవ్వగలుగుతాయన్నారు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక వ్యక్తికి సేవింగ్ ఖాతా డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయం రూ.10,000 వరకు ఉంటే ఎలాంటి పన్ను ఉండదు. అదే ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వచ్చే వార్షిక వడ్డీ ఆదాయం రూ.40,000 మించితే టీడీఎస్ పడుతుంది.

ఐపీపీబీ నుంచి మనీ రెమిటెన్స్ సేవలు

న్యూఢిల్లీ: ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) విదేశాల నుంచి దేశంలోని ప్రజలకు మనీ ట్రాన్స్‌ఫర్ (రెమిటెన్స్) సేవలు ప్రారంభించింది. యూరోనెట్‌కి చెందిన 'రియా మనీ ట్రాన్స్‌ఫర్' సహకారంతో ఐపీపీబీ ఈ సేవలు మొదలు పెట్టింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,250 ▲	66,250 ▲	95,600 ▼
ముంబై	71,700 ▲	65,680 ▲	88,195 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



20వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	500
వరంగల్	505	గోదావరి	485
చిత్తూరు	553	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	విజయవాడ	135
వరంగల్	129	గుంటూరు	135
కరీంనగర్	129	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	140
కర్నూలు	129	నెల్లూరు	140
విశాఖపట్నం	136	అనంతపురం	135
గోదావరి	135		

వైట్‌బాల్ కెప్టెన్సీకి కేన్ గుడ్‌బై



సెంట్రల్ కాంట్రాక్ట్‌నూ వదులుకున్న విలియమ్సన్

క్రైస్ట్‌చర్చ్: టీ20 వరల్డ్‌కప్‌లో న్యూజిలాండ్ పేలవ ప్రదర్శనతో ఆ జట్టు కెప్టెన్ కేన్ విలియమ్సన్ సంచలన నిర్ణయం తీసుకొన్నాడు. పరిమిత ఓవర్ల (వైట్‌బాల్) ఫార్మాట్ సారథ్య బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్టు బుధవారం ప్రకటించాడు. అంతేకాకుండా సెంట్రల్ కాంట్రాక్ట్‌ను కూడా వదులుకున్నాడు. అయితే, ఆటగాడిగా కేన్ అన్ని ఫార్మాట్లలో అందుబాటులో ఉంటాడని న్యూజిలాండ్ క్రికెట్ తెలిపింది. 'వేసవిలో కివీస్ టీమ్ తక్కువ మ్యాచ్‌లు ఆడనుంది. దీంతో విదేశీ లీగ్‌లు ఆడడం కోసమే సెంట్రల్ కాంట్రాక్ట్ వద్దనుకొంటున్నా' అని విలియమ్సన్ పేర్కొన్నాడు. కాగా, పేసర్ లోకీ ఫెర్గూసన్ కూడా సెంట్రల్ కాంట్రాక్ట్‌ను వదులుకున్నాడు.

స్పోర్ట్స్

రాత్రి 8 గం.నుంచి హాట్‌స్టార్, స్టార్ నెట్‌వర్క్‌లో..



కోహ్లీ ఇక్కడైనా కొడతాడా?

- టీమిండియా కూర్పుపై సస్పెన్స్
- సూపర్-8లో అఫ్ఘాన్‌తో భారత్ ఢీ నేడు

బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): టీ20 వరల్డ్‌కప్ గ్రూప్ దశలో క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొన్నా.. ఎలాగోలా గట్టెక్కిన భారత జట్టుకు కఠిన పరీక్ష ఎదురుకానుంది. సూపర్-8లో భాగంగా గ్రూప్-1లో గురువారం జరిగే తమ తొలి మ్యాచ్‌లో స్ఫూర్తిదాయక ప్రదర్శన కనబరుస్తున్న అఫ్ఘానిస్థాన్.. టైటిల్ ఫేవరెట్ టీమిండియాకు సవాల్ విసిరే అవకాశం ఉంది. వేదికలు అమెరికా నుంచి వెస్టిండీస్‌కు మారడంతో.. కీలక మ్యాచ్‌లో భారత జట్టు కూర్పు ఎలా ఉంటుందనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అయితే, గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్నీ నెగ్గిన జట్టులో ఎటువంటి మార్పులూ చేయడానికి రోహిత్ ఇష్టపడడం లేదని సమాచారం. నలుగురు ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, జడేజా, అక్షర్‌లకు తుది జట్టులో చోటు కల్పించాలనుకొంటున్నాడట. ఒకవేళ స్పిన్నర్ కుల్దీప్‌ను తీసుకోవాలంటే సిరాజ్‌ను బెంచ్‌కే పరిమితం చేయాలి.

విరాట్‌పైనే అందరి దృష్టి..: కెన్సింగ్‌టన్ ఓవల్‌లో గాలులు వీస్తుండడంతో పవర్‌ప్లేలో పేసర్లు బంతిని స్వింగ్ చేసే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో కోహ్లీపైనే అందరి దృష్టి నెలకొననుంది. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన విరాట్ వరల్డ్‌కప్‌లో మాత్రం ఇప్పటి వరకు డబుల్ డిజిట్ స్కోరు చేయలేక పోయాడు. న్యూయార్క్‌లో ఎదురుదాడి చేద్దామనుకున్న అతడి వ్యూహం పని చేయలేదు. కానీ, కరీబియన్ వికెట్లపై ఆడిన అనుభవంతో కోహ్లీ చెలరేగే అవకాశం ఉంది. డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ ఫామ్‌లో ఉండడం సానుకూలమే అయినా.. భారీ షాట్లు ఆడగల దూబే, పాండ్యా బ్యాట్లు ఝుళిపించాల్సి ఉంది. బౌలింగ్ విషయానికొస్తే అర్ష్‌దీప్ మ్యాచ్ మ్యాచ్‌కు మెరుగుపడుతుండగా.. బుమ్రా ప్రత్యర్థుల పనిబడుతున్నాడు. మందకొడి వికెట్ అయితే అక్షర్, జడేజా సత్తా చాటగలరు.

సంచలనం సృష్టించాలని..: మరోవైపు ప్రత్యర్థి అఫ్ఘాన్ ఫుల్‌జోష్‌లో ఉంది. ఆఖరి గ్రూప్ మ్యాచ్‌లో వెస్టిండీస్ చేతిలో చిత్తయినా.. తొలి మూడు మ్యాచ్‌ల్లో బౌలర్లు ఆకట్టుకొనే ప్రదర్శన కనబరచారు. ఈసారి సెమీస్‌కు చేరాలనే పట్టుదలతో ఉన్నట్టు కెప్టెన్ రషీద్ చెప్పాడు. నవీనుల్, ఫజల్ బంతితో రాణిస్తుండగా.. గుర్బాజ్, జద్రాన్ బ్యాట్‌తో ఆదుకొంటున్నారు. న్యూజిలాండ్ లాంటి టీమ్‌ను ఓడించిన.. అఫ్ఘాన్ మరో సంచలనం సృష్టించాలనుకొంటోంది.



రషీద్ ఖాన్

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రిషభ్ పంత్, సూర్యకుమార్, దూబే, పాండ్యా, జడేజా, అక్షర్ పటేల్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్/కుల్దీప్.

అఫ్ఘానిస్థాన్: గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, నజీబుల్లా జద్రాన్, నబీ, కరీం జనత్, రషీద్ ఖాన్ (కెప్టెన్), గుల్బదిన్ నైబ్, ఫజల్ ఫరూకీ, నవీనుల్, నూర్ అహ్మద్.

పిచ్: మందకొడి వికెట్ స్పిన్నర్లకు అనుకూలం. అయితే, ఇక్కడ వేగంగా బౌలింగ్ చేసిన బౌలర్లకు ఎక్కువ వికెట్లు దక్కాయి. కాగా, ఇదే పిచ్‌పై ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 201 పరుగులు సాధించింది. వర్షం కురిసే అవకాశం ఉన్నా.. మ్యాచ్‌కు ఆటంకం కలిగించదని భావిస్తున్నారు.

శతక జోరు రికార్డుల హోరు



హర్మన్‌ప్రీత్ కౌర్ (103 నాటౌట్)



స్మృతి మంధాన (136)

హర్మన్‌ప్రీత్, మంధాన, వోల్వార్ట్, కాప్ సెంచరీలు

- రెండో వన్డేలోనూ దక్షిణాఫ్రికా ఓటమి
- 2-0తో సిరీస్ భారత్ కైవసం

బెంగళూరు: స్మృతి మంధాన (120 బంతుల్లో 18 ఫోర్లు, 2 సిక్సర్లతో 136) అద్భుత ఫామ్‌ను కొనసాగిస్తూ రికార్డు శతకంతో కదం తొక్కింది. ఆమెకు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ (88 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 103 నాటౌట్) మెరుపు సెంచరీ తోడవడంతో సౌతాఫ్రికాతో ఉత్కంఠభరిత రెండో వన్డేలో భారత్ 4 పరుగులతో నెగ్గింది. దాంతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే మనోళ్లు సొంతం చేసుకున్నారు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత భారత్ 50 ఓవర్లలో 325/3 స్కోరు చేసింది. కీపర్ రిచా ఘోష్ (13 బంతుల్లో 25 నాటౌట్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడింది. అనంతరం భారీ ఛేదనలో దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 321/6 స్కోరు చేసి ఓడింది. కెప్టెన్ వోల్వార్ట్ (135 నాటౌట్), కాప్ (114) సెంచరీలతో సత్తా చాటారు. హర్మన్‌ప్రీత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

వారి ఆట అదుర్స్: టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేపట్టగా..భారత్ ఇన్నింగ్స్‌లో మంధాన, హర్మన్ ఆటే హైలైట్. సౌతాఫ్రికా బౌలర్లను చెడుగుడు ఆడుకున్న వీరిద్దరూ మూడో వికెట్‌కు 171 పరుగులు (136 బంతులు) జత చేశారు. అంతకుముందు హేమలత (24)తో కలిసి మంధాన రెండో వికెట్‌కు 62 రన్స్ జోడించింది.

భయపెట్టిన వోల్వార్ట్, కాప్: ఛేదనలో సౌతాఫ్రికా 67/3 కష్టాల్లో పడగా..వోల్వార్ట్, కాప్ నాలుగో వికెట్‌కు 184 (170) పరుగులు జోడించి జట్టును విజయం అంచుల దాకా తీసుకొచ్చారు. కాప్‌ను దీప్తిశర్మ అవుట్ చేసి కీలక బ్రేక్ ఇచ్చింది. ఆఖరి ఓవర్‌లో విజయానికి సౌతాఫ్రికా 11 పరుగులు చేయాల్సిన వేళ ఉత్కంఠ పెరిగిపోయింది. కానీ వస్త్రాకర్ రెండు వరుస వికెట్లు తీసి టెన్షన్ తగ్గించింది. ఇక చివరిబంతికి సిక్సర్ కొట్టాల్సి ఉండగా వోల్వార్ట్ పరుగులేమీ చేయకపోవడంతో భారత్ గెలిచింది.

రికార్డులే రికార్డులు

- ఓ మ్యాచ్‌లో నలుగురు శతకాలు కొట్టడం మహిళల వన్డే చరిత్రలో ఇదే తొలిసారి.
- భారత మహిళల వన్డే జట్టు స్వదేశంలో 300 ప్లస్ స్కోరు చేయడం ఇదే మొదటిసారి.
- ఈ మ్యాచ్‌లో ఇరుజట్ల బ్యాటర్లు కలిసి 15 సిక్సర్లు బాదారు. దీంతో 2012లో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మహిళల జట్ల మధ్య మ్యాచ్‌లో అత్యధికంగా నమోదైన 14 సిక్సర్ల రికార్డు బద్దలైంది.
- వన్డేల్లో వరుసగా రెండు సెంచరీలు సాధించిన తొలి భారత మహిళా బ్యాటర్ మంధాన.
- మహిళల వన్డేల్లో అత్యధిక సెంచరీలు (7) చేసిన భారత బ్యాటర్‌గా మిథాలీరాజ్‌తో కలిసి సంయుక్తంగా టాప్‌లో నిలిచిన మంధాన. హర్మన్‌ప్రీత్ (6) రెండోస్థానంలో ఉంది.
- వన్డేల్లో వేగవంతమైన శతకం (87 బంతుల్లో) సాధించిన తొలి భారత మహిళా బ్యాటర్ హర్మన్‌ప్రీత్. గతంలో 90 బంతులతో తన పేరిటే ఉన్న రికార్డును హర్మన్ అధిగమించింది.
- మహిళల వన్డే మ్యాచ్‌లో అత్యధిక పరుగులు (646) నమోదవడం ఇది రెండోసారి. 2017 వరల్డ్‌కప్‌లో ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా మధ్య అత్యధికంగా 678 రన్స్ వచ్చాయి.

సంక్షిప్తస్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 325/5 (మంధాన 136, హర్మన్ నాటౌట్ 103, రిచా నాటౌట్ 25, హేమలత 24, మ్లాబా 2/51);
దక్షిణాఫ్రికా: 50 ఓవర్లలో 321/6 (వోల్వార్ట్ నాటౌట్ 135, కాప్ 114, వస్త్రాకర్ 2/54, దీప్తి శర్మ 2/56).

పోర్చుగల్ శుభారంభం

చెక్‌పై 2-1తో విజయం

యూరో కప్

లీప్‌జిగ్ (జర్మనీ): యూరో చాంపియన్‌షిప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పోర్చుగల్ శుభారంభం చేసింది. గ్రూప్-ఎఫ్‌లో భాగంగా మంగళవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1తో చెక్ రిపబ్లిక్‌పై గెలిచింది. జోడించిన సమయంలో కాన్సికావో (90+2వ నిమిషం) చేసిన గోల్‌తో పోర్చుగల్ గట్టెక్కింది. ఇదే గ్రూప్ పోరులో తుర్కియే 2-1తో జార్జియాను చిత్తుచేసింది. కాగా.. గ్రూప్-బిలో క్రొయేషియా, అల్బేనియా జట్ల మధ్య మ్యాచ్ 2-2తో డ్రాగా ముగిసింది.



ఫైనల్లో సురేఖ బృందం

అంటాల్యా (తుర్కియే): తెలుగమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-3 పోటీల్లో స్వర్ణ పతకానికి అడుగుదూరంలో నిలిచింది. మహిళల కాంపౌండ్ టీమ్‌ఈవెంట్ సెమీఫైనల్లో జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి స్వామిలతో కూడిన భారత బృందం 234-227తో ఆతిథ్య తుర్కియే జట్టును చిత్తుచేసింది. శనివారం జరిగే తుదిపోరులో ఎస్తోనియా జట్టుతో సురేఖ త్రయం తలపడనుంది.

ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు


ఇంగ్లండ్ x వెస్టిండీస్ (ఉ.6. గం.)
భారత్ x అఫ్ఘానిస్థాన్ (రా.8. గం.)

సూపర్-8లో సౌతాఫ్రికా బోణీ

18 పరుగులతో అమెరికాపై గెలుపు

నార్త్‌సౌండ్ (ఆంటిగ్వా): వరల్డ్ కప్ సూపర్-8లో దక్షిణాఫ్రికా బోణీ చేసింది. బుధవారం జరిగిన గ్రూప్-2 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 18 పరుగులతో అమెరికాను ఓడించింది. తొలుత సౌతాఫ్రికా 20 ఓవర్లలో 194/4 స్కోరు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డికాక్ (40 బంతుల్లో 7 ఫోర్లు, 5 సిక్స్‌లతో 74) మెరుపు హాఫ్ సెంచరీ చేయగా, మార్‌క్రమ్ (46), క్లాసెన్ (36 నాటౌట్), స్టబ్స్ (20 నాటౌట్) రాణించారు. భారీ ఛేదనలో అమెరికా 20 ఓవర్లలో 176/6 స్కోరే చేసి ఓడింది. ఓపెనర్ గౌస్ (47 బంతుల్లో 80 నాటౌట్) చెలరేగాడు. హర్మీత్ సింగ్ (38) సత్తా చాటాడు. రబాడ 3 వికెట్లు పడగొట్టాడు.

డికాక్ ధనాధన్: సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌లో హెన్‌డ్రిక్స్ (11) త్వరగా అవుటైనా డికాక్ బౌలర్లను బెంబేలెత్తించాడు. మార్‌క్రమ్ జతగా రెండో వికెట్‌కు 60 బంతుల్లోనే 110 రన్స్ జోడించాడు. పేసర్ జస్దీప్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో 28 రన్స్ రాబట్టాడు. మొత్తంగా పవర్ ప్లేను 64/1తో దక్షిణాఫ్రికా పటిష్ఠంగా ముగించింది. ఇక..స్పిన్నర్ హర్మీత్ బౌలింగ్‌లో ఫోర్‌తో 26 బంతుల్లో డికాక్ హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అయితే డికాక్‌ను పెవిలియన్ చేర్చిన హర్మీత్ అమెరికాకు ఊరటనిచ్చాడు. తదుపరి బంతికే మిల్లర్‌నూ హర్మీత్ అవుట్ చేశాడు. అర్ధ శతకానికి చేరువైన మార్‌క్రమ్ ఇన్నింగ్స్‌కు 15వ ఓవర్లో నేత్రావల్కర్ ముగింపు పలకగా..క్లాసెన్, స్టబ్స్ ఐదో వికెట్‌కు అభేద్యంగా 53 పరుగులు జత చేశారు.



డికాక్ (74)

1 డికాక్, మార్‌క్రమ్ 110 పరుగులే టీ20 వరల్డ్ కప్‌లో ఏ వికెట్‌కైనా సౌతాఫ్రికా తొలి సెంచరీ భాగస్వామ్యం

వణికించిన గౌస్, హర్మీత్: భారీ ఛేదనలో 76/5తో కష్టాల్లో పడ్డ అమెరికాను గౌస్, హర్మీత్ సింగ్ ఆరో వికెట్‌కు 91 పరుగులు (43 బంతుల్లో) చేసి ఆదుకున్నారు. ఎడాపెడా షాట్లు బాదుతూ సఫారీ బౌలర్లను వణికించారు. అయితే, 19వ ఓవర్లో హర్మీత్‌ను అవుట్ చేసిన రబాడ సఫారీలకు పెద్ద ఊరటనిచ్చాడు. ఈ ఓవర్లో రబాడ కేవలం రెండు పరుగులే ఇవ్వడం విశేషం.

సంక్షిప్తస్కోర్లు:

దక్షిణాఫ్రికా: 20 ఓవర్లలో 194/4 (డికాక్ 74, మార్‌క్రమ్ 46, క్లాసెన్ నాటౌట్ 36, నేత్రావల్కర్ 2/21, హర్మీత్ 2/24); **అమెరికా:** 20 ఓవర్లలో 176/6 (గౌస్ నాటౌట్ 80, హర్మీత్ 38, రబాడ 3/18).

గ్రూపు-4 సర్టిఫికెట్ వెరిఫికేషన్ నేటి నుంచి!

» ఆగస్టు 21 వరకు కొనసాగనున్న ప్రక్రియ

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రూపు-4 పోస్టుల భర్తీలో భాగంగా ఈ నెల 20 నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లను తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ (టీపీఎస్సీ) అధికారులు పూర్తి చేశారు. ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఆగస్టు 21 వరకు కొనసాగనుంది. రాష్ట్రంలో 8,180 గ్రూపు-4 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే పరీక్షలను నిర్వహించి, వాటి ఫలితాలను కూడా ప్రకటించారు. ఎంపిక చేసిన అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను కూడా నమోదు చేసుకున్నారు. ఈ పోస్టుల భర్తీలో భాగంగా గురువారం నాటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ప్రారంభించనున్నారు. నాంపల్లిలోని టీపీఎస్సీ కార్యాలయంతో పాటు పబ్లిక్ గార్డెన్స్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోనూ ఈ సర్టిఫికెట్ల పరిశీలన జరగనుంది. నిర్దేశిత తేదీల్లో రోజుకు రెండు సెషన్లలో చేపట్టే ఈ సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఎంపికైన అభ్యర్థుల హాల్‌టికెట్ల నంబర్ల వారీగా జాబితాలను విడుదల చేశారు. ఎవరైనా అనివార్య కారణాల వల్ల ఈ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు గైరాజరైతే.. వారి సర్టిఫికెట్లను ఆగస్టు 24, 27, 28, 29, 31 తేదీల్లో పరిశీలిస్తారు. ఆగస్టు 31న సాయంత్రం 5గంటల తర్వాత వెరిఫికేషన్‌కు అనుమతించబోమని అధికారులు ప్రకటించారు.

భూదాన భూమిలోని గుడిసెలను కూల్చొద్దు

» సీఎం రేవంత్ రెడ్డిని కోరిన సీపీఐ నాయకులు

హైదరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని రావి నారాయణ రెడ్డి కాలనీలో భూదాన భూమిలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను కూల్చొద్దని సీఎం రేవంత్ రెడ్డిని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. అక్కడ 8 వేల గుడిసెలు ఉన్నాయని, సుమారు 400 మంది విద్యార్థులు అక్కడి నుంచి పాఠశాలకు వెళ్తున్నారని సీఎంకు వివరించారు. గుడిసెలు వేసుకున్న వారికి న్యాయం చేయాలని సీపీఐ నేతలు కోరారు. విద్యుత్తు, తాగునీరు, రహదారులు వంటి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించిన సీఎం.. గుడిసెవాసులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు సీపీఐ నాయకులు తెలిపారు.

డిజిటల్ బోధనకు సిద్ధమైన టి-శాట్

తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సు కింద డిజిటల్ పాఠ్యాంశాలను బోధించేందుకు టి-శాట్ సిద్ధమైంది. జూన్ 20 నుంచి 30 వరకు 9 రోజుల పాటు టి-శాట్ విద్య చానెల్ ద్వారా పాఠ్యాంశాలను ప్రసారం చేయనున్నట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్రిడ్జ్ కోర్సు కింద ఈ ప్రసారాలను చేయనున్నట్లు సీఈవో స్పష్టం చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4:05 గంటల వరకు ప్రసారాలు కొనసాగనున్నాయి.

రీయింబర్స్ నిధులను విడుదల చేయాలి

» ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్

కవాడిగూడ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేసి రాష్ట్ర ప్రభుత్వం పేద మధ్యతరగతి విద్యార్థులకు చేయూతనివ్వాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ప్రతినిధులు డిమాండ్ చేశారు. మూడు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పెండింగ్‌లో ఉండటం వల్ల కళాశాలల యాజమాన్యాలు అనేక ఇబ్బందులకు గురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన దీక్షను చేపట్టారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, యాద రామకృష్ణ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా బకాయిలు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు, విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఏవిధంగా ఆదుకుంటున్నారో, అదేవిధంగా తమ కళాశాలలో చదువుతున్న రైతుబిడ్డలను కూడా ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో లోక్‌సభ సీట్లెందుకు తగ్గాయ్..!?

» నిజనిర్ధారణ కమిటీని నియమించిన ఏఐసీసీ

హైదరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్‌కు అంచనాల కంటే తక్కువ సీట్లు రావడానికి గల కారణాలను విశ్లేషించేందుకు నిజనిర్ధారణ కమిటీని ఏఐసీసీ నియమించింది. పార్టీ జాతీయ నాయకులు పీజే కురియన్, రఖిబుల్ హుసేన్, పర్గత్‌సింగ్‌లను ఈ కమిటీలో సభ్యులుగా నియమించింది. గడిచిన లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిసా, కర్నాటక, తెలంగాణ, ఢిల్లీ, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో పార్టీ పనితీరు పేలవంగా ఉందని ఇటీవల జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో నిర్ధారణకు వచ్చారు. ఈ పేలవమైన పనితీరు పట్ల ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో వైఫల్యానికి గల కారణాలను ఆరా తీసేందుకు నిజనిర్ధారణ కమిటీలను నియమిస్తూ బుధవారంనాడు ఏఐసీసీ ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగానే తెలంగాణకు సైతం త్రిసభ్య కమిటీని నియమించింది. వాస్తవానికి తెలంగాణలో 14 సీట్ల వరకూ వస్తాయని ఏఐసీసీ పెద్దలు అంచనా వేశారు. అయితే లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లను దక్కించుకున్న టీ కాంగ్రెస్.. అంచనాలను అందుకోలేక పోయింది. అయితే బీఆర్ఎస్.. వివిధ నియోజక వర్గాల్లో తన ఓటు బ్యాంకును భారీ ఎత్తున బీజేపీకి బదిలీ చేసిందని, అందుకే ఈ మేరకు ఫలితాలు వచ్చాయని అధిష్ఠానానికి రాష్ట్ర నాయకత్వం వివరణ ఇచ్చింది. అయితే, పార్టీ సంప్రదాయం ప్రకారం నిజానిజాలను తేల్చేందుకు కమిటీలను ఏఐసీసీ నియమించింది.

సోమ్ డిస్టిలరీస్ లైసెన్స్ రద్దు

» బాలలతో పని చేయిస్తుండడంతో ఎంపీ ప్రభుత్వ నిర్ణయం


మద్యం తయారీ సంస్థ సోమ్ డిస్టిలరీస్‌కు జారీ చేసిన లైసెన్స్‌ను మధ్యప్రదేశ్ ప్రభుత్వం బుధవారం రద్దు చేసింది. మధ్యప్రదేశ్‌లోని రాయసన్ జిల్లాలో ఆ సంస్థకు చెందిన యూనిట్‌లో ఇటీవల తనిఖీలు చేసిన నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్(ఎన్‌సీపీసీఆర్) ప్రతినిధులు 58 మంది బాలకార్మికులను గుర్తించారు. మద్యం తయారీకి బాలలను వినియోగిస్తుండడంతో ఆ సంస్థ లైసెన్స్‌ను అక్కడి ప్రభుత్వం రద్దు చేసింది. కాగా, తెలంగాణ ప్రభుత్వం కూడా ఇటీవల సోమ్ డిస్టిలరీస్‌తో ఒప్పందం చేసుకుంది. అయితే, ఆ కంపెనీ మద్యం తాగి మధ్యప్రదేశ్‌లో 25 మంది ప్రాణాలు కోల్పోయారనే విషయాన్ని ప్రతిపక్షాలు బయటికి తేవడంతో ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేసింది.

పీజేటీఎస్ఏయూ కలుపు యాజమాన్య విభాగానికి అవార్డు

» అవార్డును స్వీకరించిన శాస్త్రవేత్తలు రామ్ ప్రకాశ్, పద్మజ

రాజేంద్రనగర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): దేశంలోనే అత్యుత్తమ పరిశోధనలు నిర్వహించినందుకు గాను ఆచార్య జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని కలుపు యాజమాన్య విభాగం జాతీయ అవార్డును దక్కించుకుంది. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరుగుతున్న అఖిల భారత కలుపు యాజమాన్య సంస్థ వార్షిక సమావేశాల్లో 2023-24 సంవత్సరానికి గాను హైదరాబాద్ కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ టి.రామ్‌ప్రకాశ్, డాక్టర్ టి.పద్మజలు బుధవారం ఈ అవార్డును అందుకున్నారు.

అనారోగ్యంతో శిరీష్ భరద్వాజ్ కన్నుమూత



హైదరాబాద్, జూన్ 19: సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు శిరీష్ భరద్వాజ్ (39) అనారోగ్యంతో మంగళవారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో కన్నుమూశారు. ఊపిరితిత్తులు పాడవడంతో కొన్నాళ్లుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 2007లో ఓ ప్రముఖ నటుడి కుమార్తెను ప్రేమ వివాహం చేసుకుని.. అప్పట్లో ఆయన వార్తల్లో నిలిచారు. ఒక పాప పుట్టాక 2014లో వారిద్దరూ విడిపోయారు. ఆ తర్వాత డాక్టర్ విహనను వివాహం చేసుకున్న శిరీష్.. కొంతకాలంగా చెన్నైలో ఉంటున్నట్టు సమాచారం. కొన్నాళ్ల క్రితం ఆయన బీజేపీలో చేరినా క్రియాశీలంగా లేరు.

సింగరేణిని ప్రైవేటీకరించం

(మొదటిపేజీ తరువాయి)

పెకిలించివేస్తామని తెలిపారు. 'సింగరేణిలో రాష్ట్రం వాటా 51 శాతం. కేంద్రం వాటా 49 శాతం మాత్రమే. అలాంటప్పుడు సింగరేణిని కేంద్రం ఎలా ప్రైవేటుపరం చేస్తుంది? సింగరేణి ప్రైవేటీకరణ అనేది పచ్చి అబద్ధం. కేసీఆర్ ఆడిన డ్రామా. గత పదేళ్లలో దేశంలో ఒక్క బొగ్గు గనినైనా ప్రైవేటీకరణ చేశామా? అలాంటప్పుడు సింగరేణిని ప్రైవేటుపరం చేస్తామనడం పెద్ద జోక్ అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సింగరేణిలో ఒకప్పుడు సుమారు 60 వేల మంది కార్మికులు ఉండేవారని, కానీ ఆ సంఖ్య ఇప్పుడు 39 వేలకు పడిపోయిందన్నారు. కేసీఆర్ తీరుతో సింగరేణి ఎంతో నష్టపోయిందన్నారు. ఉద్యోగాలను భర్తీ చేస్తే వేతనాలు ఎక్కువ ఇవ్వాల్సి వస్తుందని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగులను తీసుకున్నారన్నారు. బొగ్గు గనుల వేలం ద్వారా ఉత్పత్తి పెరుగుతుందని, తద్వారా వేల ఉద్యోగాలు సృష్టించవచ్చని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా కొన్నిచోట్ల బొగ్గు నిల్వలు ఉన్నట్టు తెలిసిందని, వాటిని గుర్తించి వెలికితీస్తామన్నారు.

కేసీఆర్ తీరుతో తెలంగాణకు వేల కోట్ల నష్టం

కేసీఆర్ తీరువల్ల తెలంగాణ ఆర్థికంగా ఎంతో నష్టపోయిందని కిషన్ రెడ్డి తెలిపారు. 'గనుల వేలం అనేది రాష్ట్రాలకే లాభం. కేంద్రానికి ఒనగూరే ప్రయోజనమేమీ లేదు. గనుల వేలంతో ఒక్క ఒడిశా రాష్ట్ర ప్రభుత్వానికే సంవత్సరానికి సుమారు రూ.36 వేల కోట్ల ఆదాయం వస్తుంది. తెలంగాణలో పదేళ్ల గనుల వేలాన్ని కేసీఆర్ అడ్డుకోవడం వల్ల ఎన్ని వేల కోట్లు నష్టం వాటిల్లి ఉంటుంది? అయితే, తెలంగాణలో ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గనుల వేలంపై ఆసక్తితో ఉంది. నేను కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణలో తొమ్మిది గనులకు వేలం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశాం. ఈ నెల 21న తెలంగాణ వేదికగా దేశంలోని 60 బొగ్గు బ్లాకుల వేలం పాట నిర్వహిస్తున్నాం. తొలిసారిగా తెలంగాణలో ఒక బొగ్గు బ్లాకు కోసం వేలం పాట నిర్వహించబోతున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. గతంలో బొగ్గు బ్లాకులను తమకు ఇష్టం వచ్చిన నాయకులకు యథేచ్ఛగా కట్టబెట్టేవారని, దీని వల్ల రాష్ట్రాలకు నష్టం వాటిల్లేదన్నారు. ఇప్పుడు బహిరంగ వేలం పాట వల్ల ఎవరు ఎక్కువ మొత్తానికి పాట పాడితే వారికే అప్పగిస్తున్నామన్నారు.

బయ్యారంలో నాణ్యమైన ఉక్కు లేదు

మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో నాణ్యమైన ఉక్కు లేదని ఇప్పటికే తెలిసిందని కిషన్ రెడ్డి తెలిపారు. బయ్యారం ఉక్కు కర్మాగారం విషయంలో కేంద్రం నిబద్ధతతో ఉందని చెప్పారు. అందుకే కేంద్రం మూడు, నాలుగు కమిటీలు వేసిందని, అవన్నీ ఐరన్ ఓర్ నాణ్యంగా లేదని చెప్పాయని గుర్తు చేశారు. దేశంలో ఇప్పటికే అనేక కర్మాగారాలు మూతపడ్డాయని, బయ్యారంలో ఉక్కు పరిశ్రమను స్థాపించినా అదే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమను కేంద్రం కట్టడం లేదని, రాష్ట్ర ప్రభుత్వమే ముందుకొచ్చి కడుతుందని 2018



ఎన్నికల సమయంలో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. మరి ఆయన ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. బయ్యారం ఉక్కుపై సమగ్ర నివేదిక కావాలని అడిగానని, దీనిపై మరింత లోతుగా అధ్యయనం చేస్తానని కిషన్ రెడ్డి తెలిపారు.

సీబీఐ లేదా హైకోర్టు జడ్జితో విచారణ

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ అనేది చాలా పెద్ద విషయమని, దీనిపై సీబీఐ లేదా హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. 'ఫోన్ ట్యాపింగ్ నేరం చేసిందే రాష్ట్ర పోలీసులు. మళ్లీ వారికే కేసు విచారణను అప్పగించడం ఏమిటి? దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతుందని ఎలా నమ్మాలి? చివరికి జడ్జిల ఫోన్లను కూడా వదల్లేదు. వ్యాపారవేత్తల ఫోన్లూ ట్యాప్ చేశారు. వాళ్ల వ్యక్తిగత విషయాలు తెలుసుకుని బ్లాక్ మెయిల్ చేసి కోట్లు వసూలు చేశారు. హరీశ్‌రావు అంతా ఫేస్‌టైమ్‌లోనే ఫోన్లు మాట్లాడారు. ఆయన ఫోన్‌నూ ట్యాప్ చేశారనడానికి అదే నిదర్శనమ'ని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

నయీం ఆస్తులు ఏమయ్యాయి?

బీఆర్ఎస్ పాలనలో నయీం ఎన్‌కౌంటర్ జరిగిందని, ఆ తర్వాత అతని ఆస్తులు ఏమయ్యాయనే విషయంలో అనేక ఆరోపణలు వచ్చాయని కిషన్ రెడ్డి తెలిపారు. 'నయీం ఆస్తులు ఏమయ్యాయో చెప్పడం లేదు. చివరికి కాంగ్రెస్ పార్టీ కూడా ఆ లెక్కలన్నీ బయటికి తీస్తామని చెప్పింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోవడం లేదు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయిస్తే ఎన్నో నిజాలు బయటికి వస్తాయి. మేడిగడ్డ విషయంలో తాత్సారం జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టుపైనా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. విద్యుత్ కుంభకోణం విషయంలో నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలి. పూర్తి నిజాలు బయటికి రావాలి. దోషులు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలి. బీఆర్ఎస్ కథ ముగిసిపోయింది. తెలంగాణకు బీఆర్ఎస్ అవసరం లేదని ప్రజలు నిర్ణయించేశారు. పార్లమెంటు ఎన్నికల్లో దానిని ఖరారు చేసేశారు. భవిష్యత్తులో తెలంగాణలో మాకు కాంగ్రెస్‌తోనే పోటీ' అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదు

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఇప్పట్లో జరగదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ప్లాంట్ రేపో ఎల్లుండో ప్రైవేటుపరం అవుతుందనేది అసత్య ప్రచారమని కొట్టిపారేశారు. ఈ ఫైల్ ఇంకా ముందుకు కదల్లేదని చెప్పారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి క్యాపిటల్ మైన్స్ అవసరమని, దీని గురించి చర్చించి సరైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పోలవరం నిర్మాణం ఇప్పటికే పూర్తి కావాల్సి ఉందని, కానీ జగన్ నిర్లక్ష్యంతో పూర్తి కాలేదన్నారు. ఎన్డీయే హయాంలో పోలవరాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. ఏపీ ఎన్నికల్లో ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని, ఆ నమ్మకాన్ని అక్కడి ఎన్డీయే ప్రభుత్వం నిలబెడుతుందని చెప్పారు.

ఈటలను నియమిస్తే స్వాగతిస్తా

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలనేది పూర్తిగా అధిష్ఠానం పరిధిలోని విషయమని కిషన్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే నాలుగు సార్లు రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశానని గుర్తుచేశారు. కొత్త అధ్యక్షుడిగా ఎవర్ని నియమించినా మంచిదేనని చెప్పారు. ఈటల రాజేందర్‌ను నియమిస్తే స్వాగతిస్తానన్నారు. ఆర్టికల్ 370 రద్దుకు ముందే జమ్మూ కశ్మీర్ వెళ్లి ఎక్కువ సమయం అక్కడే ఉన్నానన్నారు. ప్రజల అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? అసాంఘిక శక్తులను ఎలా అడ్డుకోవాలి? అల్లర్లు జరగకుండా ఏం చేయాలి? వంటి అంశాలను తానే పర్యవేక్షించానని చెప్పారు.

'సెల్యూట్ తెలంగాణ' ర్యాలీ!

నేడు కిషన్‌రెడ్డి, సంజయ్‌కు బీజేపీ శ్రేణుల స్వాగతం

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి హైదరాబాద్ వస్తున్న గంగాపురం కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు పార్టీ రాష్ట్ర నాయకత్వం ఘన స్వాగతం పలకనుంది. బేగంపేట విమానాశ్రయం నుంచి నాంపల్లిలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయం వరకు 'సెల్యూట్ తెలంగాణ' పేరుతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు బేగంపేటలో ర్యాలీ ప్రారంభమై.. రసూల్‌పురా, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, వైఎంసీఏ, బషీర్‌బాగ్ ఫ్లైఓవర్, ఆబిడ్స్ సర్కిల్, నాంపల్లి రైల్వే స్టేషన్ మీదుగా పార్టీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకుంటుంది. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, ఎం.రఘునందన్‌రావు, నగేశ్, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను కూడా సన్మానించనున్నారు. అనంతరం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పాత బస్తీలోని భాగ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



కొండగట్టు ఆలయంలో కేంద్రమంత్రి బండి సంజయ్ పూజలు

కరీంనగర్‌కు ప్రణమిల్లిన సంజయ్

(మొదటిపేజీ తరువాయి)

నమస్కారం చేసిన తర్వాత ఆయన భారీ ర్యాలీతో ముందుకు కదిలారు. అనంతరం ఇంట్లో సతీమణి హారతి పట్టగా, వదినలు తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. అమ్మ ఆశీస్సులు తీసుకుని, తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలు, నాయకులతో మాట్లాడారు. అంతకుముందు మహాశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన తర్వాత సంజయ్ విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ మూర్ఖపు పాలనపై పోరాడితే తనతో పాటు కార్యకర్తలు లాఠీ దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లారని చెప్పారు. ప్రజా సంగ్రామ యాత్రలో తనతో కలిసి 155 రోజుల పాటు 1600 కిలోమీటర్ల పాదయాత్రలో పాల్గొన్నారని గుర్తుచేశారు.పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్తా కష్టపడ్డారని, వారి శ్రమతోనే తనకు కేంద్ర మంత్రి పదవి దక్కిందని తెలిపారు. కేంద్ర మంత్రి పదవి కరీంనగర్ ప్రజలు, కార్యకర్తలు పెట్టిన భిక్షేనని.. వారికే ఈ పదవిని అంకితం ఇస్తున్నానని చెప్పారు. కరీంనగర్ ప్రజలకు, తెలంగాణ రాష్ట్రానికి సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రిగా ఎదగడం కేవలం బీజేపీ వల్లే సాధ్యమైందని చెప్పారు. అనంతరం ఆయన జగిత్యాల జిల్లా కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లిన సంజయ్.. స్వామిని దర్శించుకున్నారు. ఎన్నికల ముందు గెలుపు కోసం కట్టిన ముడుపు విప్పి పూజలు చేశారు. కొండగట్టు అభివృద్ధికి గత పాలకులు సహకరించకలేదన్నారు. కొండగట్టు అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని తెలిపారు. బుధవార రాత్రి సంజయ్ వేములవాడ రాజన్న ఆలయంలో కోడె మొక్కును చెల్లించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేములవాడ ఆలయ అభివృద్ధి పేరుతో కేసీఆర్ దేవుడికే శఠగోపం పెట్టారని ఆరోపించారు. ఆలయ అభివృద్ధికి రూ.400 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చి, దేవుడికే శఠగోపం పెట్టిన మూర్ఖపు ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుందని చెప్పారు. కేంద్ర మంత్రిగా శక్తివంచన లేకుండా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

శంషాబాద్‌లో ఘన స్వాగతం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న సంజయ్‌కు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. దేశంలో శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. 2028లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా అధికారం లోకి వస్తుందన్నారు. అనంతరం కరీంనగర్ వెళ్తుండగా సిద్దిపేట జిల్లాలో కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

జీరో ఎందుకయ్యాం?

(మొదటిపేజీ తరువాయి)

చేయాలన్న దానిపై కేసీఆర్ సమీక్షించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. త్వరలో జరగనున్న సర్పంచ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ వంటి స్థానిక సంస్థల ఎన్నికల కోసం సంసిద్ధత.. పార్టీ వ్యూహాలపై కూడా నేతలతో ఆయన చర్చించనున్నట్లు సమాచారం.

పార్టీ సంస్థాగత మార్పులపై దృష్టి

విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ సంస్థాగత మార్పులపై కూడా అధినేత కేసీఆర్ చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి ముందు గానీ, తర్వాత గానీ అంతర్గతంగా మార్పులు జరగొచ్చని బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత ఓటమికి గల కారణాలను సమీక్షించుకోవడం తోపాటు.. క్షేత్రస్థాయి పరిస్థితులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించేందుకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ముఖ్యనేత హరీశ్‌రావు ఆధ్వర్యంలో అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా సమీక్షలు జరిపారు. గ్రామ స్థాయి, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పార్టీకి కమిటీలు ఏర్పాటు చేయాలని, ఏళ్లతరబడి పార్టీకోసం పనిచేస్తున్న వారిని గుర్తించాలని ఆయా నియోజకవర్గాలకు చెందిన ముఖ్య కార్యకర్తలు తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో బహిరంగంగానే చెప్పారు. ఈ నేపథ్యంలో పార్టీ సంస్థాగత మార్పులపై దృష్టి సారించే అవకాశమున్నట్లు తెలుస్తోంది.

నేడు హైదరాబాద్‌కు కేసీఆర్..

గత కొద్దిరోజులుగా ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ గురువారం హైదరాబాద్‌కు రానున్నారు. ఇటీవల మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు శంకర్‌యాదవ్ మృతి చెందిన విషయం తెలిసిందే. నేడు శంకర్‌యాదవ్ దశదిన కర్మ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో తలసాని కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. ఆ తర్వాత నందినగర్‌లోని తన నివాసానికి చేరుకుని పార్టీ నేతలను కలవనున్నారు.

కాంగ్రెస్ పాలనలో భద్రత ప్రశ్నార్థకం:హరీశ్

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో శాంతిభద్రతలు లోపించాయని.. వరుసగా జరుగుతున్న హత్యలు, అత్యాచారాలు, హింసాత్మక ఘటనలే ఇందుకు నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. గత పదేళ్లలో శాంతిభద్రతలకు చిరునామాగా మారిన తెలంగాణలో, కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఆరునెలల్లో భద్రత ప్రశ్నార్థకంగా మారడం బాధాకరమని బుధవారం ట్విటర్‌లో ఆయన పేర్కొన్నారు. గడిచిన వారం రోజుల్లో నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో అందరూ చూస్తుండగా సంజీవ్ అనే వ్యక్తిని కర్రలతో కొట్టి చంపారని, ఇదే విధంగా హైదరాబాద్ నడిబొడ్డున బాలాపూర్‌లో సమీర్ అనే యువకుడిని దారుణంగా పొడిచి చంపారన్నారు. రక్షించాల్సిన పోలీసే, తోటి మహిళా కానిస్టేబుల్‌పై భూపాలపల్లి జిల్లాలో లైంగికదాడికి పాల్పడ్డాడని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కళ్లు తెరిచి ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలని, శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.

హిందూ మతంలో విద్వేషానికి తావులేదు

కులాన్ని వదలకుండా హిందువు కాలేరు

అనేక విలువల కలయిక హిందూమతం

రాజకీయ లబ్ధికి హిందూమతాన్ని వాడుకోవద్దు

ఆధ్యాత్మికవేత్తలు, సాధువులు, పీఠాధిపతులు



సమ్మేళనంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మికవేత్తలు, సాధువులు, పీఠాధిపతులు

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): హిందూ మతంలో విద్వేషాలకు, అసమానతలకు చోటు లేదని విభిన్న హిందూ సంస్థల ప్రతినిధులు, పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు, సాధువులు పేర్కొన్నారు. హిందూ మతం ఒక జీవన విధానం కాదని, అది విభిన్న జీవన విధానాల సహజీవన వ్యవస్థ అని తెలిపారు. మసీదులు కూల్చేవారు, పరమతాన్ని ద్వేషించేవారు, ఇతర మతాల సంస్కృతి, సంప్రదాయాలను దూషించేవారు నిజమైన హిందువులు కారంటూ పరోక్షంగా 'బీజేపీ-ఆరెస్సెస్' తీరును విమర్శించారు. 'జైశ్రీరాం' పవిత్ర నామ స్మరణను ఇతర మతస్థులను కొట్టి చంపడానికి ఉపయోగించడాన్ని తామంతా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. బహుళత్వం, కరుణ, పరిత్యాగం, సమానత్వం, వివేచన, ధిక్కారం, హేతుత్వం, ఏకాత్మ భావన తదితర మహోన్నత ఆలోచనలు, విలువల సమాహారమే హిందూ మతమని ముక్తకంఠంతో నినదించారు. సమతా ఆధ్యాత్మికమూర్తి అన్నమయ్య జయంతి సందర్భంగా 'అన్నమయ్య కళాక్షేత్రం', 'హిందూస్ ఫర్ ప్లూరాలిటీ అండ్ ఈక్వాలిటీ' సంయుక్తంగా హైదరాబాద్‌లోని బిర్లాసైన్స్ సెంటర్‌లో 'ద్వేషం, అసమానత్వానికి వ్యతిరేకంగా హిందూమతం' నినాదంతో సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నమయ్య పదకవితా వైభవం వ్యాస సంకలనం 'అందరికీ శ్రీహరే అంతరాత్మ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు దేవాలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 8వతరం మునిమనవడు వీరంభట్లయ్య, అచల తత్వయోగి దున్న ఇద్దాసు పీఠాధిపతి దున్న విశ్వాదాసు, అలేఖ మహిమా ధర్మ అవధూత వల్లభానంద మహరాజ్, దుర్గాదేవి పీఠం దత్తానంద స్వామి, బాలకృష్ణమయానంద, మల్లిసాల స్వామీజీ యోగి సిద్ధరామయ్య, అచలయోగిని మాతా నిశ్చలాంబ, ఆర్యసమాజ్ ప్రతినిధులు అరవింద శాస్త్రి, వసుధ శర్మ, ఆధ్యాత్మిక ప్రవచనకారుడు దరూరి నరసింహాచార్యులు, దేవేంద్ర, విజయేంద్ర సాధువులు, యోగి ప్రభాకర్ గురూజీ తదితరులంతా మాట్లాడారు. విశాల భావాలు కలిగిన హిందూమతాన్ని ఒక చట్రంలో ఇరికించి, దాని స్ఫూర్తిని వక్రీకరించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని అవధూత వల్లభానంద మహరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. కులాన్ని వదిలేయకుండా హిందూమతాన్ని ప్రేమించడం అసాధ్యమని సాధు త్రినాథదాస్ అభిప్రాయపడ్డారు. గోరక్షణ పేరుతో హింసాత్మక చర్యలకు పాల్పడడాన్ని ఆయన తీవ్రంగా నిరసించారు. 'ద్వేషం మతాల్లో లేదు, వాటిని స్థాపించిన మనుషుల్లో ఉంది' అని యోగి సిద్ధరామయ్య అన్నారు. విద్వేషం, అసహనం, అసమానత్వం, సంకుచిత తత్వం లాంటి అవలక్షణాలేవీ భారతీయ తాత్వికతలో లేవని, శాంతియుత సహజీవనమే హిందూ ఆచరణ అని చిలుకూరు ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్ చెప్పారు. మతం పేరుతో మనుషులను విడదీయడాన్ని ఏ ధర్మమూ అంగీకరించదని యోగి ప్రభాకర్ గురూజీ ఉద్ఘాటించారు. మతం పూర్తిగా వ్యక్తిగతమని, దాన్ని రాజకీయ లబ్ధికోసం వాడుకోవడం సరికాదని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర్‌స్వామి అన్నారు. ఇప్పటికిప్పుడు హిందూమతానికి ముప్పు వాటిల్లిందన్న ప్రచారంలో వాస్తవంలేదని, అలాంటి దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పరమత ద్వేషంతో హిందూమతాన్ని ఏకోన్ముఖత వైపు తీసుకెళ్లేందుకు సాగుతున్న కుట్రలను ఎదుర్కొనేందుకు ఈ సమ్మేళనం ద్వారా సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్లనున్నట్లు సభాధ్యక్షత వహించిన విజయవిహారం రమణమూర్తి ప్రకటించారు. "తిరుమలలో కూల్చేసిన అన్నమయ్య గృహాన్ని టీటీడీ యథాతథంగా నిర్మించాలి. హిందూ మతాన్ని రాజకీయ లబ్ధికోసం వాడకూడదు. మతంపేరుతో ద్వేషాన్ని రెచ్చగొట్టకూడదు" తదితర అంశాలపై ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

త్యాగం రాహుల్ వారసత్వం

పోరాటమే ఆయన తత్వం.. రాహుల్‌గాంధీకి సీఎం రేవంత్ జన్మదిన శుభాకాంక్షలు

» గాంధీభవన్‌లో ఘనంగా జన్మదిన వేడుకలు

» యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

» పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



గాంధీభవన్‌లో రక్తదానం చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : "అన్ని రకాల అసమానతలతో పోరాడటం ఆయన వ్యక్తిత్వం... వెనుకబడిన వారికి అండగా ఉండాలన్నది ఆయన దృక్పథం... త్యాగం ఆయన వారసత్వం... పోరాటం ఆయన తత్వం.. రేపటి కోసం భారతదేశ ఆకాంక్షలను నెరవేర్చే ఏకైక నాయకుడు.. రాహుల్‌గాంధీ" అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా బుధవారం 'ఎక్స్'లో ఈమేరకు పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు గాంధీభవన్‌లో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ శిబిరంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి రక్తదానం చేశారు. వారితో పాటు 300 మందికిపైగా తమ రక్తాన్ని దానం చేశారని శివసేనారెడ్డి వెల్లడించారు. రాహుల్ జన్మదినం సందర్భంగా ఎంపీలు మల్లు రవి, అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు కేక్‌ను కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు.

తెలంగాణ భవన్‌లో రాహుల్ జన్మదిన వేడుకలు

న్యూఢిల్లీ: రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నేతలు తెలంగాణ భవన్‌లో నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ తదితరులు కేక్ కట్ చేసి రాహుల్‌కి శుభాకాంక్షలు తెలిపారు. కాగా, పొన్నం ప్రభాకర్, వీహెచ్, మధుయాష్కీ, వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు రాహుల్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

10 వేల మంది టీచర్లకు పదోన్నతులు!

» మల్టీజోన్- 1లో 19 జిల్లాల వారికి అవకాశం

» నేటి నుంచి జోన్-2లో ఎస్ఏల బదిలీలు

హైదరాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. అందులో భాగంగా మల్టీజోన్-1లోని 19 జిల్లాల పరిధిలోని 10 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తూ అధికారులు బుధవారం ఉత్తర్వులను జారీ చేశారు. ఆయా జిల్లాల వారీగా పదోన్నతుల జాబితాలను విడుదల చేశారు. ఆ జాబితాలను అనుసరించి ఆయా జిల్లా డీఈవోలు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యా శాఖ అధికారులు ఆదేశాలిచ్చారు. పదోన్నతులు పొందిన వారిలో ఎస్‌జీటీలతో పాటు పండిట్లు, పీఈటీలు కూడా ఉన్నారు. వారికి వెంటనే పోస్టింగులు ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ప్రధానోపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను పూర్తి చేశారు. తాజాగా ఉపాధ్యాయులకు పదోన్నతులను కల్పిస్తున్నారు. గురువారం నుంచి మల్టీజోన్-2 పరిధిలోని జిల్లాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ముందుగా స్కూల్ అసిస్టెంట్ల(ఎస్ఏ)ను బదిలీ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎస్‌జీటీలకు ఎస్ఏలుగా పదోన్నతులు కల్పిస్తారు. కాగా, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు.

మంత్రులకు రేవంత్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు

» కేసీఆర్ హయాంలో లేకపోయింది: కొండా సురేఖ



ఆప్యాయంగా పలకరించుకుంటున్న కొండా సురేఖ, సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్/కొల్చారం, జూన్ 19: గత కేసీఆర్ హయాంలోని మంత్రులకు ఏ మాత్రం స్వేచ్ఛ లేకపోయిందని, ఏ చిన్న నిర్ణయం తీసుకోవాలన్న పెద్దాయన అనుమతిస్తే తప్ప సంతకం పెట్టే అవకాశం ఉండేది కాదని మంత్రి కొండా సురేఖ అన్నారు. రేవంత్‌రెడ్డి సర్కారులో మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఉందని, ఎవరి శాఖకు సంబంధించిన నిర్ణయాలు వారే తీసుకునే అవకాశం కూడా ఆయన ఇచ్చారని పేర్కొన్నారు. బుధవారం మెదక్ జిల్లా నర్సాపూర్, కొల్చారం మండలాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి సురేఖ అందజేశారు. బడిబాట కార్యక్రమంలోనూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆడపిల్లల పెళ్లిళ్లకు రూ.1,00,116తోపాటు తులం బంగారం త్వరలోనే ఇవ్వనున్నట్లు చెప్పారు. పూర్తయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను త్వరలోనే అర్హులకు అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15లోపు రైతు రుణమాఫీ కోసం రేవంత్‌రెడ్డి ఏర్పాట్లు చేస్తున్నారని, మాఫీ జరిగితే రాజీనామా చేస్తానని చెప్పిన ఎమ్మెల్యే హరీశ్‌రావు అందుకు సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి.. సురేఖ ప్యాయంగా పలకరించుకున్నారు.

ఉత్తర డిస్కమ్ డైరెక్టర్‌గా వి. ఫక్కిరిసామి

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర డిస్కమ్(తెలంగాణ ఎన్పీడీసీఎల్-వరంగల్) డైరెక్టర్‌గా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ)లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న వి.ఫక్కిరిసామిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈమేరకు ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ బుధవారం జీవో జారీ చేశారు. ప్రస్తుతం పీఎఫ్‌సీ నుంచి డైరెక్టర్‌గా సందీప్‌కుమార్ ఉండగా... ఆ స్థానంలో ఫక్కిరిసామిని నియమించారు. రెండు డిస్కమ్‌లలోనూ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్(ఈఆర్‌సీ), పీఎఫ్‌సీ నుంచి ఒక్కొక్కరిని గత ప్రభుత్వం డైరెక్టర్లుగా నియమించిన విషయం విదితమే.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పొన్నం భేటీ

న్యూఢిల్లీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డితో భేటీ అయ్యారు. కిషన్‌రెడ్డి నివాసంలో భేటీ అయిన ఆయన రాష్ట్రాభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం, కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ కార్యాలయంలో మంత్రి జయంత్ చౌధరిని మర్యాదపూర్వకంగా కలిసి దేశంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాలలో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

కరెంట్ టవర్లు వేస్తే 200 శాతం పరిహారం

» లైన్లకు 30 శాతం.. కేంద్ర మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు భూముల్లో విద్యుత్ లైన్లు/టవర్లు వేస్తున్నప్పుడు ఆ భూములకు పరిహారంపై కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ బుధవారం మార్గదర్శకాలు జారీ చేసింది. టవర్లు వేస్తే... భూమి విలువపై 200 శాతం పరిహారం, ఇక లైన్లు వెళ్తున్నప్పుడు 30 శాతం పరిహారంగా భూ యాజమానులకు చెల్లించాలని నిర్దేశించింది. అయితే 66 కేవీ, ఆ పైన సామర్థ్యం కలిగిన టవర్లు/లైన్లు వేసిన భూములకే పరిహారం చెల్లిస్తారు. 66 కేవీ లోపు భూములకు పరిహారం ఇవ్వరు.

ఆకస్మిక తనిఖీలతో హడలెత్తించిన కలెక్టర్లు

నల్లగొండ టౌన్, భద్రాచలం, ఖమ్మం కలెక్టరేట్, జూన్ 19: ఆ ముగ్గురు కలెక్టర్లు ఆకస్మిక తనిఖీలతో అధికారులు, వైద్యులను హడలెత్తించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విధుల్లో చేరిన మూడో రోజే నల్లగొండ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వార్డుల్లో రోగుల బంధువులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మేల్ సర్జికల్ వార్డులో ప్రతి పనికీ డబ్బులు అడుగుతున్నారని రోగుల సహాయకుల ఫిర్యాదుతో ఇద్దరు వార్డుబాయ్‌లను వెంటనే సస్పెండ్ చేశారు. గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించి వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి .పాటిల్ తెలిపారు. భద్రాచలంలో గిరిజన సంక్షేమశాఖ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. అనంతరం మాట్లాడుతూ వేసవి సెలవులకు వెళ్లివచ్చిన విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులను ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లు గమనిస్తూ ఉండాలన్నారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేరుగా ఓపీ విభాగానికి వెళ్లి అక్కడ రోగులతో సంభాషించారు. డాక్టర్లు బాగా చూస్తున్నారా.. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా..? అంటూ వాకబు చేశారు.

గ్రేస్ మార్కులు చట్టబద్ధమైన ఆకాంక్ష కాదు!

» అయినా పిటిషనర్ల దరఖాస్తు పరిశీలించండి

» ఎన్ఎంసీ, కాళోజీ వర్సిటీలకు హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రేస్ మార్కులు ఇవ్వాలని డిమాండ్ చేసే చట్టబద్ధమైన హక్కు పిటిషనర్లకు (ఎంబీబీఎస్ విద్యార్థులు)లేదని.. అయినా ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా వారికి గ్రేస్ మార్కులు కలిపే అంశాన్ని పరిశీలించాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ), కాళోజీ హెల్త్ వర్సిటీలకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్స్ ఆన్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్-1997 (పాత రెగ్యులేషన్స్) ప్రకారం అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించి ఒక్క సబ్జెక్టులో ఫెయిల్ అయిన విద్యార్థులకు గరిష్ఠంగా 5 గ్రేస్ మార్కులు ఇవ్వవచ్చని ఉంది. కాగా ఈ గ్రేస్ మార్కుల రెగ్యులేషన్‌ను 2023లో సవరిస్తూ దానిని తొలగించారు. 2022లో తాము ఎంబీబీఎస్‌లో చేరామని.. నూతన రెగ్యులేషన్ తీసుకురావడానికి ముందే కోర్సులో చేరిన తమకు వర్తించదని.. తమకు గ్రేస్ మార్కులు ఇచ్చేలా ఎన్ఎంసీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీలకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆర్య సహా పలువురు ఎంబీబీఎస్ విద్యార్థులు హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. వాదనలు నమోదు చేసుకున్న చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. ఏదిఏమైనా ఈ కేసులోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా గ్రేస్ మార్కులు కలిపి తమను రెండో సంవత్సరం తరగతులకు అనుమతించాలన్న పిటిషనర్ల దరఖాస్తులను పరిశీలించాలని కాళోజీ హెల్త్ వర్సిటీ తదితరులను హైకోర్టు ఆదేశించింది.

ఆద్య కళకు అరుదైన గౌరవం

ఆదివాసీ, జానపద వస్తు సంచయం పరిరక్షణకు ముందుకొచ్చిన ఐజీఎన్‌సీఏ

» ఆచార్య జయధీర్ బృందంతో ఒప్పందం

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ, గిరిజన, జానపద వస్తు సంచయానికి అరుదైన గౌరవం లభించింది. కొన్ని వందల ఏళ్లుగా విస్మరణకు లోనవుతున్న శ్రమైక జీవనం తాలూకూ ఆనవాళ్లకు ఆలవాలమైన ఆద్య కళలోని అపురూప కళాఖండాలను పరిరక్షించే బాధ్యతను న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) స్వీకరించనుంది. ఆద్య కళ వస్తు సంచయ సేకర్త ఆచార్య జయధీర్ తిరుమలరావు బృందం బుధవారం ఐజీఎన్‌సీఏ కేంద్ర కార్యాలయంలో ఆ సంస్థ సభ్య కార్యదర్శి సచ్చిదానంద జోషిని కలిసింది. ఈ సందర్భంగా కళా రంగాల చరిత్ర, కళల పరిరక్షణతో పాటు ఆదివాసీ, జానపద చిత్రాలు, పటాలను భవిష్యత్తు తరాలకు అందించేలా జాగ్రత్త చేసే బాధ్యతను స్వీకరిస్తున్నట్టు ఆద్య కళ నిర్వాహకులతో ఐజీఎన్‌సీఏ ప్రతినిధులు అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకున్నారు. గత ఏడాది ఐజీఎన్‌సీఏకు చెందిన బృందం హైదరాబాద్‌లోని ఆద్య కళలో కొలువుదీరిన కళాఖండాలు, చారిత్రక వస్తువులను సందర్శించింది. ఆ క్రమంలో వారు రూపొందించిన నివేదిక ఆధారంగా ఎంవోయూ కుదిరింది. కళల అధ్యయనం, పరిరక్షణలో భాగంగా నిపుణులను పంపి, ఆద్య కళలోని వస్తు సంచయాన్ని పరిరక్షిస్తామని జోషి తెలిపారు. అలాగే గుంజల గోండి లిపి శిక్షణా శిబిరం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటైన 'జన్‌జాతీయ దర్పణ్' ప్రదర్శనలో ఆద్య కళ సేకరించిన 170 కళాఖండాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని, అవి సందర్శకుల మన్ననలు పొందుతున్నాయని ఆద్య కళ కన్వీనర్ ప్రొఫెసర్ గూడూరు మనోజ పేర్కొన్నారు. గిరిజన, జానపద, గ్రామీణ కళలకు చేయూతనివ్వడంతో పాటు ఆద్య కళ మ్యూజియం ఏర్పాటుకు సహకరిస్తామని సీఎం రేవంత్ హామీ ఇవ్వడం శుభపరిణామమని జయధీర్ హర్షం వ్యక్తం చేశారు. ఆద్య కళ మ్యూజియం ఏర్పాటైతే ఆదివాసీ, గిరిజనులతో పాటు అనేక తెగలు, సమూహాలు, శ్రమజీవుల సంస్కృతికి గౌరవం లభించినట్లేనన్నారు. గత పదేళ్లలో సాంస్కృతికంగా కొనియాడదగిన పని ఒక్కటి కూడా జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజా సంస్కృతిని పరిరక్షించే బృహత్ కార్యాచరణను రూపొందించడంతో పాటు ఆదిశగా రేవంత్ ప్రభుత్వం అడుగులు వేయాలని ఆకాంక్షించారు.



అవగాహన ఒప్పందం సందర్భంగా ఐజీఎన్‌సీఏ సభ్య కార్యదర్శి సచ్చిదానంద జోషి, ఆచార్య జయధీర్ తిరుమలరావు తదితరులు

త్వరలో కొత్త విద్యుత్ పాలసీ!

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధిలో తెలంగాణ ప్రపంచ దేశాలతో పోటీపడుతోందని.. యావత్ ప్రపంచానికీ రాష్ట్రం పెట్టుబడుల స్వర్గధామంగా మారిందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ, వార్షిక రుణ ప్రణాళిక ఆవిష్కరణ సమావేశంలో భట్టి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బ్యాంకర్లకు సామాజిక, మానవీయ దృక్పథం ఉండాలని.. కేవలం బడా పారిశ్రామికవేత్తలకే కాక నిరుపేదలు, మధ్యతరగతి వర్గాలకు కూడా రుణాలిచ్చేందుకు బ్యాంకర్లు ముందుకు రావాలని, బలహీన వర్గాలకు విరివిగా రుణాలిస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని భట్టి స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రోత్సాహకాలు అందిస్తామని, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలకు ఎక్కువ రుణాలిస్తే అత్యధిక జనాభాకు ఉపాధి దొరుకుతుందని ఆయన పేర్కొన్నారు. రాయితీ పథకాలకు సంబంధించి ప్రభుత్వం తన వాటాను విడుదల చేస్తున్నా బ్యాంకర్లు సహకరించట్లేదని, సబ్సిడీ విడుదల చేయటంలేదని, ఈ పరిస్థితి ఎందుకు ఉత్పన్నమవుతోందో అర్థం కావట్లేదని భట్టి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రైవేటు బ్యాంకుల పురోగతి బాగుండగా, జాతీయ బ్యాంకులు వెనకంజలో ఉంటున్నాయని, శాఖలు తగ్గించడం సరైన చర్య కాదని అన్నారు. ప్రజలు ఎక్కువగా ప్రైవేటు బ్యాంకుల వైపు మొగ్గుచూపుతున్నారన్న మంత్రి.. జాతీయ, గ్రామీణ బ్యాంకులు బ్రాండ్ ఇమేజ్‌ను ప్రచారం చేసుకోవాలని సూచించారు. రుణాలు పెంచడంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని.. బ్యాంకర్లు పెద్దఎత్తున రుణాలివ్వాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని భట్టి భరోసా ఇచ్చారు.

సానుకూలత ఉండాలి..

తెలంగాణ పదేళ్ల వయస్సున్న చిన్న రాష్ట్రమని, రాష్ట్రం పట్ల బ్యాంకర్లకు సానుకూలత ఉండాలని.. రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను గుర్తించి బ్యాంకర్లు పనులు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు బ్యాంకర్లు ఇస్తున్న రుణాలు సరిపోవట్లేదని, రుణాలు అధికంగా ఇచ్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు. రాష్ట్రంలో వివిధ బ్యాంకుల శాఖలు 6,415 ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో కేవలం 1,874 శాఖలే ఉన్నాయని, వాటి సంఖ్యను పెంచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడాలని కోరారు. వ్యవసాయ రంగానికి నిరుటి కంటే రూ.13 వేల కోట్ల రుణాలు అధికంగా మంజూరుచేసినప్పటికీ అందులో చిన్న, సన్నకారు రైతుల వాటా అనుకున్నంత లేదని ఆందోళన వెలిబుచ్చారు. రాష్ట్రంలో 73.11శాతం భూములు చిన్న, సన్నకారు రైతుల ఆధీనంలోనే ఉన్నాయని.. ఆర్‌బీఐ విధించిన పరిమితికే పరిమితం కాకుండా... ఈ వర్గాలకు ఎక్కువ రుణాలు ఇవ్వాలని మంత్రి సూచించారు. వ్యవసాయరంగంలో మౌలిక వసతులకు ఇచ్చే రుణాలు 29.29 శాతమే ఉన్నాయని.. అవి 100 శాతానికి పెరగాలని అన్నారు. పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలు ప్రభుత్వానికి పక్కాగా ఇవ్వాలని, లేకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే సహాయాన్ని వారు కోల్పోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆయిల్‌పామ్ సాగుకు బ్యాంకుల నుంచి ప్రోత్సాహంలేదని తుమ్మల ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో కొత్తగా 59,261 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగులోకి తెచ్చామని, కేంద్రం రూ.221 కోట్లు రాష్ట్రానికి ఇచ్చిందని, 18,654 మంది రైతులు ఈ పంట సాగుచేస్తే... బ్యాంకర్లు 50 శాతానికంటే తక్కువ మందికే రుణాలిచ్చారని తుమ్మల ఆందోళన వ్యక్తంచేశారు. ఆయిల్‌పామ్ మొక్కలు, డ్రిప్ పై 90 శాతం సబ్సిడీ ఇస్తున్నామని.. రెండు, మూడు రోజుల్లో రూ.100.76 కోట్ల సబ్సిడీని డ్రిప్ కంపెనీలకు, రైతులకు చెల్లిస్తామని తెలిపారు. ఆహార పార్కులు, ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు ఇవ్వటంలేదని, బుగ్గపాడు ఫుడ్ పార్కుకు ఇచ్చినట్లుగా రుణాలివ్వాలని బ్యాంకర్లకు మంత్రి సూచించారు. రైతులకు ఇన్‌పుట్స్, ఫైనాన్స్ అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తుంటే.. బ్యాంకింగ్, ఫైనాన్స్ సెక్టార్‌లోని వారు ఎందుకు స్పందించటంలేదని, ఆత్మవిమర్శ చేసుకోవాలని తుమ్మల వ్యాఖ్యానించారు.



రుణప్రణాళికను విడుదల చేస్తున్న భట్టి, బ్యాంకర్ల కమిటీ ప్రతినిధి

పెరిగిన రుణప్రణాళిక..

2024-25 సంవత్సరానికిగాను బ్యాంకర్ల రుణ ప్రణాళిక అమాంతం పెరిగింది. ఈ వార్షిక సంవత్సరంలో ఏకంగా రూ.6,33,777 కోట్ల రుణాలను పంపిణీ చేస్తామని బ్యాంకర్ల కమిటీ బుధవారం విడుదలచేసిన ప్రణాళికలో వెల్లడించింది. 2023-24 రుణ ప్రణాళిక రూ.2,42,775 కోట్లు ఉండగా... ఈసారి అది ఏకంగా 161 శాతం మేర పెరిగింది. ఇందులో ప్రాధాన్య రంగాలకు రూ.2,80,551 కోట్లు, వ్యవసాయానికి రూ.1,34,138 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.28,223 కోట్లు, గృహనిర్మాణానికి రూ.10,768 కోట్లు కేటాయించారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి త్వరలోనే పదవులు

» విద్యుత్తు కొనుగోళ్లపై విచారణ చేస్తుంటే బీఆర్ఎస్ నేతలకు ఆందోళన ఎందుకు?

» మేడిగడ్డలో ఇసుక తొలగిస్తేనే మరమ్మతులు

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కష్టపడిన నాయకుల సమగ్ర సమాచారం అధిష్ఠానం వద్ద ఉందని, వారికి త్వరలోనే పదవుల పంపిణీ జరుగుతుందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తెలిపారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. విద్యుత్తు కొనుగోళ్ల అంశంపై శాసనసభలో శ్వేతపత్రం ప్రకటించినప్పుడు.. దీనిపై న్యాయ విచారణ జరగాలంటూ మాజీ విద్యుత్తుశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి సభలో పదేపదే కోరారన్నారు. ఆ నేపథ్యంలోనే విద్యుత్తు కొనుగోళ్లపైన విచారణ జరుగుతుంటే బీఆర్ఎస్ నేతలు ఎందుకు ఆందోళన చెందుతున్నారో అర్థం కావట్లేదని చెప్పారు. అంతా తానై కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కడితే.. అది కూలిపోయిందని ఎద్దేవా చేశారు. మేడిగడ్డ బరాజ్‌లో మేట వేసిన ఇసుకను తొలగిస్తేనే ప్రాజెక్టు మరమ్మతులు ప్రారంభమవుతాయని చెప్పారు. తమ ప్రభుత్వమూ అప్పులు చేస్తుందని, ఆ అప్పులతో సంపదను సృష్టించి సంక్షేమ పథకాల రూపంలో ఆ సంపదను ప్రజలకు పంచుతుందన్నారు. కేంద్ర బడ్జెట్ తర్వాతనే రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులకనుగుణంగా రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతామని చెప్పారు. రైతు రుణమాఫీ అంశానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, ఎవరికెలాంటి అనుమానాలు అవసరంలేదన్నారు. రానున్న ఐదేళ్లలో స్వయం సహాయక సంఘాలకు రూ.లక్ష కోట్ల మేరకు వడ్డీలేని రుణాలు అందజేయనున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆలోచనలు, ఆయన చూపిన మార్గాన్ని టీపీసీసీ నుంచి గ్రామస్థాయి కార్యకర్తవరకు ముందుకు తీసుకెళ్లాలన్నారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామంటూ రాహుల్ ప్రకటించారని, అధికారంలోకి రాగానే ఆ దిశగా కార్యాచరణ చేపట్టామని చెప్పారు.

వైద్య విద్యపై నేరుగా పర్యవేక్షణ

» ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు

» హెల్త్ వర్సిటీ ప్రమేయం ఉండదు

» అదనపు ఫీజులు తీసుకుంటే చర్యలు

» స్టైపెండ్ ఇవ్వకుంటే ఊరుకునేది లేదు

» ప్రైవేట్ వైద్య కాలేజీల యాజమాన్యాలతో భేటీలో మంత్రి దామోదర రాజనర్సింహ

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన వైద్య విద్యను అందించడమే లక్ష్యంగా ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటిదాకా ప్రైవేటు కాలేజీలపై హెల్త్ యూనివర్సిటీ పర్యవేక్షణ ఉండగా.. ఇక నుంచి సర్కారే పర్యవేక్షించనుంది. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. సచివాలయంలో బుధవారం ప్రైవేటు మెడికల్, డెంటల్ కళాశాలల యాజమాన్యాలు, కాలేజీల డీన్లు, ప్రిన్సిపాల్స్‌తో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్య విద్యకు తెలంగాణ బెస్ట్ డెస్టినేషన్‌గా ఉండాలని ఆకాంక్షిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీజీ విద్యార్థులకు స్టైపెండ్ ఇవ్వకుంటే ఊరుకోబోమన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యకు పూర్వ వైభవం తీసుకొస్తామని అన్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు వైద్య విద్య కళాశాలల యజమానులు, డీన్లు, ప్రిన్సిపాల్స్ సర్కారుకు పలు సూచనలు చేయగా.. మంత్రి సానుకూలంగా స్పందించారు. ఏబాస్ హాజరు విధానం అమలులో కొన్ని కాలేజీలు అవకతవకలకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని మంత్రి స్పష్టం చేశారు.

'రుణ మాఫీ'పైనే ఫోకస్

» *21న మంత్రి మండలి భేటీ*

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 21న జరగనుంది. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కానుంది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సచివాలయంలోని ఆరో అంతస్తులో ఉన్న క్యాబినెట్ మీటింగ్ హాల్‌లో సమావేశం జరుగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో పంట రుణాల మాఫీపైనే ప్రధానంగా చర్చించనున్నట్లు తెలిసింది. ఆగస్టు 15 నాటికి రుణ మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గతంలోనే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రుణమాఫీకి నిధుల సేకరణ, విధివిధానాలపై చర్చించనున్నారు. నిధుల ఆవశ్యకత దృష్ట్యా.. భూములను తనఖా పెట్టడం లేదా లీజుకు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇదే అంశాన్ని క్యాబినెట్ భేటీలో చర్చకు పెట్టి, ఆమోదం పొందనున్నట్లు తెలుస్తోంది. దీంతోపాటు 'రైతు భరోసా' పథకం, జూలైలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై చర్చ జరగనున్నట్లు సమాచారం. రాష్ట్ర సమాచార హక్కు చీఫ్ కమిషనర్, కమిషనర్ల నియామకం, వ్యవసాయ కమిషన్, విద్యా కమిషన్ల ఏర్పాటు అంశాలు చర్చకు రావొచ్చని తెలిసింది.

విపత్తుల వేళ.. పంటల బీమా!

(మొదటిపేజీ తరువాయి)



కొనసాగుతుంది. సాధారణంగా రైతులు జూన్ రెండో పక్షంలో పంటల సాగు ప్రారంభిస్తారు. ప్రకృతి విపత్తులు అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో ఎక్కువగా వస్తుంటాయి. అటువంటప్పుడు, ఇప్పుడే తొందరపడి పంటల బీమా ప్రీమియం చెల్లించకుండా... సాగును, వాతావరణ పరిస్థితులను, ప్రకృతి విపత్తులను గమనించి ప్రీమియం చెల్లించాలనే ఆలోచనకు రాష్ట్ర ప్రభుత్వం వచ్చినట్లు తెలుస్తోంది. తద్వారా ఈ నాలుగు నెలలు ఆర్థికభారాన్ని మోయాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉండదు. నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి రాష్ట్రవ్యాప్తంగా సాగవుతున్న అన్నిరకాల పంటలకు క్రాప్ ఇన్సురెన్స్ చేసేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. క్రాప్ బుకింగ్ ఇప్పటికే మొదలైంది. ఏఈవోలు పంటల నమోదు ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

పంట నష్టానికి ఎంత పరిహారం?

పంటల బీమా కంపెనీల నుంచి రాష్ట్ర ప్రభుత్వం మూడు కేటగిరీలుగా టెండర్లను పిలవనుంది. ఒక కేటగిరీలో.. రాష్ట్రవ్యాప్తంగా సాగయ్యే అన్ని పంటలకు (100%) బీమా వర్తించేలా టెండర్లు పిలుస్తారు. రెండో కేటగిరీలో.. ఎంత పంట నష్టానికి పరిహారం చెల్లిస్తారు? 60 శాతానికా? 80 శాతానికా? అనే అంశం ఆధారంగా టెండర్లు పిలుస్తారు. మూడో కేటగిరీలో... పంటలు దిగుబడి తగ్గిన పరిస్థితుల్లో రైతుకు అండగా ఉండేలా బీమా సదుపాయం కల్పిస్తారు. నకిలీ విత్తనాలు తదితర కారణాలతో పంటల దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు. అటువంటప్పుడు వారికి పరిహారం చెల్లించే వ్యవస్థ అందుబాటులోకి వస్తే రైతులకు మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని ఉచితంగా అమలు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎం-ఎఫ్‌బీవై) పథకంలో... రాష్ట్ర సర్కారు గతంలోనే చేరింది. దీని ప్రకారం 50 శాతం ప్రీమియం రైతు భరిస్తే.. 25శాతం కేంద్రం, మరో 25 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బీమా అమలు చేస్తుండటంతో... 75 శాతం ప్రీమియం భారం రాష్ట్ర ప్రభుత్వంపైనే పడుతుంది. ప్రీమియం కింద బీమా కంపెనీలకు 2019-20లో రూ.881కోట్లు, 2018-19లో రూ.545 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించింది. ఆ లెక్క ప్రకారం చూస్తే... ఈసారి ఆర్థికభారం మరింత పెరుగుతుంది. రాష్ట్రంలో వానాకాలంలో 1.30కోట్ల ఎకరాల వరకు పంటలు సాగయ్యే అవకాశాలున్నాయి. ఈ లెక్కన ప్రీమియం ఖర్చు భారీగా పెరిగే అవకాశం ఉంది.

పంటల వారీగా కటాఫ్ తేదీలు

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన మార్గదర్శకాల ప్రకారం పంటల వారీగా కటాఫ్ తేదీలు ఉన్నాయి. పత్తి పంటకు జూలై 14వ తేదీ, ఇతర పంటలకు జూలై 31వ తేదీ, మిర్చి పంటకు సెప్టెంబరు నెలాఖరు వరకు కటాఫ్ తేదీ ఉంది. కొన్ని పంటలను వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో చేర్చారు. అయితే, కటాఫ్ తేదీ దాటిన తర్వాత కూడా 15 రోజుల గ్రేస్ పీరియడ్ ఉంటుంది. ఆ గడువును మించి మరింత సమయం తీసుకోవాల్సి వస్తే ఢిల్లీలోని పీఎంఎఫ్‌బీవైతో రాష్ట్ర ప్రభుత్వాలు సంప్రదించటానికి వెసులుబాటు ఉంది. ప్రీమియం చెల్లింపునకు ఆమోదం తెలిపితే గడువు పొడిగించుకోవటానికి కూడా అవకాశాలున్నాయి. నవంబరు-డిసెంబరు నెలల్లో కూడా ఖరీఫ్ పంటలు, రైతుల వివరాలు పీఎంఎఫ్‌బీవైకి పంపిన సందర్భాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

అక్టోబరులో ఆర్‌ఆర్‌ఆర్‌కు శంకుస్థాపన

ఉత్తర భాగానికి రెండు నెలల్లో టెండర్లు.. దేశంలో బెస్ట్ హైకోర్టును నిర్మించబోతున్నాం

» మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): "రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) నిర్మాణానికి అక్టోబరులో శంకుస్థాపన చేస్తాం. ఉత్తరభాగానికి రెండు నెలల్లో టెండర్లకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాం" అని ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించారు. బుధవారం ఆయన సచివాలయంలో జాతీయ రహదారులు, ప్రాజెక్టులు, రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెండింగ్‌లో ఉన్న ఆస్పత్రుల నిర్మాణాలపై ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. "రాజేంద్రనగర్‌లో నిర్మించే హైకోర్టు భవనాన్ని దేశంలోనే బెస్ట్‌గా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం హైకోర్టు భవన డీపీఆర్ సిద్ధమవుతోంది" అని వివరించారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ రింగ్ రైల్ ప్రాజెక్టును తీసుకువస్తామని, ఆర్ఆర్ఆర్-ఓఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్లు, స్పోర్ట్స్ జోన్‌లు రాబోతున్నాయని తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రిని ప్రస్తుతం ఉన్న స్థానంలోనే.పాత డిజైన్‌లోనే నిర్మిస్తామని కోమటిరెడ్డి వివరించారు. "దీనిపై అఖిలపక్షం సమావేశాన్ని నిర్వహించాం. అవసరమైతే మరోసారి అఖిలపక్ష నేతలతో సమావేశమవుతాం. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, హైదరాబాద్ చుట్టుపక్కల నిర్మాణంలో ఉన్న 4 టిమ్స్ ఆస్పత్రులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకువస్తాం" అని వెల్లడించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని 6 లేన్లకు విస్తరించే పనులను డిసెంబరులోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. ఈ రోడ్డును గ్రీన్ ఫీల్డ్ హైవేగా మార్చేలా ముందుకువెళ్తున్నామన్నారు. "ఈ రహదారి విస్తరణ విషయంలో కాంట్రాక్ట్ కంపెనీ కొర్రీలు పెట్టడంతో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి.. పనులు త్వరగా జరిగేలా విజ్ఞప్తి చేస్తాం. ఈ రహదారిపై ప్రమాదాలు జరిగే 17 బ్లాక్‌స్పాట్లను ఇప్పటికే గుర్తించాం. వాటిని సరిచేసేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఈ నెల 23 నుంచి చౌటుప్పల్ వద్ద ఈ పనులను ప్రారంభిస్తాం. హైదరాబాద్-బెంగళూరు రహదారిని రూ.5,600 కోట్లతో ఎక్స్‌ప్రెస్ వేగా అభివృద్ధి చేయాలనే ఆలోచనలో ఉన్నాం. రూ.6వేల కోట్లతో శ్రీశైలం హైవేను నిర్మించాలనుకుంటున్నాం. వీటికి సంబంధించిన డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్, అంబర్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం" అని కోమటిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో పలు రోడ్లను జాతీయ రహదారులుగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీఎం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ ప్రాజెక్టును 'నమామి గంగే' మాదిరిగా చేపడతామన్నారు. ఢిల్లీలో తెలంగాణ భవన్‌ను దాదాపు 5.2 ఎకరాల స్థలంలో 22 అంతస్తులతో నిర్మించనున్నట్టుతెలిపారు. ఆర్‌అండ్‌బీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న చిన్న బిల్లులు రూ.400 కోట్ల వరకు ఉంటాయని, వాటిని త్వరలోనే చెల్లిస్తామన్నారు.

పార్కింగ్ లేకుండా ఎలా కట్టారు!

సచివాలయం పార్కింగ్ విషయంలో మంత్రి కోమటిరెడ్డి సంబంధిత అధికారులపై సీరియస్ అయినట్లు తెలిసింది. "అసలు పార్కింగ్ సదుపాయం లేకుండా.. సచివాలయాన్ని ఎలా నిర్మించారు? మంత్రులు, అధికారులు, వీఐపీల కార్లను ఎండకు ఎండేలా.. వానకు తడిసేలా పార్క్ చేయాలా? డ్రైవర్లు ఎక్కడుంటారు?" అని ప్రశ్నించినట్లు సమాచారం. దీనికి అధికారులు స్పందిస్తూ.. సోలార్ రూఫ్‌టాప్‌లను ఏర్పాటు చేసి, వాటి కింద కార్లను పార్క్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని, మల్టీపర్పస్ పార్కింగ్ అంశాన్ని అధ్యయనం చేస్తున్నామని వివరించారు.

కాగా, మంత్రి కోమటిరెడ్డి ఈనెల 25న ఢిల్లీ వెళ్లనున్నారు. రెండ్రోజులపాటు ఆయన ఢిల్లీలో ఉంటారు. రహదారుల నిర్మాణాలకు అనుమతులు, అటవీ భూముల సేకరణ సహా.. పలు అంశాలపై కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, భూపేంద్ర యాదవ్‌లతో సమావేశమవ్వనున్నారు.



కరీంనగర్ బస్టాప్‌లో ప్రసవం

» పసికందుకు జీవితకాలం ఉచిత బస్‌పాస్

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ బస్టాప్‌లో పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణికి ఆర్టీసీ సిబ్బంది పురుడు పోసి మానవత్వం చాటుకున్నారు. పుట్టిన ఆ పసికందుకు పుట్టిన రోజు కానుకగా జీవితకాలం ఉచిత బస్‌పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ ప్రకటించింది. ఈనెల 16న కుమారి అనే ఓ గర్భిణి భర్తతో కలిసి కరీంనగర్ బస్‌స్టేషన్‌లో భద్రాచాలం బస్సు కోసం ఎదురు చూసింది. ఆ సమయంలో ఆమెకు పురిటి నొప్పులు వచ్చాయి. గమనించిన ఆర్టీసీ సిబ్బంది వెంటనే 108కు సమాచారమిచ్చారు. ఆలోపే నొప్పులు తీవ్రతరం కావడంతో ఆర్టీసీ మహిళా సిబ్బంది ముందుకు వచ్చి చీరలను అడ్డుకట్టి బస్‌స్టేషన్‌లోనే పురుడు పోశారు. కుమారికి ఆడ బిడ్డ పుట్టింది. సకాలంలో స్పందించి గర్భిణికి కాన్పు చేసిన ఆర్టీసీ ఇబ్బంది సైదమ్మ, లావణ్య, స్రవంతి, భవాని, రేణుక, రజనీ కృష్ణ, అంజయ్యలను టీజీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ మెచ్చుకున్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో వారికి సన్మానం చేశారు. ఆర్టీసీ బస్సులు, బస్‌స్టేషన్‌లలో పుట్టిన పిల్లలకు జీవితకాల ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని గతంలో ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న నిర్ణయం ప్రకారం.. కుమారికి పుట్టిన ఆడపిల్లకు కూడా ఉచిత బస్‌పాస్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

మందుపాతర పేలి వృద్ధురాలికి తీవ్రగాయాలు

చర్ల, జూన్ 19: ఛత్తీస్‌గఢ్‌లో మందుపాతర పేలి ఓ వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూరు అడవుల్లో బుధవారం ఈ ఘటన జరిగింది. నడపల్లి గ్రామానికి చెందిన జోగిపాటి గంగ అనే వృద్ధురాలు ఊసూరు అడవుల్లోకి అటవీ ఉత్పత్తుల కోసం వెళ్లింది. ఈ క్రమంలో పోలీసులే లక్ష్యంగా మావోయిస్టులు అమర్చిన మందుపాతరపై కాలు వేయడంతో అది పేలి ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమె రెండు కాళ్లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆమెను బీజాపూర్ వైద్యశాలకు తరలించారు. గత ఐదు నెలల్లో బీజాపూర్ జిల్లాలో మందుపాతరల కారణంగా ఎనిమిదిమంది గాయపడ్డారని, వీరిలో నలుగురు మృతి చెందారని పోలీసులు చెబుతున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో మొదటిసారిగా..

అపోలోలో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ సర్వీస్

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): బోన్ మ్యారో(ఎముక మజ్జ) క్యాన్సర్ చికిత్సకు ఇకపై రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం లేదు..! ఆస్పత్రికి రాగానే.. చికిత్స చేయించుకుని, ఆ వెంటనే ఇంటికి వెళ్లొచ్చు. ఈ మేరకు హైదరాబాద్‌లోని అపోలో క్యాన్సర్ సెంటర్(ఏసీసీ) తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటి ఔట్ పేషెంట్ 'బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ సర్వీస్'ను అందుబాటులోకి తీసుకువచ్చింది. బుధవారం జరిగిన సమావేశంలో అపోలో-హైదరాబాద్ సీఈవో తేజస్వీ వీరేపల్లి, సీనియర్ కన్సల్టెంట్(హెమటో ఆంకాలజీ) డాక్టర్ పద్మజాలోకిరెడ్డి, గ్రూప్ ఆంకాలజీ ప్రెసిడెంట్ దినేశ్ మాధవన్, డాక్టర్ సునీత, నేహా కుమారి నాగ్ వివరాలను వెల్లడించారు. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్ సర్వీస్ వల్ల రోగులకు 50% వరకు ఖర్చు తగ్గుతుందని, రోగి వెంట కేర్‌టేకర్/కుటుంబ సభ్యులు ఉంటే సరిపోతుందని వారు పేర్కొన్నారు. రోగులు ఇకపై రోజుల తరబడి ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం ఉండబోదని, ఇంటి వద్దే కుటుంబంతో గడపవచ్చని వివరించారు.

60 బొగ్గు బ్లాకుల వేలం 21న

» హైదరాబాద్‌లో వేలం నిర్వహణ

» ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

పదో విడత బొగ్గు గనుల వేలం ఈ నెల 21న హైదరాబాద్‌లో జరుగనుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని 60 బొగ్గు బ్లాకులను వేలం వేయనున్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఈ వేలాన్ని ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో బొగ్గు, గనుల శాఖ సహాయమంత్రి సతీష్ చంద్ర దూబే, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అమృత్ లాల్ మీనా తదితరులు పాల్గొననున్నారు. మొత్తం 60 బొగ్గు బ్లాకుల్లో అత్యధికంగా ఒడిశాకు చెందిన 16 బ్లాకులు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 15, జార్ఖండ్‌కు చెందిన 6, బిహార్, పశ్చిమ బెంగాల్‌లకు చెందిన చెరో 3 బ్లాకులను వేలం వేయనుండగా... తెలంగాణలోని ఒక బ్లాకు (శ్రావణపల్లి) కూడా వేలం జాబితాలో ఉంది. ఈ బ్లాకులో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు గతంలో సింగరేణి నిర్వహించిన అన్వేషణలో తేలింది. అయితే, ఈ బ్లాకును దక్కించుకోవడానికి సింగరేణి కూడా తొలిసారి వేలంలో పాల్గొననుంది.

తల్లిదండ్రుల వాదన కూడా వినాలి కదా?

» మతాంతర వివాహంపై తల్లిదండ్రుల అభ్యంతరంతో రిజిస్ట్రేషన్ నిలిపివేసిన సబ్‌రిజిస్ట్రార్..హైకోర్టుకు ప్రేమికులు

» తల్లిదండ్రులు పార్టీగా లేనందున ఆదేశాలివ్వలేమన్న కోర్టు

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు అభ్యంతరం తెలపడంతో సబ్‌రిజిస్ట్రార్ వివాహ రిజిస్ట్రేషన్‌ను నిలిపేశారని.. రిజిస్ట్రేషన్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని ప్రేమికులు కోరగా... అభ్యంతరం తెలిపిన తల్లిదండ్రులను పార్టీలుగా చేర్చకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ఆర్టికల్ 226 అధికరణ కింద తమ అధికార పరిధిని ఉపయోగించే ముందు ఇతరుల వాదన కూడా వినాల్సి ఉంటుందని హైకోర్టు పేర్కొంది. తమ వివాహాన్ని ఎస్ఆర్ నగర్ సబ్‌రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయకపోవడాన్ని సవాలు చేస్తూ హైదరాబాద్ ఎస్ఆర్ నగర్‌కు చెందిన ఎస్. వైదేహి, యూసఫ్‌గూడకు చెందిన యూసఫ్ నజీబుద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వేర్వేరు మతాలకు చెందిన యువతీయువకులు కాలేజీ రోజుల నుంచి ప్రేమించుకుంటున్నారని తెలిపారు. వివాహానికి ఇంట్లో తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో మార్చి 13న దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. దీనిపై యువతి తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఏప్రిల్ 4న లేఖ ఇచ్చారని పేర్కొన్నారు. పెళ్లి చేసుకోబోయే వ్యక్తికి ఎలాంటి ఆదాయం లేదని.. వివాహానికి అనుమతించరాదని తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారన్నారు. దీంతో రిజిస్ట్రేషన్‌కు సబ్‌రిజిస్ట్రార్ నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. వాదనలు విన్న హైకోర్టు.. వివాహ రిజిస్ట్రేషన్‌కు అభ్యంతరం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రుల వాదన వినకుండా, వారు పార్టీలుగా లేకుండా ఎలా ఆదేశాలు ఇవ్వగలమని ప్రశ్నించింది. తల్లిదండ్రులను ప్రతివాదులుగా చేర్చాలని ఆదేశిస్తూ విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

మహిళా కానిస్టేబుల్‌పై ఎస్సై అత్యాచారం

భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం పోలీస్ క్వార్టర్స్‌లో వివాదాస్పద ఎస్సై భవానీసేన్ గౌడ్ దారుణం

» నెల రోజులుగా ఎస్సై లైంగిక వేధింపులు

» 16న అర్ధరాత్రి కిటికీలోంచి దూకి ఆమె ఇంట్లోకి చొరబాటు

» తుపాకీతో బెదిరించి అత్యాచారం.. ఎస్పీకి బాధితురాలి ఫిర్యాదు

» ఆరోపణల నిగ్గు తేల్చిన విచారణ బృందం ఘటనపై సీఎం రేవంత్ సీరియస్

» సర్వీస్ నుంచి ఎస్సై తొలగింపు

భూపాలపల్లి, హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల ఆరోపణలతో రెండేళ్ల క్రితం వేటు పడ్డా ఆ పోలీసు అధికారి బుద్ధి తెచ్చుకోలేదు. గతంలో పోలీసు ఉద్యోగానికి సిద్ధమవుతున్న ఓ యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడి సస్పెండైనా పద్ధతి మార్చుకోని ఆ అధికారి కొన్నాళ్లుగా సహచర ఉద్యోగినిపైనే కన్నేశాడు. లైంగిక వేధింపులకు పాల్పడి.. చివరకు పోలీసు క్వార్టర్స్‌లోని ఆమె నివాసంలోకి చొరబడి, తుపాకీతో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. వివాదాస్పద ఎస్సై, భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం స్టేషన్‌లో పనిచేస్తున్న భవానీసేన్ గౌడ్ నిర్వాకమే ఇది. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో అయ్యగారి దుశ్చేష్టలన్నీ విచారణలో తేలాయి. తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం అతడిని సర్వీసు నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రెండేళ్ల క్రితం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన ఎస్సైగా పనిచేస్తున్న రోజుల్లోనే భవానీసేన్ గౌడ్ వార్తల్లో నిలిచాడు. అప్పట్లో.. పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఓ యువతికి చదువుకునేందుకు పుస్తకాలిస్తానని మభ్యపెట్టి పోలీస్ స్టేషన్‌కు రప్పించుకొని లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. 2022 జూలై 12న జరిగిన ఈ ఘటనను 'ఆంధ్రజ్యోతి' ప్రముఖంగా ప్రచురించడంతో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైంది. అప్పట్లో భవానీసేన్ నిర్వాకం విచారణలో బయటపడటంతో అధికారులు అతడిని సస్పెండ్ చేశారు. అయితే ఉన్నతాధికారులతో తనకున్న పరిచయాలతో మూడు నెలల్లోనే అతడు పోస్టింగ్ సంపాదించుకున్నాడు. ఈ క్రమంలో భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వచ్చి ఎస్పీకి అటాచ్‌గా ఉన్నాడు. మళ్లీ పలుకుబడిని ఉపయోగించి కాళేశ్వరం స్టేషన్‌లో ఎస్సైగా పోస్టింగ్ తెచ్చుకున్నాడు. అక్కడే పనిచేస్తున్న ఓ మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై కన్నేసిన భవానీసేన్ గౌడ్, నెల రోజులుగా ఆమెను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. పోలీస్ క్వార్టర్స్‌లోని వేర్వేరు అంతస్తుల్లో ఎస్సై భవానీసేన్ గౌడ్, మహిళా హెడ్ కానిస్టేబుల్ ఉంటున్నారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం.. గత నెలలో బాధితురాలికి భవానీసేన్ ఫోన్ చేశాడు. తాను కాలు జారి పడ్డానని, గాయమైందని, తన గదికి రావాలని చెప్పాడు. బాధితురాలు.. ఆయన గదికి వెళ్లగా, ఆమె పట్ల అభ్యంతరకరంగా ప్రవర్తించాడు. ఆందోళనకుగురైన బాధితురాలు అతడిని తోసేసి, తన గదిలోకి వెళ్లిపోయింది. ఈనెల 16న అర్ధరాత్రి ఒంటిగంటకు క్వార్టర్స్‌లోని తన నివాసంలో మహిళా హెడ్ కానిస్టేబుల్ నిద్రిస్తుండగా భవానీసేన్ కిటికీలోంచి దూరాడు. అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించడంతో తన దగ్గర ఉన్న తుపాకీని గురిపెట్టి అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత ఇంట్లోంచి వెళుతూ.. విషయం బయటికి చెబితే తీవ్ర పరిణామాలుంటాయని గట్టిగా హెచ్చరించాడు. ఈ ఘటనపై బాధితురాలు ఎస్పీ కిరణ్‌ఖరేకు ఫిర్యాదు చేసింది. ఆయన బుధవారం భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డిలతో విచారణ బృందాన్ని ఏర్పాటు చేశారు. వారు ఈ వ్యవహారాన్ని పూర్తి స్థాయిలో విచారించి ఆరోపణలు ఎదుర్కొంటున్న సదరు ఎసై ఆగడాలు వాస్తవమేనని తేల్చారు. స్థానిక సిబ్బంది వాంగ్మూలాలను కూడా రికార్డు చేసి భవానిసేన్‌పై 449, 376(2) 324,506 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. బాధితురాలిని, భవానీసేన్‌ను వైద్య పరీక్షల కోసం భూపాలపల్లి ఆస్పత్రికి తరలించే ప్రయత్నంలో ఉండగా అతడు పారిపోయేందుకు యత్నించాడు.. భూపాలపల్లి పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వైద్య పరీక్షలు చేయించిన అనంతరం భవానిసేన్‌గౌడ్‌ను మెజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించారు.

పుస్తకాలిస్తా.. ఇంటికొస్తావా!

నిరుద్యోగ యువతిపై ఎస్సై లైంగిక వేధింపులు



ఆసిఫాబాద్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మొన్న ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు.. నిన్న సబ్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్.. నేడు మరో సబ్ ఇన్‌స్పెక్టర్ భవానీసేన్.. రాష్ట్రంలో ఖాకీల కీచక పర్వాలకు అంతే లేకుండా పోతోంది. పోలీసుల ప్రవర్తనపై తీవ్రమైన చర్చ జరుగుతున్న సమయంలోనే అదే తరహా ఘటన కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చోటు

2022లో ఓ యువతిపై జరిగిన దాడిని అప్పట్లో ఆంధ్రజ్యోతి ప్రముఖంగా వెలుగులోకి తెచ్చిన వార్త క్లిప్పింగ్

ఘటనపై సీఎం రేవంత్ సీరియస్

కాళేశ్వరం పోలీసు క్వార్టర్స్‌లో మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై అత్యాచారం ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. ఎస్సై భవానిసేన్ గౌడ్‌పై ఆరోపణలు వాస్తవం అని విచారణ బృందం తేల్చడంతో, అతడిని ఆర్టికల్ 311 ప్రకారం ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశించారు. ఆ మేరకు భవానీసేన్‌ను విధుల నుంచి పూర్తిగా తొలగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పోలీసు శాఖకు మచ్చ తెచ్చేలా ప్రవర్తించే సిబ్బందిని ఎంత మాత్రం ఉపేక్షించేది లేదని, అవసరమైతే సర్వీస్ నుంచి డిస్మిస్ చేసేందుకూ వెనుకాడబోమని డీజీపీ రవి గుప్తా హెచ్చరించారు. అధికారుల్లో ఒకరిద్దరి తీరు కారణంగా మొత్తంగా పోలీసు శాఖకే చెడ్డ పేరు వచ్చే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. సిబ్బంది పనితీరు, వ్యక్తిగత వ్యవహార శైలిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై త్వరలో ఒక పాలసీ

» హైదరాబాద్ జర్నలిస్టు సొసైటీ కోసం పదిరోజుల్లో జీవో

» జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు 3 నెలల పొడిగింపు: మంత్రి పొంగులేటి

ఖమ్మం సాంస్కృతికం, జూన్ 19: రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలోనే కొత్త పాలసీని తీసుకొస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. బుధవారం ఖమ్మంలో ప్రారంభమైన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర తృతీయ మహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో గతంలో జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాలు కోర్టులో కేసు వల్ల ఆగిపోయాయని, ఏడాది క్రితమే ఆ కేసు క్లియర్ అయినా గత ప్రభుత్వం వారికి ఇళ్ల స్థలాలను కేటాయించలేదని, త్వరలోనే ఆ స్థలాలను హైదరాబాద్ జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ సభ్యులకు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, వారం.. పదిరోజుల్లోనే దానికి సంబంధించిన జీవో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. అలాగే హైదరాబాద్‌లో మిగిలిపోయిన మిగతా జర్నలిస్టులకు, జిల్లాలు, మండలాల్లో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు త్వరలోనే ఒక పాలసీని తీసుకొస్తామని అన్నారు. అక్రిడిటేషన్ గడువు ఈ నెలఖారుతో ముగుస్తోందని దాన్ని మరో మూడు నెలల పాటు పొడిగిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. హెల్త్ కార్డులకు సంబంధించి వివిధ రాష్ట్రాల్లో ఉన్న పాలసీలను అధ్యయనం చేసి దానికి అనుగుణంగా జర్నలిస్టులకు వైద్యాన్ని అందిస్తామని పొంగులేటి ప్రకటించారు. అనంతరం మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం సమాచారశాఖను నిర్వీర్యం చేసిందన్నారు. అప్పటి ప్రభుత్వంలో సమాచారశాఖకు మంత్రి లేకపోవటంతో జర్నలిస్టులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

దర్యాప్తు ముగిసేదాకా.. స్నానం చేయొద్దు, అన్నం తినొద్దు

78 ఏళ్ల వృద్ధుడికి సైబర్ కేటుగాళ్ల బెదిరింపు

డ్రగ్స్ దొరికాయంటూ 10 లక్షల లూటీ

హైదరాబాద్ సిటీ, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): "మేం ముంబై సీబీఐ నుంచి మాట్లాడుతున్నాం. మీ పేరుతో డ్రగ్స్ పార్శిల్‌ను పట్టుకున్నాం. దర్యాప్తు పూర్తయ్యేదాకా మీరు స్నానం చేయొద్దు.. అన్నం తినొద్దు" అంటూ సైబర్ కేటుగాళ్లు ఓ 78 ఏళ్ల వృద్ధుడి నుంచి రూ.10 లక్షలు బదిలీ చేయించుకున్న ఉదంతమిది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. సోమవారం నాడు నగరానికి చెందిన 78 ఏళ్ల ఓ వృద్ధుడికి వాట్సాప్‌లో వీడియో కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి ముంబై సీబీఐ ఆఫీసర్‌ని అని పరిచయం చేసుకున్నాడు. "విదేశాలకు ఎగుమతి చేస్తున్న జామ్ బ్యాగుల మధ్య ఎండీఎంఏ డ్రగ్స్ దొరికాయి. ఆ డ్రగ్స్‌పై మీ అడ్రస్, ఫోన్ నంబర్ ఉన్నాయి. మీ బ్యాంకు ఖాతాలో అక్రమ లావాదేవీలు జరిగాయి" అంటూ బెదిరించాడు. " మా సార్‌తో మాట్లాడండి. వృద్ధులంటే ఆయనకు కనికరం ఉంది" అంటూ.. ఇంకో వ్యక్తిని కాన్ఫరెన్స్‌లోకి తీసుకువచ్చాడు. ఆ వ్యక్తి పోలీసు యూనిఫాంలో ఉన్నాడు. "మీరు వెంటనే మీ బ్యాంకు ఖాతాలు, ఫిక్స్ డిపాజిట్‌లను చెక్‌చేసుకోండి" అని ఆదేశించాడు. బాధితుడు బక్రీద్ రోజు బ్యాంకులకు సెలవని చెప్పడంతో.. దర్యాప్తును రేపటికి వాయిదా వేస్తున్నామని, అప్పటి వరకు స్నానం చేయొద్దని, అన్నం తినొద్దని ఆదేశించాడు. 10 లక్షలు పంపితే కేసు నుంచి మినహాయింపునిస్తానని చెప్పాడు. దీంతో బాధితుడు 10లక్షలు బదిలీ చేశారు. ఆ తర్వాత బాధితుడు జరిగిన మోసాన్ని గుర్తించి, సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కన్నవాడే కడతేర్చాడు

13 ఏళ్ల కూతురిపైనే కన్నేసిన తండ్రి.. కోరిక తీర్చలేదని ఉన్మాదం

» తలపై బండరాయితో మోదిన వైనం

» ఆపై ముక్కు, నోరు మూసి హత్య



కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు



మియాపూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): మంచి చదువు చెప్పిస్తూ.. చక్కని భవిష్యత్తు కోసం ఆకాంక్షించే కన్నతండ్రి మనసులో తన పట్ల 'దారుణమైన ఆలోచన' ఉందని ఏ కూతురు ఊహిస్తుంది? ఆప్యాయంగా ఎత్తుకోవాల్సిన చేతులే రాకాసి హస్తాలై తన ప్రాణాన్ని బలిగొంటాయని ఏ కూతురు అనుకుంటుంది? పాపం పదమూడేళ్ల ఆ చిట్టితల్లి.. 'వంట కోసం కట్టెలు తెద్దాం.. బండెక్కు' అని తండ్రి చెబితే మరో ఆలోచన లేకుండా బైక్ ఎక్కింది! ఫోన్లో బూతు వీడియోలు చూసేందుకు మరిగి.. రక్తం పంచుకు పుట్టిన కూతురుపైనే కన్నేసిన ఆ తండ్రి, ఆమెను ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి తన కోరిక తీర్చాలని అడిగాడు! భయంతో వణికిపోయిన ఆ పాప, 'నీ గురించి అమ్మకు చెబుతా'నంటూ బెదిరించింది! అంతే.. ఉన్మాదిగా మారిన అతడు, చిన్నారిని జుట్టు పట్టుకొని కొట్టి.. ఆపై బండరాయితో తలపై కొట్టాడు! తల పగిలి.. రక్తస్రావం జరగడంతో పాప అపస్మారక స్థితికి చేరుకుంది. అప్పటికీ ఉన్మాదం చల్లారని ఆ దుర్మార్గుడు.. ముక్కు, నోరు మూసి ఊపిరాడకుండా చేసి బాలికను చంపేశాడు! సభ్యసమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసే ఈ దారుణ ఘటన హైదరాబాద్ మియాపూర్ పరిధిలో జరిగింది. బాలిక హత్య జరిగిన 11 రోజులకు పోలీసులు మిస్టరీని ఛేదించారు. కన్న తండ్రే హంతకుడని నిర్ధారించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రాంతానికి చెందిన దంపతులు బతుకుదెరువు కోసం తమ కుమారుడు, కుమార్తె (13)ను వెంటబెట్టుకొని జూన్ మొదటివారంలో మియాపూర్ పరిధిలోని నడిగడ్డ తండాకు వచ్చి ఉంటున్నారు. ఇంటిపెద్ద ఓ ప్రైవేటు సంస్థలో చిన్న ఉద్యోగం చేస్తుంటే, ఆ ఇల్లాలు దగ్గర్లోని ఇళ్లలో పని చేస్తోంది. భార్య పొద్దున్నే పనికి వెళ్లినా, ఆ భర్త 11:30 దాకా ఖాళీగానే ఉండేవాడు. పనికి వెళ్లేదాకా సెల్‌ఫోన్‌లో బూతు వీడియోలు చూసేవాడు. ఆరో తరగతి చదువుతున్న తన కుమార్తెకు అప్పుడప్పుడూ డబ్బులిచ్చేవాడు. ఈనెల 7వ తేదీన ఆ పాపకు, ఆమె అన్నకు డబ్బుల విషయంలో గొడవ జరిగింది. అన్న మీద అలిగిన బాలిక ఉదయం 9:30కు ఇంట్లోంచి వెళ్లిపోయింది. దీంతో తండ్రి, కుమార్తెను వెతికేందుకు బయలుదేరాడు. తండా పరిసరాల్లోనే బాలిక కనిపించడంతో ఆమెను ఇంటికి తీసుకొచ్చాడు. అప్పటికే కూతురు మీద దుర్మార్గపు ఆలోచనతో ఉన్న అతడు, వంటచెరకు పేరుతో ఆమెను బైక్ మీద ఎక్కించుకొని సమీపంలోని పొదల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ తండ్రి తనతో పంచుకున్న మాటలు విని షాక్‌కు గురైన బాలిక, ఇంటికెళ్లాక అమ్మకు చెబుతానంటూ బెదిరించింది. విషయం బయటకు పొక్కితే తన పరువు పోతుందని భయపడిన తండ్రి ఉన్మాదిగా మారి ఆమెను దారుణంగా హత్యచేశాడు. తర్వాత ఇంటికొచ్చేశాడు. చనిపోయిందా? ప్రాణాలతో ఉందా? అని నిర్ధారించుకునేందుకు మళ్లీ ఘటనాస్థలికి వెళ్లాడు. చనిపోయిందని నిర్ధారించుకొని ఇంటికి తిరిగొచ్చాడు. సాయంత్రం తన కూతురు కనిపించడం లేదంటూ అతడే మియాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. 13న రాత్రి 10.30గంటలకు ముళ్లపొదల్లో కుళ్లిపోయిన స్థితిలో గుర్తుతెలియని బాలిక మృతదేహం కనిపించిందంటూ సమాచారం రావడంతో పోలీసులు వెళ్లారు. దుస్తుల ఆధారంగా మృతదేహం కూతురుదేనని తల్లిదండ్రులు నిర్ధారించారు. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ నివేదికలు రావాల్సి ఉండగా పోలీసులు వివిధ కోణాల్లో కేసు దర్యాప్తు చేశారు. విచారణలో హతురాలి కుటుంబ సభ్యులు సహకరించపోవడంతో అనుమానించి ఆ కోణంలో దర్యాప్తు మొదలు పెట్టారు. స్థానిక అపార్ట్‌మెంట్‌లోని సీసీ ఫుటేజీని పరిశీలించగా.. ఇంట్లోంచి బయటకు వెళ్లిన బాలికను తండ్రే తీసుకురావడం, తర్వాత అతడే తీసుకెళ్లడం కనిపించింది. అతడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తొలుత తనకేమీ తెలియదని బుకాయించినా పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో నేరం అంగీకరించాడు.

ఛత్తీస్‌గఢ్‌తో ఒప్పందం రాష్ట్రానికి శిరోభారం

తెలంగాణ భరించలేనంతగా భద్రాద్రి ప్లాంట్ భారం.. విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్, తిమ్మారెడ్డి

» జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్‌కు వివరాల అందజేత

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ భరించలేనంత స్థాయికి భద్రాద్రి పవర్ ప్లాంట్ భారం చేరిందని, ఛత్తీస్‌గఢ్‌తో చేసుకున్న విద్యుత్ ఒప్పందం రాష్ట్రానికి శిరోభారంగా మారిందని విద్యుత్ రంగ నిపుణులు వేణుగోపాల్, తిమ్మారెడ్డి పేర్కొన్నారు. విద్యుత్‌పై విచారణ చేస్తున్న కమిషన్‌కు వారు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. అయితే వాటిపై మరిన్ని వివరాలు అందించాలని కమిషన్ కోరగా బుధవారం జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ముందు హాజరై వివరాలు అందించారు. తర్వాత విలేకరులతో మాట్లాడారు. పోటీ బిడ్డింగ్ లేకుండా ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణానికి పూనుకున్నారని చెప్పారు. 2017లో ఛత్తీస్‌గఢ్ విద్యుత్ వచ్చేనాటికే భూపాలపల్లిలో కాకతీయ థర్మల్ పవర్ ప్లాంట్, 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ ప్లాంట్‌తోపాటు జూరాలలో జలవిద్యుత్ ఉత్పాదన అందుబాటులోకి వచ్చిందని తిమ్మారెడ్డి చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌తో 1,000 మెగావాట్లకు ఒప్పందం చేసుకోగా..అరకొర విద్యుత్ మాత్రమే చేరిందని, దీనికోసం కారిడార్‌కు రూ.630 కోట్ల దాకా చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ యూనిట్ రూ.3.90కు రాలేదని, ఒక్క యూనిట్ రూ.5.40కు చేరుకుందని చెప్పారు. భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం పూర్తికాక ముందే 2018 జనవరి నుంచి రాష్ట్రంలో అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారని, ఈ ప్లాంట్‌ను రూ.7.900 కోట్లతో చేపట్టగా... జెన్‌కో చేపట్టిన ఇతర పనులన్నీ కలిపి రూ.10 వేల కోట్లకు చేరిందన్నారు.

ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌తో కీడే: వేణుగోపాల్

ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌తో తెలంగాణకు మేలు కంటే కీడే ఎక్కువ జరిగిందని విద్యుత్ రంగ నిపుణుడు వేణుగోపాల్ చెప్పారు. 2014లో ఒప్పందం చేసుకుంటే 2017-18లో 1,000 మెగావాట్లకుగాను 75శాతం మాత్రమే చేరిందని, 2022 ఏప్రిల్ నుంచి చెల్లింపులు చేయని కారణంగా సరఫరా ఆగిపోయిందన్నారు. దీంతో ఛత్తీస్‌గఢ్ విద్యుత్ స్థానంలో బహిరంగ విపణి నుంచి యూనిట్‌కు రూ.10, రూ.15, రూ.20లకు కరెంట్ కొనుగోలు చేశారని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్‌ను రాష్ట్రానికి తరలించేందుకు పవర్ గ్రిడ్‌తో 1,000 మెగావాట్ల కారిడార్ బుక్ చేసుకున్నారని, దీన్ని వినియోగించుకోనప్పటికీ రూ.635 కోట్లకుపైగా చెల్లింపులు చేశారని, మరో 1,000 మెగావాట్ల కారిడార్‌ను బుక్ చేసుకొని రద్దు చేసుకున్నందుకు రూ.261 కోట్లకు పవర్ గ్రిడ్ నోటీసులు ఇచ్చిందన్నారు. రూ.3 వేల కోట్ల బిల్లులు ఛత్తీస్‌గఢ్‌కు చెల్లించాల్సి ఉందని చెప్పారు. సకాలంలో నిర్మాణాలు కానందువల్ల యాదాద్రి, భద్రాద్రిలతో పెట్టుబడి వ్యయం భారీగా పెరగనుందన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్, తిమ్మారెడ్డి

శాంతియుత నిరసన తప్పు కాదు : హైకోర్టు

హైదరాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజాజీవనానికి ఎటువంటి ఆటంకం కలిగించకుండా, అసభ్యపదజాలం ఉపయోగించకుండా నినాదాలు చేస్తూ బహిరంగ ప్రదేశాల్లో శాంతియుతంగా నిరసన తెలపడం చట్ట ప్రకారం తప్పు కాదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఇతరులను ఇబ్బంది పెట్టకుండా రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19 (1)ఏ పరిధిలో వాక్‌స్వాతంత్ర్యాన్ని ఉపయోగించుకోవడాన్ని నేరంగా పరిగణించలేమని పేర్కొంది. పౌర హక్కుల సంఘాలకు చెందిన ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా, వరవరరావును విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యార్థి వేదిక (టీవీవీ)కు చెందిన 13 మంది సభ్యులు 2019 మే 17న సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ప్రదర్శనకు ముందస్తు అనుమతి తీసుకోలేదని పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టేయాలని కోరుతూ నిందితులు హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కే సుజన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్లు నిరసన తెలిపే క్రమంలో అసభ్యపదజాలం వాడినట్లు, పబ్లిక్ ఆర్డర్‌కు ఇబ్బంది కలిగించినట్లు నిరూపించే ఆధారాలు లేవని ధర్మాసనం పేర్కొంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



న్యూఢిల్లీలోని కథక్ కేంద్ర(నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కథక్ డ్యాన్స్)- సంగీతం, కథక్ నృత్యం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హిందీ మాధ్యమంలో బోధన ఉంటుంది. అభ్యర్థులకు హిందీ, ఇంగ్లీష్ భాషలు చదవడం, రాయడం తెలిసి ఉండాలి. అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు స్టయిపెండ్ సౌకర్యం ఉంది.

'కథక్ కేంద్ర'లో నృత్యం, సంగీతం

కథక్ డ్యాన్స్

- ఇందులో రెండు ఎలిమెంటరీ కోర్సులు, నాలుగు అడ్వాన్స్‌డ్ కోర్సులు ఉన్నాయి.
- **ఎలిమెంటరీ కోర్సులు:** అయిదేళ్ల ఫౌండేషన్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా కోర్సు
- **అడ్వాన్స్‌డ్ కోర్సులు:** ఏడాది వ్యవధిగల ప్రిపరేటరీ ఫేజ్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా ఆనర్స్ కోర్సు, రెండేళ్ల పోస్ట్ డిప్లొమా కోర్సు, ఆర్నెల్ల రిఫ్రెషర్ కోర్సు.

సంగీతం: ఇందులో ఏడాది వ్యవధిగల సర్టిఫికెట్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఓకల్), మూడేళ్ల డిప్లొమా స్పెషల్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఓకల్) ఉన్నాయి.

నృత్యం కోర్సులకు అర్హత

- ఫౌండేషన్ కోర్సులో ప్రవేశానికి కనీసం మూడోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. కథక్ నృత్యంలో పరిచయం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- డిప్లొమా కోర్సులో ప్రవేశానికి కనీసం తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. సంగీతం, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి/అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- డిప్లొమా ఆనర్స్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా (కథక్) పూర్తి ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. హిందుస్థానీ ఓకల్ మ్యూజిక్, తబల/పఖవాజ్ శిక్షణ పొందినవారికి; లిటరేచర్, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- పోస్ట్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఆనర్స్(కథక్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 21 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. లిటరేచర్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- రిఫ్రెషర్ కోర్సులో ప్రవేశానికి పోస్ట్ డిప్లొమా కోర్సు పూర్తిచేసి ఉండాలి. డ్యాన్స్ టీచర్‌గా పనిచేస్తూ ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 40 ఏళ్లలోపు ఉండాలి.



సంగీతం

కోర్సులకు అర్హత: సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఓకల్ మ్యూజిక్‌లో అవగాహన తప్పనిసరి.

- డిప్లొమా స్పెషల్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు 20 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఓకల్ మ్యూజిక్‌లో పరిజ్ఞానం ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిషన్ టెస్ట్‌కు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూన్ 29న
- **అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులకు జూలై 2, 3, 4; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులకు జూలై 8, 9, 10
- **ఫలితాలు విడుదల:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులకు జూలై 5; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులకు జూలై 11
- **తరగతులు ప్రారంభం:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులు జూలై 9 నుంచి; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులు జూలై 16 నుంచి
- **ఈ-మెయిల్:** admission@kathakkendra.in
- **వెబ్‌సైట్:** www.kathakkendra.in

తెలంగాణ ఎస్సీ గురుకులాల్లో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్



హైదరాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐ)-ఆపరేషన్ బ్లూ క్రిస్టల్‌లో భాగంగా నీట్ 2025కు హాజరయ్యే అభ్యర్థుల కోసం లాంగ్ టర్మ్ కోచింగ్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. నీట్ 2024లో సాధించిన మార్కుల ఆధారంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) గురుకులాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. బాల బాలికలకు క్యాంపస్‌లు వేరుగా ఉంటాయి. బోధన ఉచితం. భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు. రాష్ట్రానికి చెందిన ఎస్సీ, బీసీ, ఓసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

సీఓఈ గురుకులాలు - సీట్లు

- **గౌలిదొడ్డి సీఓఈ:** మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో బాల బాలికలకు చెరి సమానంగా 100 సీట్లు కేటాయించారు. మొత్తమ్మీద ఎస్సీ అభ్యర్థులకు 190, బీసీలకు 5, ఓసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 5 సీట్లు నిర్దేశించారు.
- చిలుకూరు సీఓఈలో బాలురకు 50 సీట్లు, నార్సింగి సీఓఈలో బాలికలకు 50 సీట్లు, మహేంద్ర హిల్స్ సీఓఈలో బాలికలకు 50 సీట్లు ఉన్నాయి. ఒక్కో సీఓఈలో బీసీలకు 1, ఓసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి 1, ఎస్సీలకు 48 సీట్లు నిర్దేశించారు.

అర్హత: అభ్యర్థులు నీట్ 2024 రాసి ఉండాలి. కుటుంబ వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,50,000; పట్టణాల్లో రూ.2,00,000 మించకూడదు. గతంలో ఆపరేషన్ బ్లూ క్రిస్టల్ కింద ఈ అవకాశాన్ని వినియోగించుకున్నవారు ప్రస్తుతం దరఖాస్తుకు అనర్హులు.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 24
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 27
- **సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్:** జూన్ 28
- **తరగతులు ప్రారంభం:** జూలై 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.tswreis.ac.in

ఉస్మానియా వర్సిటీలో ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'ప్రొఫెసర్ టీ.నవనీత రావు సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్' విభాగం- నాలుగో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి వారం. ఇందులో రీసెర్చ్ టెక్నిక్స్, టెక్నికల్ స్కిల్స్‌కు సంబంధించి శిక్షణ ఇస్తారు. జూన్ 24 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు ఉంటాయి. లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు, పీహెచ్‌డీ స్కాలర్స్, పీజీ స్టూడెంట్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత రుసుం చెల్లించి వర్సిటీ గెస్ట్ హౌస్‌లో వసతి సౌకర్యం పొందవచ్చు. అభ్యర్థులందరూ ల్యాబ్ కోట్, మాస్క్ వెంట తెచ్చుకోవాలి. ప్రోగ్రామ్ చివరలో అభ్యర్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తారు.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.3,500
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 23
- **ఈ-మెయిల్:** cfrdou@gmail.com
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in



ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ



ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్సెస్ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్- 'ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 స్కోర్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ పొందినవారికి నెలకు రూ.5,000ల ఫెలోషిప్ ఇస్తారు. రీసెర్చ్‌పై ఆసక్తిగల అభ్యర్థులు మూడో సెమిస్టర్‌లో ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లోకి మారవచ్చు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగు/అయిదేళ్ల డిగ్రీ(బయాలజీ/బయోటెక్నాలజీ/అగ్రికల్చర్-బయాలజీ ఒక సబ్జెక్టుగా) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీలోకి మారాలనుకునే వారు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 21
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు, సర్టిఫికెట్‌లు; జీఏటీ-బీ 2024 ర్యాంక్ కార్డ్; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు; అభ్యర్థి ఫొటో, సంతకం
- **వెబ్‌సైట్:** www.iiti.ac.in

జాబ్ కార్నర్

పీజీసీఎల్‌లో ఇంజనీర్ ట్రెయినీలు

మొత్తం ఖాళీలు 435

న్యూఢిల్లీలోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్), సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(సీటీయూఐఎల్).. వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఇంజనీర్ ట్రెయినీ(ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/సివిల్/కంప్యూటర్ సైన్స్)

విభాగాల వారీగా ఖాళీలు: ఎలక్ట్రికల్-331, ఎలక్ట్రానిక్స్-14, సివిల్-53, కంప్యూటర్ సైన్స్-37.

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి ఇంజనీరింగ్‌లో బీఈ, బీటెక్, బీఎస్సీ(ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్(పవర్)/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/పవర్ సిస్టమ్స్ ఇంజనీరింగ్/పవర్ ఇంజనీరింగ్(ఎలక్ట్రికల్)/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. వ్యాలిడ్ గేట్-2024 స్కోరు సాధించి ఉండాలి.

వయోపరిమితి: 18-28 సంవత్సరాల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.40,000 నుంచి రూ.1,40,000

ఎంపిక ప్రక్రియ: గేట్ 2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, సర్టిఫికెట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 4

వెబ్‌సైట్: www.powergrid.in/jobopportunities

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

మొత్తం ఖాళీలు 97

ముంబయిలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: ఆఫీసర్ గ్రేడ్-ఎ(అసిస్టెంట్ మేనేజర్)

స్ట్రీమ్: జనరల్-62, లీగల్-5, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-24, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్-2, రీసెర్చ్-2, అఫీషియల్ లాంగ్వేజ్-2

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఎల్ఎల్‌బీ/పీజీ/సీఏ/సీఎఫ్ఏ/సీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

గరిష్ఠ వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు

పే స్కేల్: నెలకు రూ.44,500 - రూ.89,150

ఎంపిక విధానం: ఫేజ్-1, ఫేజ్-2(పరీక్షలు), ఫేజ్-3(ఇంటర్వ్యూ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా

దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ వారికి రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 30

వెబ్‌సైట్: https://www.sebi.gov.in/index.html

మేనేజ్‌లో ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్‌లు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. మేనేజ్ ఫెలో: **2 పోస్టులు**
2. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్(అకడమిక్): **1 పోస్టు**
3. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్(ఐటీ): **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం, కంప్యూటర్ పరిజ్ఞానం, హిందీ, స్థానిక భాషల్లో అవగాహన ఉండాలి.

జీతం: మేనేజ్ ఫెలో పోస్టుకు రూ.75,000. ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు రూ.36,000.

వయోపరిమితి: మేనేజ్ ఫెలో పోస్టుకు 45 ఏళ్లు, ప్రోగ్రామ్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు 40 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, తదితరాల ఆధారంగా

గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 28

వెబ్‌సైట్: https://www.manage.gov.in/

దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఉద్యోగాలు

విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. టీచింగ్: **16 ఖాళీలు**
2. నాన్ టీచింగ్: **3 ఖాళీలు**

పోస్టుల వివరాలు: ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, టీచింగ్ అసోసియేట్స్, రీసెర్చ్ అసిస్టెంట్స్, అకౌంట్స్ ఆఫీసర్, పర్సనల్ సెక్రటరీ, అసిస్టెంట్ రిజిస్ట్రార్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా

చిరునామా: దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ, న్యాయప్రస్థ, సబ్బవరం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 1

వెబ్‌సైట్: https://dsnlu.ac.in/

లిటిల్స్

మీకు తెలుసా?



- ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) గురించి ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తోంది. చాలా మంది ఇది కొత్తగా వచ్చిన టెక్నాలజీ అనుకుంటారు. బ్రిటన్‌కు చెందిన ఎలాన్ ట్యూరింగ్ అనే ఒక శాస్త్రవేత్త - కంప్యూటర్లకు ఇంటిలిజెన్స్ ఉంటుందా? లేదా అనే విషయాన్ని కనుగొనటానికి టర్నింగ్ టెస్ట్‌ను రూపొందించాడు. మనకు తెలిసిన తొలి ఏఐ ప్రొగ్రామ్ ఇదే! దీనిని 1956లో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌లో దీనిని తొలి సారి ప్రదర్శించాడు.
- ఏఐ పూర్తిగా అందుబాటులోకి వస్తే ప్రపంచవ్యాప్తంగా పనిచేసే వారిలో 40 శాతం మందికి ఉద్యోగాలు ఉండవని.. వారి స్థానాలను ఏఐ భర్తీ చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.
- మానవుల మాదిరిగా పనిచేసే తొలి రోబో పేరు సోఫియా. దీనిని 2016లో తయారుచేశారు. ఇది మానవుల మాదిరిగానే మాట్లాడగలుగుతుంది. 2017లో దీనికి సౌదీ అరేబియా పౌరసత్వం కూడా ఇచ్చారు.





10 తేడాలు గుర్తించండి

దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 337

	1			7			8	9
				6				
7		9	3					6
		2			6		7	
8	6	1				9	5	4
	3		8			2		
6					7	4		5
				1				
1	7			8			2	

సుడోకు - 336 సమాధానం

5	6	9	7	1	3	4	8	2
2	1	8	5	9	4	3	7	6
4	7	3	8	2	6	5	9	1
7	3	1	2	5	8	6	4	9
6	9	4	1	3	7	8	2	5
8	2	5	6	4	9	1	3	7
3	4	2	9	6	5	7	1	8
9	8	6	3	7	1	2	5	4
1	5	7	4	8	2	9	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.